ఈనాడు
హైదరాబాద్
HMDA
బుధవారం అక్టోబరు 23, 2024



అమ్మో.. ఐటీ కారిడర్..

రోజురోజుకు ఐటీ కారిడార్‌లో వాహనాలు, జనం రద్దీ పెరిగిపోతోంది. మంగళవారం సాయంత్రం బయో డైవర్సిటీ నుంచి రహేజా మైండ్‌స్పేస్ మీదుగా కూకట్‌పల్లి ప్రధాన రహదారిపై వాహనాలు గంటలకొద్దీ బారులు తీరాయి. మరోవైపు ఇళ్లకు వెళ్లే ఐటీ ఉద్యోగులతో రాయదుర్గం మెట్రో స్టేషన్ కిక్కిరిసిపోయింది.

రివ్యూ ఓపీ మరింత వేగంగా

నిమ్స్‌లో కియోస్క్ యంత్రాల ఏర్పాటు


మిలీనియం బ్లాక్‌లో ఏర్పాటు చేసిన యంత్రం

నిమ్స్, న్యూస్‌టుడే: నిత్యం వేలాది మంది వైద్య సేవలకు పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రికి వస్తారు. రోజుల వ్యవధిలో మళ్లీ వచ్చే వారు సైతం ఓపీ చీటీ తీసుకోవాలంటే గంటలు నిరీక్షించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో రివ్యూ ఓపీకి నిరీక్షణ లేకుండా రెండే నిమిషాల్లో చీటీ అందించేలా కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. పైలెట్ ప్రాజెక్టుగా మిలీనియం బ్లాక్‌లో ఏర్పాటుచేశారు. ఓ ఐటీ సంస్థ సహకారంతో వీటిని ఏర్పాటుచేశామని, పనితీరు బాగుంటే అన్నీ విభాగాల్లో ఏర్పాటు చేస్తామని ఆస్పత్రి డైరెక్టర్ నగరి బీరప్ప తెలిపారు.

ఎలా పనిచేస్తాయంటే..?

ఆస్పత్రిలో 31విభాగాల్లో ఓపీ సేవలు ఉంటాయి. నిత్యం 3500మంది దాకా వస్తుంటారు. అరవై శాతం రోగులు కొద్ది రోజుల్లోనే రెండుమూడు సార్లు రావాల్సి ఉంటుంది. వచ్చిన ప్రతీసారి క్యూలో ఉండే పనిలేకుండా ఈ యంత్రంతో తీసుకోవచ్చు. మిలీనియం బ్లాక్‌లో న్యూరాలజీ, న్యూరోసర్జరీ, రుమటాలజీ, సైకియాట్రిక్ ఓపీ సేవలందిస్తారు. ఉదాహరణకు ఓ రోగి న్యూరో సర్జరీ విభాగానికి వచ్చి ఓపీ తీసుకున్నారు. వైద్యున్ని కలిస్తే కొన్ని పరీక్షలు సూచిస్తారు. రిపోర్టులు మరుసటిరోజు వస్తాయి. మరో సారి వైద్యున్ని కలవాల్సిఉంటుంది. అప్పుడు కౌంటర్ల వద్దకాకుండా కియోస్క్ వద్దకు వెళ్లి సీఆర్ నంబరు నమోదుచేస్తే వివరాలు చూపిస్తాయి. ఓపీచీటీ వస్తుంది. దాంతో వైద్యుడి వద్దకు వెళ్లవచ్చు. రూ.100వెచ్చించి తీసుకునే ఓపీకి 14 రోజుల గడువుంటుంది. గడువు ముగిసేవరకు ఎన్నిసార్లయినా ఈ యంత్రం సాయంతో తీసుకోవచ్చు.

ఆర్టీఏలో రామ్‌చరణ్ సందడి


జేటీసీ రమేష్‌తో రామ్ చరణ్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయంలో సినీ నటుడు రామ్ చరణ్ సందడి చేశారు. తన కొత్త రోల్స్ రాయిస్ కారును టీజీ09 సీ2727 నంబరుతో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు మంగళవారం మధ్యాహ్నం రవాణాశాఖ కార్యాలయానికి వచ్చారు. రిజిస్ట్రేషన్ నిమిత్తం ఫొటో తీయించుకొని, సంతకం చేశారు. రామ్‌చరణ్ వస్తున్న విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు కార్యాలయం చేరుకుని ఆయనతో ఫొటోలు దిగారు.

చెత్త కష్టాలకు చెక్ పెట్టేలా..

నగరం నలువైపులా 4 కేంద్రాలు

- విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు సైతం..
- సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు

ఒకే దెబ్బకు రెండు పిట్టల న్నట్లుగా.. మహా నగరంలో చెత్త సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపబోతోంది. ప్రస్తుతం నగరంలో ఉత్పత్తి అవుతున్న చెత్తను జవహర్‌నగర్‌కు మాత్రమే తరలించడంతో ఈ ప్రాంతంలో తీవ్ర సమస్యలు ఏర్పడుతున్నాయి. దీన్ని అధిగమించేలా, నగరానికి నాలుగు వైపులా చెత్త తరలింపు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడే చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తికేంద్రాల ఏర్పాటుకూ ప్రణాళిక సిద్ధమైంది. అందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఆదేశించారు. ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యచరణపై పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్ బల్దియా అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులతో చర్చించారు.

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా ప్యారానగర్‌లో 150 ఎకరాల భూమిని సేకరించారు. ఇక్కడ చెత్త నిర్వహణతో పాటు 15 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం ఏర్పాటుచేయబోతున్నారు. జవహర్‌నగర్‌లో మ్యానువల్‌గా చెత్త నిర్వహణ చేస్తుండగా ప్యారానగర్‌లో మాత్రం ఆధునిక పద్ధతులను అవలంబించబోతున్నారు. ఒక బంకర్ నిర్మించి నాలుగువైపులా పెద్ద షెడ్డు నిర్మించనున్నారు. బంకర్‌లోనే చెత్తను తడి, పొడి చెత్తగా విభజిస్తామని, దీంతో కాలుష్య సమస్య ఏర్పడదని అధికారులు తెలిపారు. ఈ కేంద్రంలో 1500 టన్నుల పొడి చెత్తను విద్యుదుత్పత్తికి వినియోగించనున్నారు.


జవహర్‌నగర్‌లో విద్యుత్ ఉత్పత్తికేంద్రం

“ చౌటుప్పల్ దగ్గర మల్కాపూర్‌లో మరో కేంద్రాన్ని 100 ఎకరాల్లో ఏర్పాటుచేయనున్నారు. ఇక్కడ కూడా 15 ఎంవీ విద్యుత్తు కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో కూడా 40 ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఇంత తక్కువ స్థలంలో నిర్వహణ కేంద్రం ఏర్పాటు కష్టసాధ్యమని చెబుతున్నారు. ”


ఆధునిక పద్ధతిలో నడిచే ప్యారానగర్ కేంద్రం నమూనా

నగరంతో పాటు చుట్టుపక్కల మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రతిరోజూ ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తిఅవుతోంది. ఇందులో సగం పొడిగా, మరో సగం తడి చెత్త. మొత్తం చెత్తను కొన్నేళ్లుగా జవహర్‌నగర్‌కు తరలిస్తున్నారు. ఇక్కడ 24 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాన్ని కొన్నాళ్లకిందటే రాంకీ సంస్థ ఏర్పాటుచేసింది. ఇందులో 1400 టన్నుల పొడి చెత్తను వినియోగిస్తున్నారు. మరో 24 ఎంవీ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం నిర్మాణం మార్చికల్లా పూర్తవుతుందని ఈఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దుండిగల్‌లో మరో విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక నగర వ్యాప్తంగా చెత్తను జవహర్‌నగర్‌కు తరలించడం కష్టంగా మారడంతో మరో నాలుగు చోట్ల చెత్త నిర్వహణ, విద్యుత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. బల్దియా అధికారులు ఏడాదిగా సంబంధిత స్థలాల అన్వేషణ చేశారు.

పటాన్‌చెరు మార్గం లక్డారం సమీపంలో వంద ఎకరాల్లో ఒక చెత్త నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. ఇక్కడా 15 ఎంవీ విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. దీనికి కూడా 1500 టన్నుల పొడి చెత్త అవసరమవుతుంది.



విధి లేక.. వీధిలో నడవలేక

పాత నగరంలోని తలాబ్ కట్ట సిద్ధిఖీనగర్‌లోని ఓ ఇరుకు గల్లీలో డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్విన మట్టి ఇలా రోడ్డంతా కుప్పలుగా వేశారు. ఇక్కడ నివాసముండేవారు కనీసం కాలినడకన కూడా వెళ్లడానికి వీల్లేని పరిస్థితి నెలకొనడంతో నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కుక్కను బెదిరించి.. భవనం పైనుంచి పడి యువకుడి దుర్మరణం


సీసీ టీవీలో నమోదైన దృశ్యం

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: ఓ యువకుడు కుక్కని బెదిరిద్దామని వెంటపడ్డాడు.. కుక్క ఎదురు దాడికి దిగడంతో భయభ్రాంతులకు గురై భవనంపై నుంచి పడి ప్రాణాలు కోల్పోయాడు. చందానగర్ ఠాణా పరిధిలోని ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి వివరాల ప్రకారం.. తెనాలికి చెందిన గాయాపు సుబ్బారావు చాల ఏళ్ల క్రితం నగరానికి వచ్చి పటాన్‌చెరు నియోజకవర్గం రామచంద్రాపురంలోని జ్యోతినగర్‌లో స్థిరపడ్డాడు. అతని కుమారుడు ఉదయ్‌కిరణ్(22) పెయింటింగ్ పని చేస్తున్నాడు. స్నేహితుడి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం రాత్రి చందానగర్‌లోని వీవీ ప్రైడ్ హోటల్‌లో గది తీసుకొని దాదాపు 8 మంది స్నేహితులు పార్టీ చేసుకుంటున్నారు. అర్ధరాత్రి గది బయటికి వచ్చిన ఉదయ్‌కు కుక్క ఎదురవడంతో బెదిరిస్తూ దాని వెంట పడ్డాడు. కుక్క తిరిగి ఉదయ్‌ను తరమడంతో పరుగు తీశాడు. కిటికీలోకి ఎక్కి తప్పించుకుందామన్న క్రమంలో మూడో అంతస్తు నుంచి కింద పడ్డాడు. స్నేహితులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై చందానగర్ పోలీసులు సమాచారం బయటకిరాకుండా జాగ్రత్త వహించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యువకులు మద్యం తాగినట్లు భావిస్తున్నారు. హోటల్ పేరు బయటికి రాకుండా చూడాలని భావించినట్లు విమర్శలు వస్తున్నాయి.

కుక్క ఎక్కడిది?.. హోటల్ గదిలో మూడో అంతస్తులోని కారిడార్‌లోకి కుక్క ఎలా వచ్చిందనేది పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆహారం కోసం మూడో అంతస్తుకు వచ్చిన వీధి కుక్కనా? పెంపుడు కుక్కనా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇంతవరకు సమాచారం లభించలేదని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

ఓటీఎస్‌కు.. ఇంకా 9 రోజులే

వడ్డీ, ఆలస్యం రుసుం నుంచి విముక్తి



ఈనాడు, హైదరాబాద్: జలమండలి అందుబాటులోకి తెచ్చిన వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకం(ఓటీఎస్)కు పది రోజులే గడువు మిగిలింది. ఈనెల 31లోపు నీటి బిల్లుల బకాయిలు చెల్లిస్తే వడ్డీ, ఆలస్య రుసుం మాఫీ చేయనున్నట్లు జలమండలి ప్రకటించిన సంగతి తెలిసిందే. వెంటనే పథకాన్ని వినియోగించుకోవాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి వినియోగదారులకు సూచించారు. గతంలో ఓటీఎస్ పథకాన్ని వినియోగించుకోని వారు.. ఒకేసారి బకాయి మొత్తం చెల్లిస్తే... ఆలస్య రుసుం, వడ్డీ పూర్తిగా మాఫీ అవుతాయి. ఇప్పటికే బిల్లులు కట్టకుండా నల్లా కనెక్షన్ తొలగించిన వినియోగదారులు సైతం లబ్ధి పొందాలంటే ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు మొత్తం చెల్లించాలని జలమండలి పేర్కొంది. గ్రేటర్‌లో ప్రస్తుతం అసలు వడ్డీ కలిపి రూ.1706కోట్లు బకాయిలు పేరుకున్నాయి. ఓటీఎస్ వినియోగంతో రూ.1189 కోట్ల వరకు రాయితీ పొందే వీలుంది. బకాయిల వివరాలు వినియోగదారుల సెల్‌ఫోన్‌కు జలమండలి ఎస్ఎంఎస్ రూపంలో పంపనుంది.

చెల్లింపులు ఇలా..

- జలమండలి కార్యాలయాల్లోని నగదు కౌంటర్ల వద్దకు వెళ్లి బకాయిలు చెల్లించవచ్చు
- ఆన్‌లైన్ విధానంలో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా చెల్లించొచ్చు.
- ఎన్ఈఎఫ్‌టీ, ఆర్‌టీజీఎస్, బీపీపీఎస్ ద్వారా చెల్లించే వెసులుబాటుంది.
- జలమండలి అధికారిక వెబ్‌సైట్ హైదరాబాద్‌వాటర్ డాట్ జీవోవి డాట్ ఇన్ సైట్‌లోకి లాగిన్ అయి చేయవచ్చు
- లైన్‌మెన్ల వద్ద ఉన్న ఈపీఓఎస్ యంత్రాల ద్వారా, జలమండలి అందించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ ద్వారా అవకాశముంది.



ఏడుగురు కలిసి.. నిబంధనలు మరిచి

ఇద్దరు.. ముగ్గురు కాదు.. ఏకంగా ఆరుగురు చిన్నారులను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఓ యువకుడు రద్దీ వాహనాల మధ్య వేగంగా వెళుతున్న చిత్రం మంగళవారం నాంపల్లి ప్రధాన రహదారిలో కనిపించింది. ఏ మాత్రం అదుపుతప్పినా వీరితో పాటు రోడ్డుపై వెళ్లే ఇతరులకూ ముప్పు తప్పదు.

28 వరకు రాత్రిపూట గచ్చిబౌలి పైవంతెన మూసివేత

రాయదుర్గం, న్యూస్‌టుడే: గచ్చిబౌలి పైవంతెన ఈనెల 28 వరకు రోజూ రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మూసి ఉంటుందని సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు గచ్చిబౌలి శిల్పా లేఅవుట్ ఫేజ్-2 ఫ్లైఓవర్ నిర్మాణం చేపడుతున్న కారణంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వాహనదారులు పైవంతెన కింద ఉన్న దారిని ఉపయోగించుకుని అటు ట్రిపుల్ ఐటీ జంక్షన్, ఇటు రాయదుర్గం బయో డైవర్సిటీ కూడలి వైపు రాకపోకలు సాగించాలని సూచించారు.

తొమ్మిదో అంతస్తుపై నుంచి పడి యువతి..


హరిత

ఉప్పల్, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో భవనంపై నుంచి కింద పడి యువతి మృతి చెందిన సంఘటన ఉప్పల్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌లోని నార్త్‌లాలాగూడకు చెందిన పిన్నపాటి హరిత(24) ఉప్పల్ ఐడీఏలోని అబాకస్ ఐటీ పార్క్ బిల్డింగ్‌లో సీఎస్ టెక్నాలజీస్‌లో కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటాక సుమారు 2గంటల సమయంలో భవనం 9వ అంతస్తు నుంచి హరిత కింద పడిపోయింది. వెంటనే ఆమెను ఉద్యోగులు, భద్రత సిబ్బంది రామంతాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. హరితది హత్యా, ఆత్మహత్యా స్పష్టంకాలేదు. మృతురాలి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

హలో హలో.. చెత్త వేయకండి



అడ్డగుట్ట, న్యూస్‌టుడే: “హలో హలో ఇక్కడ చెత్త వేయకండి. మీపై పోలీస్ కేసు అవుతుంది. జీహెచ్ఎంసీ అధికారులు చలానా వేస్తారు. మీకే చెప్పేది” అంటూ వినబడుతున్న శబ్దాలకు స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. తుకారాంగేట్ ఇందిరాగాంధీ విగ్రహం సమీప రహదారి పక్కన కొందరు చెత్త వేస్తుండడంతో వారికి ఎంత చెప్పినా వినకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులు ఇటీవల ఓ స్తంభానికి సీసీ కెమెరా, మైక్ బిగించారు. రోడ్లపై చెత్త వేసే వారి అలవాటును మార్చడానికి వినూత్నంగా వ్యవహరించారు. రహదారులపై స్థానికులు చెత్త పారబోసే చోట సీసీ కెమెరా, మైకు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ డీఈ వెంకటేశ్ తెలిపారు.

వారణాసి విమానానికి బాంబు బూచి

దారి మళ్లించి శంషాబాద్‌లో అత్యవసరంగా ల్యాండింగ్


విమానాశ్రయంలోని నిర్జన ప్రాంతంలో ఆపిన విమానం

శంషాబాద్, న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి వారణాసికి బయల్దేరిన ఆకాశ ఎయిర్ లైన్స్ విమాన సర్వీస్‌లో బాంబులు పెట్టాం. . అని గుర్తు తెలియని వ్యక్తులు ఎయిర్‌పోర్ట్‌కు సందేశం పంపించడంతో భద్రతాధికారులు అప్రమత్తమయ్యారు. ఆ విమానాన్ని దారి మళ్లించి శంషాబాద్‌లో అత్యవసరంగా దించారు. నిర్జన ప్రదేశంలో పార్కింగ్ చేసి 185 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందిని కిందకు దించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం బాంబు స్క్వాడ్, జాగిలాలతో విమానంలో క్షుణ్నంగా తనిఖీలు చేయగా పేలుడు పదార్థాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మరో 35 విమానాలకు: శంషాబాద్ నుంచి దేశవిదేశాలకు రాకపోకలు సాగిస్తున్న ఆకాశ(11), ఇండిగో(13), విస్తారా(11) ఎయిర్‌లైన్స్ సంస్థలకు చెందిన 35 విమానాల్లో ఉగ్రవాదులు బాంబులు పెట్టారంటూ మంగళవారం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఎయిర్‌పోర్ట్‌కు ఈ-మెయిల్ సందేశం పంపించారు. దీనిపై ఎయిర్‌పోర్ట్ అధికారులు ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

పోలీసు బండి.. వేగంగా వచ్చేనండి

- డయల్ 100 ఫిర్యాదులపై సత్వర స్పందన
- సిబ్బందిపై డెకాయ్ ఆపరేషన్లతో నిఘా



పెట్రోలింగ్ విధుల్లో మహిళా సిబ్బంది

ఈనాడు- హైదరాబాద్: పోలీసు పనితీరుపై మరో పోలీసు డెకాయ్ ఆపరేషన్లు.. అలసత్వం వహించినట్లు తేలితే చర్యలు..అదనపు సిబ్బందికి బాధ్యతలు..నిరంతర పర్యవేక్షణ వెరసి రాచకొండ పోలీసులు డయల్ 100 స్పందన సమయాన్ని గణనీయంగా తగ్గించారు. కమిషనరేట్ పరిధిలో 25.1 నిమిషాలు ఉన్న సగటు స్పందన సమయాన్ని 2 నెలల వ్యవధిలో 9.4 నిమిషాలకు తగ్గించారు. ఫిర్యాదు చేస్తే ఆలస్యంగా స్పందిస్తున్నారన్న విమర్శలు పెరగడంతో చర్యలు తీసుకున్నారు. డయల్ 100 కాల్‌సెంటర్‌కు కాల్ వచ్చిన తర్వాత ఫిర్యాదు స్వీకరించి స్థానిక ఠాణా పెట్రోల్ వాహన సిబ్బందికి సమాచారం ఇవ్వడం.. వారు స్పందించి ఘటనాస్థలికి చేరుకోవడం వరకు సమయాన్ని తగ్గించారు.

ఇంత ఆలస్యమా..!

రాచకొండ కమిషనర్‌గా సుధీర్‌బాబు బాధ్యతలు చేపట్టాక జులై, ఆగస్టులో డయల్ 100 ఫిర్యాదుల స్పందన సమయంపై సమీక్షించారు. 43,134 కాల్స్ రాగా..సగటున 25 నిమిషాలకు ఘటనాస్థలికి చేరుకుంటున్నట్లు గుర్తించారు. కీలకమైన ఎల్బీనగర్ జోన్‌లోనూ స్పందన సమయం సగటు 28.2 నిమిషాలు ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. ఆరా తీయగా పలు సమస్యలు దృష్టికొచ్చాయి. డయల్ 100కు కాల్ వచ్చాక ఆ సమాచారం స్థానిక ఠాణా పరిధిలోని గస్తీ సిబ్బంది ట్యాబ్‌కి కాల్, సందేశం వెళ్తుంది. కొందరు సిబ్బంది నిర్లక్ష్యంతో వీటికి స్పందించక పోవడం, సిగ్నల్ సమస్యతో కాల్ స్వీకరించక పోవడం, దూర ప్రాంతానికి వెళ్లడం ఎందుకని ఫిర్యాదు చేసిన వ్యక్తికి కాల్ చేసి వివరాలు తెలుసుకోవడం వంటివి చేస్తున్నారు. వాహనాలకు డీజిల్ కొరత, సిబ్బంది దూర ప్రాంతాల్లో బందోబస్తులో ఉంటూ ఘటనాస్థలికి చేరుకోక పోవడం వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు.

సగటు స్పందన సమయం

జోన్	జులై- ఆగస్టు ఫిర్యాదులు	జులై- ఆగస్టు స్పందన సమయం	సెప్టెంబరు- అక్టోబరు ఫిర్యాదులు	సెప్టెంబరు- అక్టోబరు స్పందన సమయం
ఎల్బీనగర్	14,517	28.2	13,952	8.29
మల్కాజిగిరి	17,248	20.43	16,322	8.4
మహేశ్వరం	5,766	26.37	4,823	9.38
భువనగిరి	5,603	28.28	4,438	11.4
	43,134	25.1	39,535	9.4

మహిళా సిబ్బంది భాగస్వామ్యం

ఇప్పటివరకు పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్‌లో కేవలం పురుషులనే వినియోగించారు. మహిళా సిబ్బందిని రిసెప్షన్, ఫిర్యాదుల స్వీకరణ ఇతర పనులకు పరిమితం చేస్తున్నారు. కమిషనర్ ఆదేశాలతో దాదాపు 700 మంది మహిళా సిబ్బందిని పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్‌లో భాగస్వాములను చేశారు. సిబ్బంది కొరతకు పరిష్కారం లభించి స్పందన సమయం సగానికిపైగా తగ్గిందని అధికారులు తెలిపారు.

డెకాయ్ ఆపరేషన్లతో దడ..!

డయల్ 100 స్పందన సమయం తగ్గించేందుకు అధికారులు దృష్టిసారించారు. డీజిల్ కొరత,సిగ్నల్ సమస్య లేకుండా పెట్రోకార్ సిబ్బందికి రూ.45 లక్షల వ్యయంతో 170 కొత్త ట్యాబ్‌లు పంపిణీ చేశారు. సిబ్బంది నిర్లక్ష్యంగా ప్రవర్తించకుండా పోలీసులతోనే డెకాయ్ ఆపరేషన్లు చేయించారు. స్పెషల్ బ్రాంచి సిబ్బందితో డయల్ 100కు ఫిర్యాదు చేయించి సదరు ఠాణా సిబ్బంది ఎంత సమయంలో ఘటనాస్థలికి చేరుకుంటున్నారో గమనించేవారు. 7 ఘటనల్లో తీవ్ర నిర్లక్ష్యం ఉన్నట్లు తేలడంతో ఆయా ఠాణాల ఇన్‌స్పెక్టర్లు, ఇతర బాధ్యులకు ఛార్జిమెమోలు ఇచ్చారు. 74 పెట్రోల్ వాహనాలున్నా సిబ్బంది కొరతతో ఘటనాస్థలికి వెళ్లలేక పోవడంతో.. 150 బ్లూకోల్ట్స్ వాహనాలను వినియోగించారు. అందుబాటులో ఏ వాహనం ఉన్నా ఘటనా స్థలికి పంపేలా చేశారు.

ఇక సమయానికి ఎంఎంటీఎస్



ఈనాడు, హైదరాబాద్: ఎంఎంటీఎస్ ప్రయాణికుల సంఘాల విజ్ఞప్తులతో రైళ్ల వేళల్లో మార్పులకు దక్షిణమధ్య రైల్వే సిద్ధమైంది. మేడ్చల్, ఘట్‌కేసర్ మార్గంలో 15 సర్వీసులను పెంచేందుకు కసరత్తు చేస్తోంది. గతంలో రద్దుచేసిన మేడ్చల్ - లింగంపల్లి, సికింద్రాబాద్ మార్గంలో నడిచే నాలుగు రైళ్లను బుధవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్టు పేర్కొంది. రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించడంతో సర్వీసులు సమయ పాలన పాటించేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పీక్ అవర్స్‌లో అందుబాటులో.. గతంలో నగరంలో 120కి పైగా ఎంఎంటీఎస్‌లు ప్రయాణికులకు అందుబాటులో ఉండేవి. కాలక్రమంలో ఆ సంఖ్య 86కి పడిపోయింది. దీనికితోడు రైళ్ల రద్దు, సమయపాలన లేకపోవడంతో ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు ప్రత్యామ్నాయాలను ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మెరుగైన ఎంఎంటీఎస్ సేవలందించేందుకు ఉదయం 9, మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం 30నుంచి 45 నిముషాల వ్యవధిలో రైళ్లు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రచిస్తున్నారు. చర్లపల్లి స్టేషన్‌ను త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో ఘట్‌కేసర్ మార్గంలో రైళ్లు కావాలంటూ ప్రయాణికుల సంఘాలు విజ్ఞప్తి చేయడంతో మరిన్ని రైళ్లు నడిపేందుకు అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు.

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

చిరు వ్యాపారులకు పది రూపాయల నాణేలు



దిల్‌సుఖ్‌నగర్: పది రూపాయల నాణేలు చెలామణిలోనే ఉన్నాయని, ఎటువంటి అపోహలు, అనుమానాలు లేకుండా వాటిని తీసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజరు-2 డి.రమేష్ సూచించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు దిల్‌సుఖ్‌నగర్ శాఖలో మంగళవారం బ్యాంకు చీఫ్ మేనేజరు గోపితో కలిసి పలువురు మహిళా చిరువ్యాపారులకు రూ.10 నాణేలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిరు వ్యాపారులు పది రూపాయల నాణేలు తీసుకోవాలని సూచించారు.

మితాహారంతో అనారోగ్యం దూరం

సైదాబాద్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఎన్ఐఐఎంహెచ్) ఆధ్వర్యంలో తొమ్మిదో ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా 'ప్రపంచ ఆరోగ్యానికి ఆయుర్వేద ఆవిష్కరణ' అనే అంశం మంగళవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ జీపీ ప్రసాద్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. డాక్టర్ సింధు, డాక్టర్ చంద్రమోహన్‌లు మితాహారంతో ఒనగూరే ప్రయోజనాలు వివరించారు. ఆయుర్వేద కరపత్రాలు, బ్రోచర్లు ఆవిష్కరించారు.



బ్రోచరు ఆవిష్కరణలో ఆయుష్ అధికారులు

ట్రాన్స్‌జెండర్లకు ఆధార్ కేంద్రం



అక్బర్‌బాగ్, న్యూస్‌టుడే: ట్రాన్స్‌జెండర్లు ఆధార్ కార్డులు పొందేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసింది. మలక్‌పేట సంక్షేమ శాఖ కార్యాలయ భవనం రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మంగళవారం ప్రోగ్రాం మేనేజర్ జయంతి, కోఆర్డినేటర్ ప్రీతి ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరం ద్వారా ట్రాన్స్‌జెండర్లు సులువుగా ఆధార్ కార్డు పొందొచ్చని సూచించారు. మూడు రోజులు కొనసాగే ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎల్లమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక

హయత్‌నగర్: తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్ర రవీందర్, ఉపాధ్యక్షుడిగా జోరల నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా శ్రీకాంత్, ఉప కోశాధికారిగా శ్రీకాంత్, సహాయ కోశాధికారిగా కొమ్ము శ్రీధర్, సంయుక్త కార్యదర్శులుగా కె.సతీశ్, బండారి సురేశ్ ఎన్నికయ్యారు.

ప్రాధాన్యక్రమంలో ప్రగతి పనులు

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో ప్రాధాన్యక్రమంలో ప్రగతి పనులు చేపడుతున్నట్లు ఛైర్‌పర్సన్ జయశ్రీ తెలిపారు. పోలీసు కాలనీలో డ్రైనేజీ పైపులైను పనులను మంగళవారం ప్రారంభించారు. కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, రాజేందర్, కమిషనర్ రవీందర్‌రెడ్డి, డీఈఈ శివానందం పాల్గొన్నారు.

వరద కాల్వ నిర్మాణం పరిశీలన

వనస్థలిపురం: కమలానగర్‌లో చేపట్టిన వరద కాల్వ పనులను మంగళవారం హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. డీఈ దామోదర్, ఏఈ హేమునాయక్, జలమండలి మేనేజర్ రాజు, కాలనీ అధ్యక్షుడు టీవీరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి పురస్కారాలు

బండ్లగూడ, న్యూస్‌టుడే: హైదరాబాద్ రీజియన్ ఆర్టీసీ స్థాయిలో అత్యుత్తమ ఇంధన పొదుపు చేసినందుకు బండ్లగూడ డిపోకు చెందిన డ్రైవర్ పి.శ్రీనివాస్‌రెడ్డి అవార్డు అందుకున్నారు. ఫలక్‌నామా డిపోలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మేనేజర్ వరప్రసాద్.. డ్రైవర్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపోలో..

దిల్‌సుఖ్‌నగర్: ఆర్టీసీ కార్మికులు అంకితభావంతో పనిచేస్తూ సంస్థ ఉన్నతికి పాటుపడాలని ఆర్ఎం వరప్రసాద్ సూచించారు. మే, జూన్ మాసాల్లో విధి నిర్వహణలో ప్రతిభ చూపిన దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపోకు చెందిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బందిని మంగళవారం సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఐహెచ్‌ఆర్‌వో దక్షిణ భారత అధ్యక్షుడి నియామకం

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: పాతనగరానికి చెందిన ఎస్‌కేఏహెచ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సయ్యద్ కాజిమ్ అలీ హాష్మీని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (ఐహెచ్‌ఆర్‌వో) దక్షిణ భారత అధ్యక్షుడిగా నియమించారు. సంస్థ వైస్ ఛైర్‌పర్సన్ కెప్టెన్ రామ ఆర్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్వచ్ఛతపై అవగాహన

వనస్థలిపురం, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి సూచించారు. నరసింహారావు నగర్‌లో మంగళవారం స్థానికులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. స్థానికులు, అధికారులు పూర్ణనాయక్, చంద్రశేఖర్, శేఖర్‌రెడ్డి, యాదయ్య, మధు పాల్గొన్నారు.

రహదారిపై పాదచారి
కాలిబాటపై వ్యాపారి
కూడలి ఆక్రమణలు షురూ



రెడ్‌ట్యాంకు వద్ద రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన పాదబాట

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, పాదచారులకు ఇబ్బందులు లేకుండా జీహెచ్ఎంసీ చేపట్టిన కూడళ్ల సుందరీకరణ పనులు చేపట్టింది. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి నగర్‌కు వెళ్లే రెడ్ వాటర్ ట్యాంక్ నుంచి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వరకు కూడలిని అందంగా తీర్చిదిద్దారు. రోడ్డుకు ఇరువైపులా పాదబాటలు నిర్మించారు. సుమారు రూ.60 లక్షల వ్యయంతో చేపట్టిన పనులు నిరుపయోగంగా మారాయి.

రెండు మీటర్ల వెడల్పుతో..

రెడ్ ట్యాంకు నుంచి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి చౌరస్తా వరకు దాదాపు 600 నుంచి 700 మీటర్లు రోడ్డుకు ఇరువైపులా దాదాపు రెండు మీటర్ల వెడల్పుతో పనులు చేపట్టి ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ఈ పనుల ద్వారా జంక్షన్ సుందరంగా మారడంతో పాటు పాదచారులకు కాలిబాట అందుబాటులోకి వచ్చింది. అయితే రెడ్ ట్యాంకు నుంచి ఏరియా ఆసుపత్రి వరకు రోడ్డుకు ఇరువైపులా వ్యాపార దుకాణాలు ఉన్నాయి. ఆయా దుకాణాలకు ప్రత్యేకంగా పార్కింగ్ వసతి లేదు. గతంలో రోడ్డుపైనే వాహనాలు నిలిపేవారు. ప్రస్తుతం పనులు పూర్తయిన ప్రాంతాలను దుకాణదారులు, చిరు వ్యాపారులు ఆక్రమించారు. పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా వ్యాపార ప్రకటన బోర్డులు, తోపుడు బండ్లు, వాహనాలను నిలుపుతున్నారు. పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు.. వ్యాపార సముదాయాలు వినియోగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు.



ఫుట్‌పాత్‌పై నిలిపిన వాహనాలు

టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి..: దామోదర్, డీఈ

సుందరీకరణ పనుల్లో భాగంగా రెడ్ ట్యాంకు నుంచి రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించాం. ఆయా ఫుట్‌పాత్‌లను ప్రజలు వినియోగించుకునేందుకు వీలు లేకుండా కొన్ని చోట్ల చిరు వ్యాపారాలు ఏర్పాటుచేశారు. మరికొన్ని చోట్ల రోడ్డు పక్కనున్న దుకాణాలకు వచ్చే వినియోగదారులు.. తమ వాహనాలను నిలుపుతున్నారు. సమస్యను టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయిస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఎల్బీనగర్: 76759 19030

మలక్‌పేట: 80085 73284

హయత్‌నగర్: 98336 64897

కర్మన్‌ఘాట్: 94400 32872

బండ్లగూడ: 96034 78579

మూసారాంబాగ్: 79933 00559

న్యూస్‌టుడే, సైదాబాద్, వనస్థలిపురం, కర్మన్‌ఘాట్

? అక్బర్‌బాగ్ పరిధిలో ముంతాజ్ కళాశాల ఎదుట పలు వీధి దీపాలు పగటి వేళలోనూ వెలుగుతున్నాయి. మరికొన్ని రాత్రిపూట సరిగా వెలగడం లేదు. – సత్యనారాయణ, అక్బర్‌బాగ్

✓ క్షేత్రస్థాయి సిబ్బంది పంపించి, పరిశీలన చేయించి మరమ్మతులు చేయిస్తాం. – దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్, వీధి దీపాల విభాగం

? హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీలో దోమల బెడద అధికమైంది. సాయంత్రమైతే బయటకు రావాలంటేనే భయపడుతున్నాం. – రాజేశ్వరి, హైకోర్టుకాలనీ

✓ వెంటనే సిబ్బందిని పంపి, ఫాగింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. – రవీందర్, ఏఈ, ఎంటమాలజీ విభాగం

? హస్తినాపురం డివిజన్ భూపేశ్‌గుప్తా నగర్ ప్రభుత్వ పాఠశాల ఎదుట చెత్త పారేస్తున్నారు. దుర్వాసన, అపరిశుభ్రతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. – శ్రీనివాస్‌యాదవ్, భూపేశ్‌గుప్తా నగర్ కాలనీ ప్రతినిధి

✓ సమస్య మా దృష్టికి వచ్చింది. పాఠశాల ఎదుట పోగైన చెత్తను ఇప్పటికే తరలించాం. మరోమారు పరిశీలించి నివారణ చర్యలు చేపడతాం. – శంకర్, పారిశుద్ధ్య జవాన్

ప్రభుత్వ బడి స్థలాన్ని కాపాడాలని ఆందోళన

బండ్లగూడ, న్యూస్‌టుడే: బండ్లగూడలో ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని కాపాడాలంటూ మంగళవారం భోజన విరామ సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. 'పేద విద్యార్థులకు న్యాయం చేయండి.. మా బడి స్థలం రక్షించండి' అంటూ రాసి ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇరుకుగా ఉన్న గదుల్లో పాఠశాల నడుపుతున్నారని, ఉన్న రెండు గదులు సరిపోవడం లేదన్నారు. అసౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో భవన నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.



నిరసనలో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు

పోలీసులకు ఫిర్యాదు.. పాఠశాల స్థలంలోని నిర్మాణాల కూల్చివేతలపై బండ్లగూడ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉప్పల్ మండల తహసీల్దార్ సూచన మేరకు, విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని.. ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పెబ్బేరు కమిషనర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ కందికట్ల ఆదిశేషు తుర్కయంజాల్‌లో నివాసం ఉంటున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తుర్కయంజాల్‌లోని ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. పలు పత్రాలను పరిశీలించినట్లు సమాచారం. సోదాల వివరాలు మీడియాకు వెల్లడించేందుకు అధికారులు నిరాకరించారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు

శాఖల మధ్య సమన్వయం అవసరం
పోలీస్ హౌసింగ్ బోర్డు ఎండీ రమేశ్‌రెడ్డి

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: లక్ష్య సాధనకు శాఖల మధ్య సమన్వయం అవసరమని పోలీస్ హౌసింగ్ బోర్డు ఎండీ రమేశ్‌రెడ్డి తెలిపారు. చంచల్‌గూడ జైళ్ల శాఖ శిక్షణ సంస్థలో జైళ్ల నిర్మాణాలపై మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంచల్‌గూడ, చర్లపల్లి, చంచల్‌గూడ మహిళా ప్రత్యేక జైళ్లలో జరుగుతున్న బ్యారక్ నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. జైళ్ల డీజీ డా.సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. మధిర, వికారాబాద్, వరంగల్ మామునూర్‌లో కొత్తగా చేపట్టిన జైళ్ల నిర్మాణాల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జైళ్ల శాఖ అధికారులు, పోలీస్ హౌసింగ్ బోర్డు ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో డా.సౌమ్య మిశ్రా, పోలీస్ హౌసింగ్ బోర్డు ఎండీ రమేశ్‌రెడ్డి

నూతన న్యాయ చట్టాలపై శిక్షణ

చంచల్‌గూడ: నూతన న్యాయ చట్టాలపై జైలు అధికారులకు మూడు రోజుల శిక్షణ తరగతులను మంగళవారం తెలంగాణ జైళ్ల డీజీ డా.సౌమ్య మిశ్రా ప్రారంభించారు. మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నూతన క్రిమినల్ చట్టాలను జైళ్ల శాఖ సమర్థంగా వినియోగించుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను బోధిస్తున్నట్లు సౌమ్యమిశ్రా తెలిపారు. శిక్షణ తరగతుల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన న్యాయశాస్త్ర నిపుణులు, జైళ్ల శాఖ ఐజీలు రాజేశ్, మురళీబాబు, డీఐజీలు డా.శ్రీనివాస్, సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

వనస్థలిపురం, న్యూస్‌టుడే: నిర్మాణంలోని బహుళ అంతస్తుల భవనంలో విద్యుత్తు పనులు చేస్తున్న ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ చింతపల్లి మండలం గడియ గౌరారం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ నారమోని జగన్ (27) కొంతకాలంగా భార్య, ఇద్దరు పిల్లలతో సాగర్ కాంప్లెక్స్‌లో ఉంటున్నాడు. నాలుగు రోజులుగా గుర్రంగూడ అటవీ ప్రాంతంలోని ఓ బహుళ అంతస్తుల భవనంలో విద్యుత్తు పనులు చేస్తున్నాడు. పనులు చేస్తుండగా, మంగళవారం విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ నిరసన చేపట్టారు. వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్కింట్లో చోరీ యత్నం.. మహిళ అరెస్టు

నాగోలు, బండ్లగూడ, న్యూస్‌టుడే: పక్కింట్లో చోరీకి యత్నించిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. నాగోలు పోలీసుల కథనం ప్రకారం.. త్యాగరాయ నగర్‌లో నివసించే మధుసూదన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. ఇటీవల అతని భార్య పుట్టింటికి వెళ్లింది. మంగళవారం ఉదయం తల్లి సైతం బయటికి వెళ్లింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో మధుసూదన్ సైతం నాగోలు వెళ్లాడు. వెళ్లేముందు ఇంటికి తాళం వేసి బయట ఉన్న ఓ డబ్బాలో తాళంచెవి పెట్టి వెళ్లాడు. వీరి ఇంటికి సమీపంలోనే ఉండే సంధ్య (45) ఇది గమనించింది. డబ్బాలోని తాళం చెవితో తలుపు తెరిచి లోపలికి ప్రవేశించి.. బీరువాలోని నగలు తీసింది. ఇంతలో మధుసూదన్ తిరిగి వచ్చాడు. స్థానికుల సాయంతో మహిళను పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణకుమార్‌కు గవర్నర్ అభినందన

నాగోలు: గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నాలుగు పర్యాయాలు చోటు దక్కించుకున్న సామాజిక కార్యకర్త డాక్టర్ పెండెం కృష్ణకుమార్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభినందించారు. రాజ్‌భవన్‌లో మంగళవారం గవర్నర్‌తో సమావేశమయ్యారు. గిన్నిస్ రికార్డులతో పాటు సేవా కార్యక్రమాల గురించి తెలుసుకొని అభినందించినట్లు తెలిపారు.

బాలికపై అఘాయిత్యం.. దోషికి జీవితఖైదు



ఖాజా

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: బాలికను భయపెట్టి పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు, రూ.30,000 జరిమానా విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(13) ప్రభుత్వ వసతిగృహంలో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతోంది. మహమ్మద్ ఖాజా (43) అనే లారీడ్రైవర్ 2023లో బాలికను భయభ్రాంతులకు గురిచేసి, పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. పాఠశాలకు వెళ్లి, బదిలీ సర్టిఫికెట్ ఇచ్చి బాలికను పంపించాలని కోరాడు. అనుమానంతో వసతిగృహం ప్రత్యేక అధికారిణి ఆరా తీయగా.. బాలిక జరిగిన విషయం వెల్లడించింది. అధికారిణి ఫిర్యాదుతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి హరీశ మంగళవారం తుది తీర్పు వెల్లడించారు. బాలికకు రూ.12 లక్షలు పరిహారం మంజూరు చేశారు.

బాలాపూర్ ఠాణా పరిధిలో..



రాజు

రంగారెడ్డి జిల్లా కోర్టులు: ప్రేమ పేరిట మాయ మాటలు చెప్పి బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు, రూ.26,000 జరిమానా విధించింది. ప్రత్యేక పీపీ సునీత తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం పోతురాజుమిట్ట గ్రామానికి చెందిన తన్నీరు రాజు అలియాస్ చిన్నపోతు రాజు (27) నగరానికి వలస వచ్చి మేస్త్రీ పనులు చేస్తున్నాడు. 2017లో బాలాపూర్ ఠాణా పరిధిలో నూతన భవన నిర్మాణ సమయంలో ఓ బాలిక(14)తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నట్లు నమ్మించి, బాలికను తీసుకెళ్లి శ్రీకాకుళం జిల్లాలోని ఓ గ్రామంలో బంధువుల ఇంట్లో బంధించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక తండ్రి ఫిర్యాదుతో బాలాపూర్ పోలీసులు నిందితుడిని రిమాండుకు తరలించారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి పద్మావతి తుది తీర్పు వెల్లడించారు. బాలికకు రూ.10 లక్షలు పరిహారాన్ని మంజూరు చేశారు.

బాలుడి హత్య కేసు.. యావజ్జీవ శిక్ష

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: బాలుడిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితుడికి న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా విధించింది. లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్లోర్‌మిల్, ఖాదర్‌బాగ్ ప్రాంతానికి చెందిన షేక్‌తాజ్ అలియాస్ షేక్ తాజుద్దీన్ (19) ఎలక్ట్రీషియన్. అదే ప్రాంతానికి చెందిన బాలుడు (9)కి మాయమాటలు చెప్పి 2018లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయాన్ని బాలుడు బయటకి చెప్తాడనే భయంతో బైకు పెట్రోల్ ట్యాంక్ నుంచి పైపును తొలగించి, పైపుతో బాలుడి గొంతుకు ఉరేసి చంపేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. హాకా భవన్‌లోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో నిందితుడిపై అప్పటి ఏసీపీ అశోక్ చక్రవర్తి ఛార్జ్‌షీట్ దాఖలుచేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి బి.పుష్పలత మంగళవారం తుది తీర్పు వెల్లడించారు.

చుట్టూ తిరగలేక.. త్వరగా వెళ్లలేక
ఎదురెదురు వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు



అక్బర్‌బాగ్‌చౌరస్తాలో ద్విచక్రవాహనాలు ఇలా..

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: నిత్యం రద్దీగా ఉండే మార్గాలు.. ఉదయం, సాయంత్రం వేళల్లో వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. విభాగినులు అధికంగా ఉండడంతో యూటర్న్‌లు తీసుకోలేక.. త్వరగా వెళ్లాలనే ఆత్రంలో వాహనదారులు ఎదురెదురుగా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో ఆజంపుర, చావుని డివిజన్లలో ఈ సమస్య నెలకొంది. ఉదయం పాఠశాలలు చిన్నారులను తీసుకెళ్లే ద్విచక్ర వాహనదారులు, ఆటోలు త్వరగా వెళ్లేందుకు షార్టు కట్‌లు వినియోగిస్తున్నాయి. నల్గొండ చౌరస్తా, చంచల్‌గూడ జైలు పెట్రోలు బంక్, అక్బర్‌బాగ్ చౌరస్తా, చావుని రెండు పడకల గృహ సముదాయం, చాదర్‌ఘాట్ నయాగరా హోటల్ ప్రాంతాల్లో ఈ సమస్య నెలకొంది.

ఇష్టానుసారంగా ప్రయాణిస్తూ..

కిలోమీటర్ల దూరం ఏర్పాటుచేసిన విభాగినులతో రహదారికి ఇరువైపులా ఉన్న పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలకు చేరేందుకు వాహనదారులు, చుట్టూ తిరగాల్సి వస్తోంది. కొంతమంది రాంగ్ రూట్ అని తెలిసినా, ఎదురెదురుగా ప్రయాణిస్తున్నారు. సైదాబాద్, సంతోశ్‌నగర్, చంపాపేట నుంచి కోఠి వైపు వెళ్లే వాహనాలను నియంత్రించాలనే ఆలోచనలతో ట్రాఫిక్ పోలీసులు విభాగినులు ఏర్పాటు చేశారు. అక్బర్‌బాగ్ చౌరస్తా వద్ద ప్రింటింగ్ ప్రెస్‌కు వెళ్లేందుకు, అగ్నిమాపక కేంద్రం నుంచి వాహనాలు రహదారిపైకి చేరేందుకు వీలుగా కొంతభాగాన్ని మాత్రమే వదిలేశారు. ఆయా ప్రాంతాల్లో వాహనదారులు ఇష్టానుసారంగా ప్రయాణిస్తుండటంతో సమస్యలు తప్పడం లేదు. ద్విచక్ర వాహనదారులు వేగంగా ఎదురెదురుగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల.. ఇటీవల సమస్యను ట్రాఫిక్ అధికారులకు వివరించారు.

యువకులు వేగంగా నడుపుతూ..: అహ్మద్ బలాల, ఎమ్మెల్యే, మలక్‌పేట

నల్గొండ చౌరస్తా, మలక్‌పేట రైల్వే వంతెన, ఆజంపుర చమన్ ప్రాంతాల్లో ఎదురెదురుగా వెళ్తున్న ద్విచక్రవాహనాలను నియంత్రించాలి. ముఖ్యంగా యువకులు బైక్‌లు వేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మలక్‌పేట రైల్వే వంతెన వద్ద విభాగినులను దాటి, ఓల్డ్ మలక్‌పేట దారిలోకి వెళ్లే వారి కోసం లాలాజర్ హోటల్ వద్ద ట్రాఫిక్ అధికారులు కొంత వెసులుబాటు కలిగించారు. ఎదురెదురుగా వెళుతున్న వాహనదారులపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించాం.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



సాగర్ రోడ్డులో బీసీ సంఘాల ప్రతినిధుల ఆందోళన

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపెల్లి అంజి డిమాండ్ చేశారు. రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరుతూ మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా నుంచి హస్తినాపురం సాగర్ రోడ్డు వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినా విద్యార్థుల తలరాతలు మాత్రం మారడం లేదన్నారు. రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీ పెంచాలన్నారు. విద్యార్థుల ఉన్నత చదువుల కోసం 2008లో ఏర్పాటు చేసిన ప్రణాళికను యథావిధిగా అమలు చేయాలని కోరారు. బీసీ ఫ్రంట్ ఛైర్మన్ గొరిగే మల్లేశ్ యాదవ్, ప్రతినిధులు సతీశ్, కిశోర్ యాదవ్, అనిల్ ప్రజాపతి, భానుగౌడ్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు పెన్నిధి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు పెన్నిధి అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నార్త్ హస్తినాపురం కాలనీకి చెందిన బాలిక గుండె సంబంధించిన సమస్యతో బాధపడుతోంది. చికిత్సకు సీఎం సహాయనిధిని మంజూరు చేయించాలని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఆశ్రయించారు. స్పందించిన ఆయన.. ప్రభుత్వానికి దరఖాస్తు చేయించారు. ప్రభుత్వం నుంచి రూ.2లక్షల మంజూరు కావడంతో, అందుకు సంబంధించిన చెక్కును మంగళవారం బాలిక తండ్రి అరవింద్‌కు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమపథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాయకులు రామావత్ శ్రీనివాస్ నాయక్, భీమానాయక్ పాల్గొన్నారు.

ప్రగతి రథ చక్ర అవార్డుల అందజేత



పురస్కార గ్రహీతలతో వరప్రసాద్, అధికారులు

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ పరిధిలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి మంగళవారం ఫలక్‌నుమా డిపోలో ప్రగతి రథ చక్ర అవార్డులు ప్రదానం చేశారు. రీజనల్ మేనేజర్ బి.వరప్రసాద్ పాల్గొన్నారు. డిప్యూటీ ఆర్ఎంలు బాబునాయక్, బి.సుచరిత, జగన్, ఫలక్‌నుమా డిపో మేనేజర్ ఎన్.రమేశ్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రాజయ్య, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ దయాకర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

గ్రూప్-1 మెయిన్స్ రెండో రోజు ప్రశాంతం



కోఠి మహిళా వర్సిటీ వద్ద..

సుల్తాన్‌బజార్: కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం(టీఎంవీ), జాంబాగ్‌లోని వివేకవర్ధిని (వీవీ) కళాశాల పరీక్ష కేంద్రాల్లో మంగళవారం గ్రూప్-1 ప్రధాన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు రెండు గంటల ముందు నుంచే కేంద్రం వద్ద అభ్యర్థులు, తల్లిదండ్రుల సందడితో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్సైలు, సిబ్బందితో కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు తొలగించారు. సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి, ఎస్సైలు బందోబస్తును పర్యవేక్షించారు. వీవీ కళాశాల కేంద్రంలో 528కి గాను 455 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. టీఎంవీ కేంద్రంలో వింగ్-ఏలో 792 మందికి గాను 729 మంది, వింగ్-బీలో 864కు 783 మంది హాజరయ్యారు.

నీటి పన్ను సకాలంలో చెల్లించండి

కార్వాన్, జియాగూడ: నీటి బకాయిదారుల ప్రయోజనార్థం ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జలమండలి(డివిజన్-3) జీఎం జె.శ్రీనునాయక్, జియాగూడ సెక్షన్ మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. నెలాఖరు వరకు గడువు ఉందన్నారు. ఓటీఎస్‌ను వినియోగించుకునే వారికి పాతబకాయిలపై వడ్డీని మాఫీ చేసేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. మరమ్మతులు, సాంకేతిక కారణాల వల్ల ఈ నెల 24, 25 తేదీల్లో నీటి సరఫరా బంద్ ఉంటుందన్నారు.

జీఎస్టీపై అవగాహన

రెడ్‌హిల్స్: ప్రతి నెల సమర్పించే జీఎస్టీ రిటర్న్స్ ఫైలింగ్‌లో వచ్చిన కీలక మార్పులు, ఇన్‌వాయిస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం)పై మంగళవారం సాయంత్రం రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐలో సదస్సు నిర్వహించారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు సురేశ్‌కుమార్ సింఘాల్, జీఎస్టీ, కస్టమ్స్ కమిటీ ప్రతినిధులు మహమ్మద్, ఇర్షాద్ అహ్మద్ పాల్గొన్నారు.

సర్కారు బడులకు పంపించాలి

చాంద్రాయణగుట్ట: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని బండ్లగూడ డిప్యూటీ ఐఓఎస్ దశరథ్ పేర్కొన్నారు. జంగమ్మెట్‌లోని చంద్రికాపూర్ పాఠశాలను మంగళవారం ఆయన వసతులు పరిశీలించారు. అనంతరం బస్తీ పెద్దలు, యువకులతో సమావేశమయ్యారు.

స్థలం కనిపిస్తే కబ్జా.. అక్రమార్కుల దర్జా!



గోడేకీఖబర్ బస్టాప్ ఎదురుగా ప్రభుత్వ స్థలంలో దుకాణాలు

న్యూస్‌టుడే, గోషామహల్, అబిడ్స్

గోషామహల్‌లో సర్కారు జాగాల్లో దందా

గోషామహల్ నియోజకవర్గంలో ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ స్థలాలు ఖాళీగా కనిపిస్తే చాలు అక్రమార్కులు, రౌడీలు, మాజీ రౌడీషీటర్లు కాజేస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఇవి కొన్ని ఉదాహరణలు

● మంగళ్‌హాట్‌లోని గోడేకీఖబర్ వద్ద శ్మశానవాటిక స్థలాన్ని ఓ రౌడీషీటర్ కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టి విక్రయిస్తుండటంతో పాటు చుట్టుపక్కల వారి స్థలాలపై కూడా కన్నేసి భయాందోళనకు గురిచేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

● గోడేకీఖబర్ నుంచి పాన్‌మండీ వెళ్లే రోడ్డులో మాజీ రౌడీషీటర్ తన కుటుంబసభ్యులు, అనుచరులతో కలిసి వక్ఫ్ జాగాలో షెడ్లు వేశాడు. వాటిని అద్దెకిచ్చి రూ.లక్షల్లో సంపాదిస్తున్నాడు. పాన్‌మండీ లేన్‌లో ఓ ప్రార్థన స్థలం కోసం అప్పట్లో కేటాయించిన సుమారు 2000 గజాల స్థలాన్ని గోడౌన్‌కు అద్దెకిచ్చాడు. ఎవరైనా ప్రశ్నిస్తే అంతుచూస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. గతంలో రెవెన్యూ అధికారిపై చేయి చేసుకున్న ఘటనలో జైలుకు సైతం వెళ్లొచ్చాడు.

● గోడేకీఖబర్‌లో ఆర్టీసీ బస్టాండు కనుమరుగైంది. బస్ షెల్టర్‌ను మాయం చేశారు. ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేసి అద్దెకిచ్చి దందా చేస్తున్నారు. ఇటీవల నాంపల్లి తహసీల్దార్ ఫిర్యాదు మేరకు జీహెచ్ఎంసీ అధికారులు కబ్జాదారులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



పాన్‌మండీ రోడ్డులో గోడౌన్లు

ఖాకీల అండాదండ

అల్లాబండ, ఆర్‌కేపేట ప్రాంతాల్లోనూ కబ్జాదారుల ఆగడాలకు అంతు లేకుండా పోయింది. నకిలీ పత్రాలు సృష్టించి స్థలాలను కాజేస్తున్న అక్రమార్కులకు కొంత మంది పోలీసుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రౌడీషీటర్లు, మాజీ రౌడీషీటర్లు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై అణిచివేత ధోరణిని అవలంబించాల్సింది పోయి తెర వెనుక వారిని ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గోషామహల్ సబ్ డివిజన్‌లోని ఓ ఠాణా ఎస్సై ఆగడాలు మితిమీరిపోయాయని, ఆ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, సట్టా, జూదం, గంజాయిలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్న వారికి అండదండలు లభిస్తున్నట్లు తెలుస్తోంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

బేగంబజార్, కంచన్‌బాగ్, న్యూస్‌టుడే:

? జీహెచ్ఎంసీ 15వ వార్డు ప్రాంగణంలో ఇసుక, కంకర, ఇతర నిర్మాణ సామగ్రి నిల్వ చేశారు. అదే ప్రాంగణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. **- పురుశోత్తం, బేగంబజార్**

✓ సిమెంటు రోడ్ల మరమ్మతులకు నిల్వ చేశాం. పనులు పూర్తయిన వెంటనే తొలగిస్తాం. **- అంజిబాబు వర్క్ఇన్‌స్పెక్టర్**

? పిసల్‌బండ నుంచి రియాసత్‌నగర్ వైపు వెళ్లే మార్గం ఇరువైపులా అక్రమంగా వాహనాలు, తోపుడు బండ్లు నిలిపి ఉంచుతున్నారు. ఇతర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. **- జహంగీర్, రియాసత్‌నగర్**

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- శ్రీనునాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, చాంద్రాయణగుట్ట**

మహాత్మాగాంధీ గ్లోబల్ శాంతి పురస్కారాల ప్రదానం



ప్రసంగిస్తున్న బండ ప్రకాశ్, చిత్రంలో పురస్కార గ్రహీతలు, అతిథులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: ప్రపంచానికే నగరం ఆదర్శంగా ఉందని శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్ కొనియాడారు. అన్ని మతాలు, కులాల ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్నారన్నారు. మంగళవారం బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్తులో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పలువురికి 'మహాత్మాగాంధీ గ్లోబల్ శాంతి పురస్కారాలు' ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా బండ ప్రకాశ్ హాజరై మాట్లాడారు. చిన్నారులను విద్యార్థి దశ నుంచే శాంతిమార్గంలో నడిపించాలన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ గోపిశెట్టి నిరంజన్ మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్ముడు చేసిన పోరాటం, త్యాగాలపై నవతరం అధ్యయనం చేయాలన్నారు. కులగణన సర్వేను ప్రస్తావిస్తూ.. ఇంటింటికి సర్వేకు వచ్చే అధికారులకు సరైన వివరాలు అందించాలన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజ్‌నారాయణ ముదిరాజ్, న్యాయవాది డీఎల్ పాండు, సామాజికవేత్తలు పి.ఉజ్వల్‌చందర్, డా.రవితేజ, ఎస్.మధుసూదన్ ముదిరాజ్, బత్తుల హేమంత్, దిల్లీ శివకుమార్‌లు మాట్లాడారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ఎన్.ఆర్ లక్ష్మణరావు, వి.ప్రభాకర్‌రావు, లక్ష్మణ్‌గుప్తా, డా.కోడి శ్రీనివాసులు, బండిరాజుల శంకర్, జి.విజయలక్ష్మి, డా.సి.బిన్నబాబు, జి.ఎట్టయ్య, కటకం భాస్కర్ గుప్తా, డా.లంక గంగాధరం, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, వై.చెంచల, మహేష్ అగర్వాల్, డా.ఎన్.ప్రసాద్, డా.జి.స్వరూపారాణి, మహమ్మద్ పర్వేజ్, ముత్యం యాదవ్, డి.లక్ష్మణ్ ముదిరాజ్, పి.భరత్‌రెడ్డి, తాళ్ల నరేందర్, డా.జమాన్, వి.రమణమ్మలకు అవార్డులు అందజేశారు.


క్లిక్... క్లిక్

అపరిశుభ్రంగా బాపూఘాట్



మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 2న లంగర్‌హౌస్‌లోని బాపూ సమాధిని పూలతో అందంగా అలంకరించారు. పరిసరాలను శుభ్రం చేశారు. అవి ప్రస్తుతం ఎండిపోయాయి. వ్యర్థాలతో సమాధి చుట్టూ అపరిశుభ్రంగా తయారైంది. **– న్యూస్‌టుడే, ఆసిఫ్‌నగర్**

జియాగూడ బైపాస్ రోడ్డులో అంధకారం




జియాగూడ బైపాస్ రోడ్డులో ఓ వైపు పైపులైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మరో వైపు వీధి దీపాలు వెలగక వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రకృతి చిత్రం.. మానసికోల్లాసం

నగరంలోని మాసబ్‌ట్యాంక్ బస్టాప్ వద్ద గోడలపై చిత్రకారులు వేసిన ప్రకృతి చిత్రాలు బాటసారులను ఆకట్టుకుంటున్నాయి. అడవులు, వివిధ రకాల జంతువులు, పక్షులు, నీటి వనరుల చిత్రాలను చూసి మైమరిచిపోతున్నారు.





సమాజ సంస్కరణలో నాటకాల పాత్ర కీలకం



జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి, గౌరీశంకర్, గోపాలకృష్ణ, శివకుమార్

నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలుగు వర్సిటీలో మంగళవారం తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో తెలంగాణ తొలి మాండలిక నాటక రచయిత కేఎల్ (కోదాటి) నరసింహారావు శతజయంతి ఉత్సవాలు, నాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ.. భారతీయ నాటకానికి ప్రత్యేకత ఉందని.. సమాజాన్ని సంస్కరించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతలకు విరుగుడుగా నాటకాలు రావాల్సి ఉందన్నారు. దర్శకుడు గుమ్మడి గోపాలకృష్ణ, సంగీత నాటక అకాడమీ మాజీ ఛైర్మన్ బాదిమి శివకుమార్, సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచందర్‌రావు, అధ్యక్షుడు ఆకుల సదానందం, ప్రధాన కార్యదర్శి సాధు శ్యాంప్రసాద్ తదితరులున్నారు. అనంతరం 'ఉంగరాల వేళ్లు' నాటికను ప్రదర్శించారు.

క్రికెట్ జట్టుకు డీఈవో అభినందన



గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించిన అండర్ -14 క్రికెట్ జట్టును గన్‌ఫౌండ్రిలోని అలియా ప్రభుత్వ మోడల్ హై స్కూల్‌లో డీఈవో ఆర్.రోహిణి అభినందించారు. జిల్లా జట్టు కెప్టెన్ దేవాశ్విత్ యాదవ్, మండల విద్యాశాఖాధికారులు చిరంజీవి, వెంకటేశ్వర్లు, కోచ్ ఎ.ప్రమోద్‌కుమార్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.శ్రీదేవి, మేనేజర్ జి.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: పీఎం విశ్వకర్మ పథకాన్ని అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జి.ఆశన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా కులవృత్తిదారులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయనుందని, 18 వృత్తులకు చెందిన ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వడ్రంగి, పడవలు, ఆయుధ, తాళాల తయారీదారులు, శిల్పి, రాళ్లు కొట్టేవారు, స్వర్ణకారులు, కమ్మరి, చెప్పులు కుట్టేవారు, మేస్త్రి, బుట్టలు, చాపలు, చీపుర్లు తయారు చేసేవారు, కొబ్బరి పీచు అల్లేవారు, బొమ్మల తయారీదారులు, బార్బర్, పూలు అల్లేవారు, రజకులు, టైలర్, చేపలు పట్టేవారు, వలలు తయారు చేసే వారు అర్హులన్నారు. హస్త, వృత్తికళాకారులు సైతం పథకానికి అర్హులన్నారు. లబ్ధిదారునికి కనీసం 18 ఏళ్ల వయసు ఉండాలని, అయిదేళ్లలో స్వయం ఉపాధి, వ్యాపార అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా రుణం తీసుకోకుండా ఉండాలన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే పరిమితమని, ప్రభుత్వ సర్వీసులో ఉన్న వ్యక్తి కుటుంబ సభ్యులు అనర్హులన్నారు.

కార్వాన్‌లో భారాసను బలోపేతం చేస్తాం



కార్తీక్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాస్

కార్వాన్, న్యూస్‌టుడే: కార్వాన్‌లో భారాసను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు పార్టీ సీనియర్ నేత అంబటి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం పార్టీ నాయకులతో కార్వాన్‌లో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడతామన్నారు. నూతన కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. భారాస హైదరాబాద్ ఇన్‌ఛార్జిగా నియమితులైన కార్తీక్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి సన్మానించారు. ముత్యాల భాస్కర్, రంగారెడ్డి, రాములు ఉన్నారు.

కారు ఢీ.. కూలీ దుర్మరణం

చార్మినార్, న్యూస్‌టుడే: కారు ఢీకొని దినసరి కూలీ దుర్మరణం చెందిన ఘటన బహదూర్‌పుర ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన అజీంబేగ్(65) దినసరి కూలీ. తాడుబన్ లేబర్ అడ్డాతో పాటు దానమ్మ గుడిసెల వద్ద రోజూ పనులకు వస్తుంటాడు. దానమ్మ గుడిసెల ప్రాంతానికి వచ్చి.. సోమవారం సాయంత్రం మద్యం తాగాడు. మత్తులో లతీఫ్ కారు మెకానిక్ షాపు సమీప రహదారి పక్కన విశ్రాంతి తీసుకుంటున్నాడు. కారు మెకానిక్ హమీద్(24) రివర్స్‌లో వాహనాన్ని నడుపుతుండగా. అజీంబేగ్‌ను ఢీకొట్టింది. మంగళవారం ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ ఆధ్వర్యంలో ఎస్సై భిక్షం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిపై హత్యాయత్నం.. నలుగురి అరెస్టు

జియాగూడ: జియాగూడలో ఇటీవల బాలుడిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు కుల్సుంపుర ఇన్‌స్పెక్టర్ సునీల్ మంగళవారం తెలిపారు. నిందితులు మైనర్లే కావడంతో వారిని జువైనల్ హోమ్‌కు తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల ఫీజు బకాయిలకు నిధులు లేవా..?



మెహిదీపట్నంలో నినాదాలు చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, విద్యార్థులు

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.4వేల కోట్లు విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం.. మూసీ సుందరీకరణకు రూ.లక్షా యాభై వేల కోట్లు ఎక్కడి నుంచి తెస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. ఫీజు బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం మెహిదీపట్నం నుంచి సంక్షేమ భవన్‌కు ర్యాలీగా బయలు దేరారు. కొద్ది దూరంలో పోలీసులు ఆర్.కృష్ణయ్యతో పాటు విద్యార్థి నేతలు, విద్యార్థులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఫీజు బకాయిల విడుదలకు విదార్థులు మూడు నెలలుగా రోడ్డెక్కి ఉద్యమాలు చేస్తుంటే సర్కారు స్పందించడం లేదన్నారు. వారి శ్రేయస్సు కోసం పాటుపడుతామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. 10 నెలలు గడిచినా ఫీజు బకాయిలు చెల్లించేందుకు ముందుకురావడం లేదని విమర్శించారు. ఫీజులు చెల్లించకపోవడంతో కోర్సులు పూర్తి చేసిన వారికి కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో ఉన్నత చదువులు, ఇంటర్వ్యూలకు వెళ్లలేక నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజుల బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



నిజాం కళాశాలలో కుమురం భీమ్ చిత్రపటానికి నివాళులర్పించిన రాంబాబు నాయక్, ప్రొ.జి.బీమా, ప్రొ.జి.ఉపేందర్‌రెడ్డి



జంగమ్మెట్‌లో.. వివిధ సంఘాల నాయకులు శ్రీనివాస్, రాజు, కిషన్‌నాయక్

కుమురం భీమ్ జయంతి



పాతనగరంలో వివిధ ప్రాంతాల్లో మంగళవారం కుమురం భీమ్ జయంతి జరిపారు. 'జల్ జంగల్ జమీన్' నినాదంతో నిజాం సర్కారుకు వ్యతిరేకంగా చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు.

← కోఠి మహిళా వర్సిటీలో ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొ.ధనుంజయ్ సూర్య

హత్య కేసు.. నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: బాలుడిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితుడికి న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా విధించింది. లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఠాణా పరిధిలోని ఫ్లోర్‌మిల్, ఖాదర్‌బాగ్ ప్రాంతానికి చెందిన షేక్‌తాజ్ అలియాస్ షేక్ తాజుద్దీన్ (19) ఎలక్ట్రీషియన్. అదే ప్రాంతానికి చెందిన బాలుడు(9)కి మాయ మాటలు చెప్పి 2018లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయాన్ని బాలుడు బయటకి చెప్తాడనే భయంతో బైకు పెట్రోల్ ట్యాంక్ నుంచి పైపును తొలగించి, పైపుతో బాలుడి గొంతుకు ఉరేసి చంపేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. హాకా భవన్‌లోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో నిందితుడిపై అప్పటి ఏసీపీ అశోక్ చక్రవర్తి ఛార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో యువకుడికి న్యాయమూర్తి బి.పుష్పలత మంగళవారం పైవిధంగా తీర్పు ఇచ్చారు.

సఫాయీ కర్మచారుల సంక్షేమానికి చర్యలు



కోఠిలో మాట్లాడుతున్న వీరరాజు

సుల్తాన్‌బజార్: సఫాయీ కర్మచారుల(పారిశుద్ధ్య కార్మికులు) సంక్షేమం, అభివృద్ధికి ప్రోగ్రెసివ్ సఫాయీ కర్మచారి సంఘం(పీఎస్‌కేపీ) ప్రధాన లక్ష్యమని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఇ.వీరరాజు పేర్కొన్నారు. మంగళవారం కోఠి బ్యాంక్‌స్ట్రీట్‌లోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జాతీయ కార్యదర్శి దీపక్‌కుమార్, డా.రహమాన్ పఠాన్ తదితరులు మాట్లాడారు. సంఘం రాష్ట్ర శాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నాయకులు టి.సతీష్‌కుమార్, వి.శ్రీనివాసులు, పి.విజయలక్ష్మి, కరుణాకర్, సోనం కాగ్డా, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

శాంతి సామరస్యాలు కాపాడాలి

చార్మినార్: పాతబస్తీలో శాంతిసామరస్యాలు కాపాడడానికి పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని చార్మినార్ ఏసీపీ పి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సంప్రదాయ ఉత్సవాలకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. చార్మినార్ డివిజన్ పరిధిలోని కామాటిపుర, హుస్సేనిఆలం, చార్మినార్ ఠాణాల పరిధుల్లోని శాంతిసంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్పించే శక్తులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామన్నారు. ఇన్‌స్పెక్టర్లు సురేందర్, కమల్ కుమార్, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అబిడ్స్, న్యూస్‌టుడే: గోషామహల్ నియోజకవర్గంలో మురుగు, తాగునీటి సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. భారాస నేత ఆనంద్‌కుమార్‌గౌడ్ మూడు రోజుల కిందట ఎండీని కలిసి వివిధ సమస్యలు విన్నవించారు. స్పందించిన ఎండీ మంగళవారం అధికారులతో కలిసి నియోజకవర్గంలో పర్యటించారు. కలుషిత నీరు సరఫరా అవుతున్న ప్రాంతాలు, లోప్రెషర్, మ్యాన్‌హోళ్లు దెబ్బతిన్న ప్రాంతాలను చూశారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులను ఆదేశించారు.

మూసీ సుందరీకరణ అభినందనీయం



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న అంజన్‌కుమార్ యాదవ్, సతీష్, ఫహీమ్ తదితరులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన మూసీ సుందరీకరణ అభినందనీయమని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏవైకే బృందం ఆధ్వర్యంలో ఈ నెల 27న నిర్వహించనున్న సదర్ సమ్మేళనం గోడపత్రిక ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. మూసీలో నీళ్లు లేక పశువులకు మేత కూడా దొరకడం లేదన్నారు. సదర్‌ను రాష్ట్ర పండగగా గుర్తించాలని ముఖ్యమంత్రిని కోరుతామన్నారు. సమ్మేళనానికి ప్రముఖులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, టిగ్రీస్ వైస్ ఛైర్మన్ మహమ్మద్ ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.

దుబాయిలో తప్పిపోయిన హైదరాబాద్ యువకుడు

ఖైరతాబాద్: గౌలిగూడకు చెందిన నూగురు రాహుల్‌రాజ్(32) ఉద్యోగం కోసం విజిట్ వీసాపై దుబాయికి వెళ్లి జాడ తెలియకుండా పోయాడు. ఈనెల 14న దుబాయికి చేరుకున్న తమ కుమారుడు 19న తన బ్యాగు చోరీకి గురైందని, అందులో డబ్బు ఉన్నట్లు ఫోన్‌లో చెప్పాడని, తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యిందని తల్లిదండ్రులు కుముదిని, గౌతం మంగళవారం 'ప్రవాసీ ప్రజావాణి'లో వినతి పత్రం సమర్పించారు. రాహుల్‌ను వెతికిపెట్టి ఇండియాకు చేరుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆచూకీ తెలిసిన వారు +91 98487 49667 నంబర్‌కు వాట్సాప్ చేయాలని కోరారు. టీపీసీసీ ఎన్నారై సెల్ ఛైర్మన్ డా.వినోద్ కుమార్, తెలంగాణ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి వారికి ఫిర్యాదు చేసేందుకు సహకరించారు.

ఐహెచ్‌ఆర్‌వో దక్షిణ భారత అధ్యక్షుడిగా నియామకం



కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: పాతనగరానికి చెందిన ఎస్‌కేఏహెచ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత **సయ్యద్ కాజిమ్ అలీ హాష్మీని** ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్(ఐహెచ్‌ఆర్‌వో) దక్షిణ భారత అధ్యక్షుడిగా నియమించారు. సంస్థ వైస్ ఛైర్‌పర్సన్ కెప్టెన్ రామ ఆర్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

వీధి వ్యాపారుల మార్కెట్ తనిఖీ

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని కాళీమందిర్ దగ్గరలో వీధి వ్యాపారుల మార్కెట్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర తనిఖీ చేశారు. ఎవరికి కేటాయించిన విక్రయ కేంద్రాల్లో వారే వ్యాపారాలు నిర్వహించాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. ఎవరైనా ఇతరులకు విక్రయకేంద్రాలను ఇచ్చినట్లు తెలిస్తే వాటిని రద్దు చేస్తామని హెచ్చరించారు. రాత్రివేళల్లో మార్కెట్ పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా రాజేంద్రనగర్ పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అరవింద్ కుమార్

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్‌లోని సిద్ధాంతి హనుమాన్ దేవాలయ భూముల్లో ఇష్టారాజ్యంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని శంషాబాద్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు జి.అరవింద్ కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో 60కిపైగా అక్రమ నిర్మాణాల పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ సిద్ధాంతి హనుమాన్ దేవాలయం భూముల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి కొరడా ఝుళిపిస్తామని ఆయనకు హామీ ఇచ్చారు.

ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టొద్దు: బక్కని

షాద్‌నగర్‌పట్టణం, న్యూస్‌టుడే: ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ధోరణికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్వస్తి పలకాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. తిరుమల ఆలయంలో తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులు చెల్లడం లేదనే అంశంపై చంద్రబాబునాయుడును జడ్చర్ల ఎమ్మెల్యే స్థాయికి మించి విమర్శించారన్నారు. తితిదే స్వయం ప్రతిపత్తి గల సంస్థని, ఇందులో అక్కడి ప్రభుత్వానికి ప్రమేయం ఉండదని అన్నారు. సామరస్యంగా చర్చించుకోవాల్సిన ఈ అంశానికి ప్రాంతీయ భేదాలను ముడిపెట్టి మాట్లాడడం సరికాదని హితవు పలికారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన ఆయన కాపీలను మీడియాకు విడుదల చేశారు.

పాత్రికేయుల సంక్షేమానికి కృషి

శంషాబాద్, న్యూస్‌టుడే: సంఘాలకు అతీతంగా పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేస్తానని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శంషాబాద్‌లో మంగళవారం టీయూడబ్ల్యూజే శంషాబాద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శంషాబాద్ పాత్రికేయులు ఆయన్ను శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టు సంక్షేమానికి టీయూడబ్ల్యూజే కట్టుబడి ఉందన్నారు. పాత్రికేయులకు త్వరలోనే ఆరోగ్య బీమా, అక్రిడిటేషన్ కార్డులను అందజేయడానికి కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. మనోహర్, శ్రీనివాస్, మహమూద్ అలీఖాన్ పాల్గొన్నారు.

కనిపెట్టలేరని కలిపేస్తున్నారు..!

కాషన్నకుంటలోకి యథేచ్ఛగా వ్యర్థ రసాయనాలు● పీసీబీ తనిఖీలో విస్తుబోయే విషయాలు

కొత్తూరు, న్యూస్‌టుడే: చరిత్రలో ఓ చక్రవర్తి పాలనలో రాజ్యంలో ప్రతిఒక్కరూ పాలు పోయాలని ఆదేశిస్తే 'నేను ఒక్కడిని నీరు పోస్తే ఎలా తెలుస్తుంది లే' అని ఎవరికి వారు అనుకుని పాలకు బదులుగా నీరు పోశారట. అలా ఉంది షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు పారిశ్రామికవాడలోని పరిశ్రమల తీరు. పురపాలక కేంద్రంలోని కాషన్నకుంటపై పదుల సంఖ్యలో పరిశ్రమలు విస్తరించి ఉండటం, ఎవరికి వారు వ్యర్థాలను కలపడంతో చెరువు కలుషితమై ఇటీవల చేపలు చనిపోయాయి. దీనిపై నీటిపారుదల శాఖ ఫిర్యాదు మేరకు కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) తనిఖీలు చేయగా విస్తుబోయే విషయాలు వెలుగుజూశాయి.

కనిపించని ఈపీటీ..

హానికరమైన వ్యర్థాల నుంచి పర్యావరణాన్ని రక్షించేందుకు ఫార్మసూటికల్స్, టెక్స్‌టైల్స్, కెమికల్స్, రిఫైనరీ వంటి పరిశ్రమల్లో ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఈపీటీ) ఏర్పాటు చేసుకోవాలి. వివిధ దశల్లో రసాయనాలను శుద్ధి చేసి హానికరం కాని వాటిని బయటకు వదలాలి. మిగిలిన వాటిని పారిశ్రామిక వ్యర్థ జలాల తరలింపు వాహనాల ద్వారా నగర శివారులోని పీసీబీ ప్లాంటుకు తరలించాల్సి ఉంటుంది. కానీ ప్లాంట్ల నిర్వహణ, రసాయనాల తరలింపు భారీ వ్యయంతో కూడుకున్నది కావడంతో చెరువులోకి వదిలేస్తున్నారు. సంపుల్లో నిండిన వ్యర్థాలను మోటారు పైపుల ద్వారా చెరువులోకి పంపి తిరిగి పైపులు తొలగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

గొలుసు కట్టుతో అన్ని చెరువుల్లోకి..

విష రసాయనాల ప్రభావం ఒక్క చెరువుకే పరిమితం కావడం లేదు. కాశన్నకుంట నుంచి బొద్దుకుంట, గోధుమకుంట, కుమ్మరోనికుంట ఇలా గొలుసు కట్టు చెరువులు విస్తరించి ఉండడంతో వరద నీటిలో రసాయనాలు కలిసి ప్రతి చెరువు కలుషితమవుతోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక భూగర్భ జలాలు వాడుకోడానికి సైతం పనికిరావంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక్కడి జలాల్లో టీడీఎస్ ప్రమాదకర స్థాయిలో 500 నుండి 3000 వరకు నమోదై ఉంది.



పాలిమర్ పరిశ్రమ వ్యర్థాల డంపు



కాషన్నకుంటకు సమీపంలో వెలసిన పరిశ్రమలు

నిరంతర తనిఖీలు అవసరం..

కాలుష్యం ఘటనలు వెలుగు చూసినప్పుడు పరిశ్రమలు జాగ్రత్తలు పాటించడం సాధారణం. ఇలాంటి సందర్భాల్లో అధికారుల తనిఖీలు ఏ మాత్రం ఫలితాలనివ్వవు. నిరంతరం ఆకస్మిక తనిఖీలతోనే కాలుష్యాన్ని నియంత్రించవచ్చు. కాశన్నకుంటతోపాటు ఆయా పరిశ్రమల్లో నిల్వ ఉంచిన నీటి నమూనాలను పీసీబీ సేకరించి ల్యాబ్‌కు తరలించింది. ఫలితాల పేరుతో జాప్యం చేయకుండా అధికారులు తదుపరిచర్యలు చేపట్టాలని స్థానికులుకోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్:	8008573330
శంకర్‌పల్లి :	8008573266
షాద్‌నగర్:	8008573907
శంషాబాద్:	9963096353

శంషాబాద్, నందిగామ, కాటేదాన్, న్యూస్‌టుడే

? శంషాబాద్ మున్సిపల్ పరిధి సాతంరాయి కాలనీ ప్రధాన రహదారి ఆక్రమణకు గురవుతోంది. కొంతమంది గుడిసెలు వేసి దుకాణాలు ఏర్పాటు చేయడంతో తరచూ ట్రాఫిక్‌జాం ఏర్పడుతోంది. –యాదగిరి, సాతంరాయి

✓ సాతంరాయి కాలనీ ప్రధాన రహదారి సమస్య మా దృష్టికి రాలేదు. రోడ్లను కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలను తొలగిస్తాం. వినకుంటే వారిపై కేసులు నమోదు చేస్తాం. –బి.సుమన్‌రావు, కమిషనర్, శంషాబాద్ మున్సిపాలిటీ

? నందిగామ మండలం అంతిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ శివారులో పంటపొలాల మధ్య ఏర్పాటుచేసిన చిన్నతరహా పరిశ్రమలకు అనుమతులు లేకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రి వేళల్లో విచ్చలవిడిగా కాలుష్యాన్ని విడుదల చేస్తున్నారు. –రాజు, అయ్యప్ప దేవాలయం

✓ నందిగామ మండల ఎంపీవోగా ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. అంతిరెడ్డిగూడ శివారులోని పరిశ్రమల వివరాలు సేకరించి, అనుమతులు తీసుకోని పరిశ్రమల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. –తేజ్‌సింగ్, ఎంపీవో నందిగామ

? సమీపంలోనే ఫ్లై వంతెనలు నిర్మిస్తున్నా శివరాంపల్లి బస్తీ ప్రధాన రహదారిని ఎవరూ పట్టించుకోవడంలేదు. గుంతలమయంగా ఉండడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. – శివ, శివరాంపల్లి

✓ రోడ్డును పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. – రవికుమార్, రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్

ఇందిరా మహిళాశక్తిని సద్వినియోగం చేసుకోండి: ఏపీఎం

జిల్లేడు చౌదరిగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఇందిరా మహిళాశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం నరసింహ అన్నారు. మంగళవారం మహిళా సమైక్య కార్యాలయంలో అధ్యక్షురాలు మంజుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజీలో భాగంగా ఇదివరకు రూ.11కోట్లు రుణాలు ఇప్పించారన్నారు. బ్యాంకుల నుంచి రూ.24 కోట్ల రుణాలు ఇప్పించి 100శాతం లింకేజీ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మి, రాణి, సీసీలు, వివోఏలు పాల్గొన్నారు.


చుంగేచాన్ తరహాలో మూసీని అభివృద్ధి చేస్తే ప్రయోజనం



సియోల్‌లో అక్కడి అధికారులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న ప్రకాష్‌గౌడ్, యాదయ్య

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: చుంగేచాన్ ఉపనది తరహాలో మూసీని అభివృద్ధి చేస్తే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో చుంగేచాన్ ఉపనది అభివృద్ధి చేసిన తీరును పరిశీలించడానికి వెళ్లిన ప్రత్యేక బృందంలో వారు కూడా ఉన్నారు. సియోల్‌లో పలు ప్రాంతాల్లో పర్యటించిన వారు అక్కడి విశేషాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మూసీ ప్రవహించే ప్రాంతం అంతా దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. అత్తాపూర్‌లో మూసీ పరీవాహక ప్రాంతాన్ని చుంగేచాన్ మాదిరిగా చేస్తే పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని పేదలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. మూసీని అభివృద్ధి చేయకపోతే భవిష్యత్తులో మరింత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గతంలో సియోల్ లోనూ మూసీ తరహా పరిస్థితి ఉండేదని అక్కడి అధికారులు చెప్పారన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోనూ మూసీ ప్రవహించే ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు.

గున్న భీమయ్యకు ఎమ్మెల్యే పరామర్శ



మల్లేష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న వీర్లపల్లి

షాద్‌నగర్, న్యూస్‌టుడే: ఫరూక్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన సీనియర్ నేత గున్న భీమయ్య కుమారుడు గున్న మల్లేష్‌యాదవ్ సోమవారం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింహులు, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తదితరులు భీమయ్యను పరామర్శించి మల్లేష్ మృతదేహానికి నివాళులు అర్పించారు.

యువత రక్తదానం

కొత్తూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హైదరాబాద్ గచ్చిబౌలిలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో కొత్తూరుకు చెందిన యువకులు పాల్గొన్నారు. కొత్తూరు పోలీసుల సూచనతో రక్తదానం చేసిన మహిపాల్, ఆంజనేయులు, యాదగిరి, శివసాయి, గణేష్, ఫాతిమాపూర్ ఐటీఐ విద్యార్థులకు శిబిర నిర్వాహకులు ప్రశంసా పత్రాలు అందజేశారు.

డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్



మొగలిగిద్ద జడ్పీహెచ్‌ఎస్‌లో నిరసన కార్యక్రమంలో తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, షాద్‌నగర్ డివిజన్ నాయకులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, నూతన పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఐదు డీఏలు, నూతన పీఆర్‌సీ అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తపస్ షాద్‌నగర్ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయ ధర్మాగ్రహదీక్ష పేరిట కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో సంఘం నాయకులు ఆయా పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో తపస్ షాద్‌నగర్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, సురేష్‌కుమార్‌గౌడ్, పెంటన్న తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో వేగం పెంచండి

కేశంపేట, న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదులో వేగం పెంచాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆ పార్టీ శ్రేణులను కోరారు. మంగళవారం రెండో రోజు సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, అల్వాల, కొత్తపేట, సంతాపూర్ తదితర గ్రామాల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని ప్రజలు హర్షిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రఘురాంగౌడ్, నరేందర్‌రెడ్డి, మహేష్, విఠల్‌గౌడ్, యాదయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాటేదాన్, న్యూస్‌టుడే: కాటేదాన్ చౌరాస్తాలో చేపట్టిన భాజపా సభ్యత్వ నమోదులో రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకుడు అడికె రాజు, బొమ్మరాజు నరసింహరాజు, అడికె శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక కార్యక్రమాలు



రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో మున్సిపల్ ఛైర్మన్ నరేందర్

మణికొండ, న్యూస్‌టుడే: మణికొండ మున్సిపాలిటీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ కస్తూరి నరేందర్ తెలిపారు. పురపాలక సంఘం పరిధి పుప్పాలగూడ ప్రాంతంలోని శివనగర్‌కాలనీలో రూ.42 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీహాల్ భవనాన్ని, ఫ్రెండ్స్ కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనుల్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్ని నాణ్యత లోపించకుండా చేపట్టి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్తగా ఏర్పాటైన కుమ్మర సంఘం నిర్వహించిన సమావేశంలో కస్తూరి నరేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కుమ్మరసంఘం సభ్యులు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో నర్సింగ్‌రావు, శ్రీశైలం, మల్లేష్, మోహనకృష్ణ, విజయ్, భాలయ్య, బిక్షపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నార్సింగి: గండిపేట మండలం నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం కోకాపేటలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకున్న వారంతా చిన్ననాటి విషయాలను గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. నాటి ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి, ఇతర ఉపాధ్యాయులను ఆహ్వానించి సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలల పేద విద్యార్థులకు చేయూత అందించాలని ఈ సందర్భంగా వారికి ఉపాధ్యాయులు సూచించారు.

5, 6 తేదీల్లో గిరిజన సమ్మేళనం

షాద్‌నగర్ న్యూటౌన్: గిరిజన సంఘం వ్యవస్థాపక నాయకులు గుగులోత్ ధర్మా ప్రథమ వర్ధంతి సందర్భంగా నవంబరు 5, 6 తేదీల్లో రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ నాయక్ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం షాద్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం నాయకులు శ్రీను, హీరు, రాజు, దీప్ల, పాండు పాల్గొన్నారు.

'కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేద్దాం'

షాద్‌నగర్ న్యూటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత విద్యార్థి సమైఖ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిస్తున్న కలెక్టర్ ముట్టడిని విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ అధ్యక్షుడు ఏ.విజయ్ చారి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయనతో పాటు ఇన్‌ఛార్జి ఆకాష్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం బాధాకరమన్నారు.

కూలిపోయి ఏళ్లు.. మరమ్మతులకు ఎన్నాళ్లు



భూగర్భ జలాల పెంపు కోసం లేమామిడి వాగులో నిర్మించిన చెక్‌డ్యాం కూలిపోయి ఏళ్లు గడుస్తున్నాయి. ఏటా వర్షపు నీరు వృథాగా పోతోంది. దీని మరమ్మతులపై సంబంధిత అధికారులకు ధ్యాసే లేకుండాపోయింది. గతంలో చెక్‌డ్యాం శిఖంలో నీరు నిలిచి సమీపంలోని సేద్యపు బోర్లకు ఆధారంగా ఉండేదని, ఇప్పటికైనా దానికి మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, కేశంపేట

డయల్ యువర్ డీఎం నేడు

షాద్‌నగర్ న్యూటౌన్: ఆర్టీసీ షాద్‌నగర్ డిపో పరిధిలోని ప్రయాణికుల కోసం బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ ఉష ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11నుంచి 12గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు, ప్రయాణికులు 99592 26287కు ఫోన్‌చేసి సమస్యలు, సలహాలు, సూచనలివ్వాలని ఆమె కోరారు.

బీఎస్పీ షాద్‌నగర్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

షాద్‌నగర్ న్యూటౌన్: బహుజనసమాజ్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా సొంటి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షాద్‌నగర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెల ధర్మేందర్, కార్యదర్శి జగన్, జిల్లా ఇన్‌ఛార్జి దొడ్డి శ్రీనివాస్, అధ్యక్షుడు రాములు హాజరై నియోజకవర్గ నాయకులతో మాట్లాడారు. కేశంపేట మండలం కాకునూరుకు చెందిన సొంటి శ్రీనివాస్‌ను నియమిస్తూ ఆయనకు నియామకపత్రం అందజేశారు.

1న ప్రజాసమస్యలపై సదస్సు

చేవెళ్ల: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నవంబరు 1న చేవెళ్లలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న డివిజన్ స్థాయి సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య కోరారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలం లేని వారికి 120గజాల స్థలం, మహిళలకు రూ.2,500 భృతి లాంటి ప్రజాసమస్యలపై చర్చించేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు

కేశంపేట: కేశంపేట మండలం నిర్దవెల్లి సమీపంలో వర్షాలకు దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి కోతపడి ప్రమాదకరంగా తయారైంది. దీనిపై 'వర్షాలకు రహదారులు..నీటి వనరులు ధ్వంసం' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ప్రమాద తీవ్రతను గుర్తించిన ఆగ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, మల్లయ్య, ముత్యాలు, ఖాజాపాష, రామకృష్ణ, రాజేందర్‌లు సొంత ఖర్చుతో టిప్పర్లతో మొరం పోయించి బాగు చేయించారు.

హత్య కేసులో విచారణ జరపకుండానే నా కుమారుడి అరెస్టు: నిందితుడి తల్లి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ ఠాణా పరిధిలోని బండ్లగూడజాగీర్‌లో ఆగస్టు 1న జరిగిన తాపీ మేస్త్రీ రేణుబాబు హత్య కేసులో పోలీసులు సరైన విచారణ జరపకుండానే తన కుమారుడు సాయివర్షిత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని అతడి తల్లి జయశ్రీ ఆరోపించారు. మంగళవారం రాజేంద్రనగర్‌లో ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. హత్య జరిగిన సమయంలో పోలీసులు చెప్పిన కారణాలు అవాస్తవమన్నారు. తన కుమారుడి మానసిక స్థితి బాగాలేదని, 2023లో ఆర్నెల్ల పాటు చికిత్స సైతం పొందాడన్నారు. హతుడు తాపీ మేస్త్రీతో తన కుమారుడికి గానీ, తనకు గానీ పరిచయం లేదన్నారు. తన కుమారుడి స్నేహితులు ముగ్గురు తాపీమేస్త్రీని హత్య చేశారని, ఆ సమయంలో మానసిక స్థితి సరిగా లేని తన కుమారుడికి రూ.50 లక్షలు ఇస్తామని మభ్యపెట్టి కేసులో ఇరికించారన్నారు. పోలీసులు అరెస్టు చేయడంతో కోపంతో తన కుమారుడిని కలవడానికి జైలుకు వెళ్లలేదన్నారు. కన్నప్రేమను చంపుకోలేక రెండు నెలల అనంతరం జైలుకు వెళ్లి తన కుమారుడిని వివరాలు అడగడంతో పూర్తి విషయం చెప్పాడన్నారు. పోలీసులు సరైన విచారణ జరిపి మిగిలిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై 15 రోజుల క్రితం సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన సూచనతో రాజేంద్రనగర్ డీసీపీని కలవగా వారు పాత కారణాలనే చెబుతున్నారని ఆరోపించారు.

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంకరపల్లికి చెందిన క్రిష్ణ(34) హైదరాబాద్ నుంచి శంకరపల్లికి ద్విచక్ర వాహనంపై సోమవారం రాత్రి వెళ్తున్నాడు. పటాన్‌చెరు సాకి చెరువు దాటాక జాతీయ రహదారిపై సంగారెడ్డి వైపు వెళుతున్న లారీ ఇతని ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. క్రిష్ణ జాతీయ రహదారిపై పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. భార్య పార్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

షాపింగ్‌కు వెళ్లిన యువతి అదృశ్యం

మొయినాబాద్, న్యూస్‌టుడే: షాపింగ్‌కు వెళ్తున్నాని చెప్పి ఓ యువతి అదృశ్యమైన ఘటన మొయినాబాద్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్‌కు చెందిన యువతి(21)కి ఇటీవల పెళ్లి సంబంధం కుదిరింది. ఈ నెల 27న నిశ్చితార్థం చేయడానికి పెద్దలు నిర్ణయించిన నేపథ్యంలో 21న ఉదయం షాపింగ్ వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల దగ్గర వాకబు చేసిన ప్రయోజనం లేకపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మంగళవారం పోలీసులు కేసునమోదు చేశారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

శంషాబాద్, న్యూస్‌టుడే: అధ్యాపకులు అంకితభావంతో విధులు నిర్వహిస్తే విద్యార్థుల ప్రతిభ బయటకు వస్తుందని శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.హిమబిందు పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం పాఠ్యాంశాలను బోధిస్తున్న బొడిగె నరసింహ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సాధించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన్ను డిగ్రీ కళాశాలలో అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపల్ శాలువాలతో సత్కరించి అభినందించారు.

ట్రాన్స్‌జెండర్లకు ఆధార్ కేంద్రం

అక్బర్‌బాగ్, న్యూస్‌టుడే: ట్రాన్స్‌జెండర్లు ఆధార్ కార్డులు పొందేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసింది. మలక్‌పేట సంక్షేమశాఖ కార్యాలయ భవనం రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మంగళవారం ప్రోగ్రాం మేనేజర్ జయంతి, కోఆర్డినేటర్ ప్రీతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ శిబిరం ద్వారా ట్రాన్స్‌జెండర్లు సులువుగా ఆధార్ కార్డు పొందొచ్చన్నారు. మూడు రోజుల పాటు కొనసాగే కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీడీ అరుణ, మలక్‌పేట పోస్టు మాస్టర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

మహేశ్వరం

•మహేశ్వరం •ఇబ్రహీంపట్నం •కల్వకుర్తి



తుర్కయంజాల్‌లో ఆదిశేష ఇంట్లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

పెబ్బేరు కమిషనర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ కందికట్ల ఆదిశేష తుర్కయంజాల్‌లో నివాసం ఉంటున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తుర్కయంజాల్‌లోని ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. పలు పత్రాలు పరిశీలించినట్లు సమాచారం. సోదాల వివరాలు మీడియాకు వెల్లడించేందుకు ఏసీబీ అధికారులు నిరాకరించారు.

భూమి అమ్మి చికిత్స.. అయినా దక్కని ప్రాణం



రాఘవేందర్

యాచారం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడిని బతికించుకునేందుకు కుటుంబ సభ్యులు.. తమకున్న భూమి అమ్మి చికిత్స చేయించారు. అయినా ప్రాణాలు దక్కలేదు. యాచారం మండలం తులేఖుర్ధులో మంగళవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తులేఖుర్ధు నివాసి రాఘవేందర్(32) 2 నెలల క్రితం మోటర్ సైకిల్‌పై వెళ్తుండగా మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రాఘవేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి ఇబ్రహీంపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం అతని కుటుంబసభ్యులు భూమి అమ్మి రూ.20 లక్షలు ఆసుపత్రి బిల్లు చెల్లించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీకి గతవారం తీసుకెళ్లినా ప్రాణాలు దక్కలేదు. మంగళవారం మృతి చెందాడు. అతనికి 3నెలల క్రితమే వివాహమైంది. యాచారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కొంగరకలాన్‌లోని రంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంకను గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. – న్యూస్‌టుడే, ఆదిభట్ల

నిర్మించారు.. నిరుపయోగంగా వదిలేశారు

కూరగాయల మార్కెట్ దుస్థితి



అలంకారప్రాయంగా దుకాణ సముదాయం



రోడ్డుపై దీపాల వెలుతురులో కూరలు అమ్ముతున్న రైతులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నంలో చిరు వ్యాపారులు, కూరగాయలు అమ్ముకునే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండున్నరేళ్ల కిందట మంచాల రోడ్డులో దుకాణాల సముదాయం నిర్మించారు. షెడ్లను చిరు వ్యాపారులకు, రైతులకు కేటాయించకుండా వృథాగా వదిలేశారు. దీంతో ఆరు బయటే ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ చిరు వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రైతులకు తప్పని పాట్లు..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రం కావడంతో ఇక్కడికి రోజూ వందలాది రైతులు కూరగాయలు ఆకు కూరలు తీసుకొచ్చి అమ్ముకుంటారు. వ్యవసాయ మార్కెట్‌లో మంచి షెడ్లు ఉండటంతో అక్కడ కమీషన్ ఏజెంట్ల ద్వారా కూరగాయలు విక్రయిస్తుంటారు. చిరు వ్యాపారులు, ఆకుకూరల రైతులు.. సాగర్ రహదారి అంబేడ్కర్ చౌరస్తాలో అమ్ముకునేవారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు వస్తూ ప్రమాదాలు జరిగేవి. అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి కూరగాయల మార్కెట్‌ను మంచాల రోడ్డులో తాత్కాలికంగా షెడ్లు వేయించి.. ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేశారు. అనంతరం రూ. కోటి వ్యయంతో 44 దుకాణాలు నిర్మించారు. వీటిని 2022 ఫిబ్రవరి 9న అప్పటి మంత్రి కేటీఆర్‌తో ప్రారంభించారు. రెండున్నరేళ్లు అవుతున్నా.. దుకాణాలను వ్యాపారులకు కేటాయించలేదు. అలాగే ఈ కూరగాయల మార్కెట్‌కు అనుసంధిగా సమీకృత మార్కెట్‌ను రూ.3 కోట్లతో నిర్మిస్తామని ఇక్కడే కూరగాయలు, మాంసం, పూలు, పండ్లు అన్నీ విక్రయించాలని రెండేళ్ల కిందట పనులు ప్రారంభించి వదిలేశారు.

అంబేడ్కర్ చౌరస్తా వద్దనే విక్రయాలు

కూరగాయల మార్కెట్ దుకాణాలను చిరు వ్యాపారులకు, రైతులకు కేటాయించక పోవడంతో వారంతా మళ్లీ సాగర్ రహదారి అంబేడ్కర్ చౌరస్తా వద్దనే పూలు, పండ్లు, కూరగాయలు, మాంసం అమ్ముతున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

దుకాణాలను త్వరలో కేటాయిస్తాం

– రవీంద్రసాగర్, కమిషనర్, ఇబ్రహీంపట్నం

దుకాణాలు నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమే. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో మాట్లాడి.. మంచాల రోడ్డు పక్కన నిర్మించిన కూరగాయల మార్కెట్ దుకాణాలను అర్హులకు త్వరలోనే కేటాయిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

కందుకూరు, తుర్కయంజాల్ పురపాలిక, యాచారం, న్యూస్‌టుడే:

? కందుకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో మురుగు నిల్వ ఉంటోంది. దుర్వాసన భరించలేక పోతున్నాం.– నర్సింహారెడ్డి, కొత్తగూడ

✓ సమస్య పరిష్కరిస్తాం. –సరిత, ఎంపీడీఓ, కందుకూరు

? తుర్కయంజాల్ 20వ వార్డులో రహదారులు అధ్వానంగా మారాయి. –శివ, స్థానికుడు

✓ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. –అమరేందర్‌రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్

? గున్‌గల్ బస్‌షెల్టర్ అధ్వానంగా ఉంది. కూర్చోవడానికి వీలు లేదు. – అశోక్, గడ్డమల్లయ్యగూడెం

✓ పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. –నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ, యాచారం

కార్మికురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి: సీఐటీయూ



అబ్దుల్లాపూర్‌మెట్‌లో నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన కార్మికురాలిగా సుమారు 23 ఏళ్లుగా పని చేస్తూ అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన మారగోని ఉమ గుండెపోటుతో మృతిచెందింది. ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రతినిధి ఏర్పుల నర్సింహ డిమాండ్ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో సీఐటీయూ, మధ్యాహ్న భోజన కార్మికులు ఉమ మృతదేహం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రాల సందర్శన

ఆదిభట్ల, న్యూస్‌టుడే: మంగళపల్లిలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక మంగళవారం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. దివ్యాంగులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి కలెక్టర్ ఆదేశించారు. ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓమన్ రాయబారి బీటీఆర్ గ్రీన్స్ ఎంఏకే ప్రాజెక్టుల సందర్శన



తుమ్మలూరులో ఓమన్ రాయబారి సాలెహ్ అల్‌షిబానీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్.బలరామ్

మహేశ్వరం, న్యూస్‌టుడే: భారత్‌లోని ఓమన్ రాయబారి హెచ్‌ఈ ఇస్సా అబ్దుల్లా సాలెహ్ అల్‌షిబానీ మంగళవారం మహేశ్వరం మండలం తుమ్మలూరు వద్ద బీటీఆర్ గ్రీన్స్ ఎంఏకే ప్రాజెక్టులను సందర్శించారు. కజకిస్తాన్ గౌరవ కాన్సుల్‌హెచ్‌ఈ డా.నవాబ్‌మీర్‌నాసిర్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఓమన్ రాయబారి ప్రతినిధి బృందం.. బీటీఆర్ గ్రీన్స్ ఎంఏకే ప్రాజెక్టు అధికారుల మధ్య చర్చలు జరిగాయి. వినూత్నమైన కెనేడియన్ వుడ్ విల్లా ప్రాజెక్ట్ బాగుందని.. ఈ విధానాన్ని తమ దేశంలోనూ అమలు చేయాలని ఓమన్ రాయబారి ప్రతినిధి బృందం కోరింది. ఈ సందర్భంగా నవాబ్‌మీర్ నాసిర్ అలీఖాన్.. వారికి విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అయోధ్యరాంరెడ్డి, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్, ఎండీ.ఎన్. బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టాలి



గుంతపల్లిలో అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపకులు ఎం.శ్రీనివాసరావు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందించేందుకు కృషి చేస్తున్నట్లు అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపకులు, మాజీ మంత్రి ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి గ్రూప్ కళాశాలల్లో మంగళవారం ఎంబీఏ, ఎంసీఏ నూతన విద్యార్థుల ఓరియంటేషన్ డే నిర్వహించారు. కార్యక్రమాన్ని ఈరైడ్ సంస్థ వ్యవస్థాపకుడు అల్వాల దేవేందర్‌రెడ్డి, జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ సంతోషికుమారిలతో కలిసి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల హెచ్‌ఆర్ డైరెక్టర్ డా.జయప్రద, ప్రిన్సిపళ్లు డా.రామచంద్రారెడ్డి, డా. అజ్మల్ హుస్సేన్, క్యాంపస్ ఇన్‌ఛార్జి బోసుబాబు, శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడి నియామకం

స్పందనకు వందనం

కడ్తాల్ (ఆమనగల్లు), న్యూస్‌టుడే: కడ్తాల్ మండలం రావిచెడ్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు మంగళవారం విద్యాశాఖ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిని నియమించింది. 'సాంఘికశాస్త్రం పాఠాలు చెప్పేదెవరు?' శీర్షికన 'ఈనాడు' దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన వార్తకు విద్యాశాఖ స్పందించింది. జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు ఆదేశాల మేరకు ఇదే మండలం వాసుదేవ్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న గోవర్ధన్‌ను రావిచెడ్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన మండల విద్యాధికారి సత్యనారాయణకు ఆదేశాలిచ్చారు. రావిచెడ్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుంచి సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయురాలు ఎం.శ్రీదేవి డిప్యుటేషన్‌ను రద్దు చేయకపోవడం విశేషం.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: రహదారులు, డ్రైనేజీ వంటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ 22వ వార్డు కమ్మగూడ ప్రగతినగర్ ఫేజ్-2 కాలనీవాసులు కమిషనర్ అమరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి రాజు, సభ్యులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



మాట్లాడుతున్న మూడో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ భాషా

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మూడో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ భాషా సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా ఇబ్రహీంపట్నంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 90మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు, ఆర్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఘట్టుపల్లిలోని ఆలయంలో భాజపా నేతలు బొక్క నర్సింహారెడ్డి, అందెల శ్రీరాములుయాదవ్

మహేశ్వరం, న్యూస్‌టుడే: వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్యమతస్థుడు మేకను బలిచ్చి ఆలయ ప్రాంగణాన్ని అపవిత్రం చేశాడని భాజపా జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ భాజపా బాధ్యులు అందెల శ్రీరాములు యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో భాజపా నాయకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రక్షాళనలో భాగంగా ప్రత్యేక పూజలు చేశామన్నారు. హిందువులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. కార్యక్రమంలో భాజపా నాయకులు పాపయ్యగౌడ్, సుదర్శన్‌రెడ్డి, అనంతయ్యగౌడ్, దేవేందర్‌రెడ్డి, జంగయ్య యాదవ్, యాదీష్, మాదవచారి, శ్రీనివాస్ యాదవ్, శ్రవణ్, వెంకటేష్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వల కట్టి.. పంట రక్షించి..

కందుకూరు, న్యూస్‌టుడే: చెరువులు, కుంటల్లో చేపలు పట్టడానికే ఉపయోగించే వలలు.. పండ్ల తోటలకు రక్షణ కవచాలయ్యాయి. తోటల్లోని మల్బరీ పండ్లను పక్షుల నుంచి రక్షించుకునేందుకు అన్నదాతలు చేపల వలలను వాడుతున్నారు. తోటల చుట్టూ.. చెట్లపైన వలను కట్టడంతో వాటిలో చిక్కుతామనే భయంతో పక్షులు భయపడి వెనుదిరిగి పోతున్నాయని రైతులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం సరస్వతిగూడకు చెందిన రైతులు చాలామంది మల్బరీ తోటలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ పండ్లను పక్షులు బెడద నుంచి కాపాడేందుకు చేపల వలను పొలం చుట్టూ కడుతున్నారు. దీంతో పక్షులు బెడద తప్పిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ఆర్కేపురం, న్యూస్‌టుడే: కొత్తపేటలోని శివాని మహిళా కళాశాలలో మంగళవారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, యశోద, ఎంజేఎం, మ్యాక్స్ విజన్ ఆస్పత్రుల సౌజన్యంతో 500మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ పి.రామ్‌రెడ్డి, కరస్పాండెంట్ వెదిరె సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపల్ అనిత పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట



జ్యోతి వెలిగిస్తున్న అధికారులు



సరూర్‌నగర్‌లో ర్యాలీ

యాచారం: మానవ అక్రమణ రవాణా పట్ల యువతులు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇంఛార్జ్ అధికారిణి తులసి తెలిపారు. యాచారం రైతు వేదికలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తులసీ సంస్థ సమన్వయకర్త సురేశ్‌కుమార్ మాట్లాడారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్, న్యూస్‌టుడే: మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత అని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లోని శిశు సంక్షేమ శాఖ భవన్‌లో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజ్వల ప్రతినిధులు నారాయణమ్మ, గీత, చెన్న కేశవ్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఎన్టీఆర్‌నగర్‌లో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి


ఆర్కేపురం, న్యూస్‌టుడే: టీజీవోస్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం ఎన్టీఆర్‌నగర్ మార్కెట్లోని రాష్ట్ర యూనియన్ భవనంలో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలుక నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. పత్తి, ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను అన్ని జిల్లాల మార్కెట్ అధికారులకు తెలియజేయాలని నిర్ణయించారు. ఉద్యోగుల జీత భత్యాలను స్వయంగా డ్రా చేసుకునే విధానాన్ని అవలంబించాలని తీర్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి ముఖరమ్, ఉపాధ్యక్షులు వెంకటేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం.. నిందితుడికి యావజ్జీవం



రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: ప్రేమ పేరిట మాయమాటలు చెప్పి బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు, రూ.26,000 జరిమానా విధించింది. ప్రత్యేక పీపీ సునీత కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లా కందుకూరు మండలం పోతురాజుమిట్ట గ్రామానికి చెందిన తన్నీరు రాజు అలియాస్ చిన్నపోతురాజు (27) నగరానికి వలస వచ్చి మేస్త్రీ పనులు చేస్తున్నాడు. 2017లో బాలాపూర్ రాణా పరిధిలో నూతన భవన నిర్మాణ సమయంలో ఓ బాలిక(14)తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నట్లు నమ్మించి, బాలికను తీసుకెళ్లి శ్రీకాకుళం జిల్లాలోని ఓ గ్రామంలో బంధువుల ఇంట్లో బంధించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక తండ్రి ఫిర్యాదుతో బాలాపూర్ పోలీసులు నిందితుడిని రిమాండుకు తరలించారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి మంగళవారం తుది తీర్పు వెల్లడించారు. బాలికకు రూ.10 లక్షలు పరిహారాన్ని మంజూరు చేశారు.

భయపెట్టి బాలికపై అఘాయిత్యం.. దోషికి జీవితఖైదు



రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: బాలికను భయపెట్టి పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు, రూ.30,000 జరిమానా విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(13) ప్రభుత్వ వసతిగృహంలో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతోంది. మహమ్మద్ **ఖాజా**(43) అనే లారీడ్రైవర్ 2023లో బాలికను భయభ్రాంతులకు గురిచేసి, పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. పాఠశాలకు వెళ్లి, బదిలీ సర్టిఫికెట్ ఇచ్చి బాలికను పంపించాలని కోరాడు. అనుమానంతో వసతిగృహం ప్రత్యేక అధికారిణి ఆరా తీయగా.. బాలిక జరిగిన విషయం వెల్లడించింది. అధికారిణి ఫిర్యాదుతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి హరీశ మంగళవారం తుది తీర్పు వెల్లడించారు. బాలికకు రూ.12 లక్షలు పరిహారం మంజూరు చేశారు.

ఆస్పత్రి నిర్మాణ పనుల్లో మార్పు

ఆమనగల్లు, న్యూస్‌టుడే: ఆమనగల్లులో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి భవనం బేస్‌మెంట్ ఎత్తు పెంచటానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల ప్రజలకు ఈ ఆసుపత్రి కీలకం. ఈ నేపథ్యంలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ఏర్పాటు చేయడానికి రూ. 17.50 కోట్లతో ప్రభుత్వం నూతన భవన నిర్మాణం చేపట్టింది. ఈ పనులను సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. బేస్‌మెంట్ ఎత్తు తక్కువగా నిర్మిస్తే భవిష్యత్తులో ఇబ్బంది కలుగుతుందని ఆయన అధికారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఈఈ రవీందర్‌రెడ్డి, డీఈ రవీందర్.. భవన నిర్మాణం వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలకు అనుగుణంగా ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఈ బాల్‌రెడ్డి, కాంట్రాక్టర్ గౌరీశంకర్ పాల్గొన్నారు.

ఐహెచ్‌ఆర్‌వో దక్షిణ భారత అధ్యక్షుడిగా నియామకం



కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: పాతనగరానికి చెందిన ఎస్‌కేఏహెచ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత **సయ్యద్ కాజిమ్ అలీ హాష్మీని** ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (ఐహెచ్‌ఆర్‌వో)దక్షిణ భారత అధ్యక్షుడిగా నియమించారు. సంస్థ వైస్ ఛైర్‌పర్సన్ కెప్టెన్ రామ ఆర్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనను దక్షిణ భారత (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు) అధ్యక్షుడిగా నియమించడంపై సయ్యద్ కాజిమ్ అలీ హాష్మీ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు సీపీఎం మండల కమిటీ సభ్యుడు పల్లపు విఘ్నేష్ ఇబ్రహీంపట్నంలో మంగళవారం అందజేశారు.

ఉద్యోగావకాశాలు

Mansanpalli గ్రామం, మహేశ్వరం మండలం చిల్డ్రన్ లెర్నింగ్ సెంటర్‌లో పని చేయుటకు Degree చేసి, సేవా భావం కలిగి, తెలుగు బాగా రాయడం, చదవడం, మాట్లాడటంతో పాటు, Basic English వచ్చి, 35 సంవత్సరాలలోపు వయసు కలిగి, ఆ ఊరిలో నివసించే మహిళలు కావలెను. జీతం 9వేలు. అమ్మ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ - శ్రీనివాస్ - 9948885111

నాణ్యతా ప్రమాణాలు ముఖ్యం



బడంగ్‌పేటలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మేయర్ చిగురింత పారిజాత

బాలాపూర్, న్యూస్‌టుడే: ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని 30, 31, 32 డివిజన్లలో చేపట్టనున్న డ్రైనేజీ పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బీమిడి స్వప్న, కాలనీ వాసులు కొండ శ్రవణ్‌కుమార్ యాదవ్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలకు నిధులు మంజూరు

కందుకూరు, న్యూస్‌టుడే: నేదునూరు ఆదర్శ పాఠశాలలో మరమ్మతు పనులకు రూ.24లక్షలు మంజూరైనట్లు డీఈ ఖలీముద్దీన్ తెలిపారు. పనుల పరిశీలనలో భాగంగా మంగళవారం ఏంఈఓ నర్సింహ పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విష్ణుప్రియ, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేత

కందుకూరు, న్యూస్‌టుడే: కటికపల్లి పంచాయతీ ఉద్యోగి ఎంట్ల యాదయ్య మంగళవారం మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులకు మంగళవారం మాజీ సర్పంచి నరేందర్ గౌడ్ రూ.12వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఛాయా చిత్రగ్రాహకులు చరిత్రకు సాక్ష్యం

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ఛాయాచిత్ర గ్రాహకులు చరిత్రకు సాక్షులని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుందరయ్య కళానిలయంలో తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. ఫొటో, వీడియో గ్రాఫర్లు రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించారన్నారు. రాష్ట్ర సాధనకు తన సొంత పార్టీతో కొట్లాడినట్లు చెప్పారు. సాగరహారంలో దెబ్బలు తిన్నానని గుర్తు చేశారు. ఫొటో, వీడియో గ్రాఫర్లు బలవన్మరణాలకు పాల్పడొద్దన్నారు. తన కుమారుడు ప్రదీప్ ఫౌండేషన్ ద్వారా ఫొటో, వీడియో గ్రాఫర్ల పిల్లల విద్యాభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. ఎంబీబీఎస్, ఐఐటీలో సీట్లు సాధించిన వారికి తాను ఫీజులు చెల్లిస్తానని చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి



చింతపట్లలో మాట్లాడుతున్న సీపీఎం నేత భాస్కర్

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సత్తా చాటేందుకు సీపీఎం పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి భాస్కర్ అన్నారు. యాచారం మండలం చింతపట్లలో మంగళవారం నిర్వహించిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలంతా ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, ఎస్ఎఫ్ఐ నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ గ్రామ కార్యదర్శులుగా సీహెచ్ సత్యం, గిరికాంత్‌ను ఎన్నుకున్నారు.

కిడ్నీలు పాడై.. గుండె భారమై.. కంటిచూపు క్షీణిస్తూ..

చికిత్స కోసం ఓ అభాగ్యుడి ఎదురుచూపు

రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం వారిది. భార్య, తల్లి, ముగ్గురు పిల్లల పోషణ అతడిపైనే ఉంది. కూలి తప్ప వేరే దారి లేదు. అనారోగ్యం వెంటాడింది. మధుమేహం కారణంగా ఇప్పటికే 2 మూత్రపిండాలు దెబ్బతిన్నాయి. గుండె కొట్టుకునే వేగం పడిపోయింది. ఒక కంటిచూపు కోల్పోగా మరో కంటిచూపు క్షీణిస్తోంది. తన భర్తను ఆదుకోవాలని ఆ ఇల్లాలు వేడుకుంటోంది.



అనిల్‌కుమార్‌ను కాపాడాలంటూ వేడుకుంటున్న అతని తల్లి, భార్య, పిల్లలు

రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లిలో నివసిస్తున్న కేబుల్ ఆపరేటర్ అనిల్‌కుమార్ చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులతోపాటు చిన్నచిన్న పనులు చేస్తూ ఐటీఐ పూర్తిచేశాడు. ఆర్థిక క్రమం సాహితితో అతడికి వివాహం జరిగింది. ఆ దంపతులకు ముగ్గురు సంతానం. అనిల్‌కుమార్ మాంసం దుకాణంలో పనిచేస్తూ తల్లి, భార్య, ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. మధుమేహం బారినపడగా వైద్యుల సూచనతో మందులు వాడుతున్నాడు. ఒక్కసారిగా ఆరోగ్యం విషమించడంతో ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా 2 మూత్రపిండాలు పూర్తిగా దెబ్బతిన్నట్లు వైద్యులు గుర్తించారు. గుండెలో సైతం సమస్యలున్నట్లు తేలింది. దీంతో చికిత్స తీసుకుంటూనే అతికష్టంపై రెండు నెలలు పనిచేశాడు. మళ్లీ ఆరోగ్యం విషమించడంతో ఇంటికే పరిమితమయ్యాడు.

ఆపన్నుల సాయం కోసం వేడుకోలు

ఉస్మానియాలో ఉచితంగా వైద్య సేవలు అందుతున్నప్పటికీ భర్తను అక్కడికి తీసుకెళ్లి, తీసుకురావడానికి ఖర్చు తప్పడం లేదు. కొన్ని పరీక్షలు బయట చేయించాల్సి రావడంతో ఖర్చు సొంతంగా భరించాల్సి వస్తోంది. తెలిసిన వారి వద్ద అప్పులు తీసుకుని భార్య సాహితి నెట్టుకొస్తోంది. కిడ్నీ మార్పిడి చేయాలని ఉస్మానియా వైద్యులు సూచించడంతో తను ముందుకొచ్చినప్పటికీ రక్తగ్రూపులు వేరుకావడంతో కుదరదన్నారు. దీంతో దాతల కోసం ఎదురు చూస్తున్నట్లు పేర్కొంది. ఉపాధి లేక, ఖర్చుకు రూపాయిలేక తల్లి, భార్య, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు భర్త ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుండటంతో ఏమి చేయాలో తెలియక దేవుడిపై భారం వేశామని సాహితి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాతలు సహకరించి ఆదుకోవాలని బాధితుడి తల్లి, భార్య, పిల్లలు వేడుకుంటున్నారు. పూర్తి వివరాలకు **80080 03227** నంబరులో సంప్రదించగలరు.

– న్యూస్‌టుడే, కాటేదాన్

జల్లు మన్నది



ఆర్టీసీ కళాశాల వద్ద ఎంఎంటీఎస్ వంతెన కిందకు చేరిన వరద



ఆర్టీసీ క్రాస్‌రోడ్డు జవహర్‌నగర్ వద్ద..



వారాసిగూడ మీనా కేఫ్ వద్ద చెత్తను తొలగిస్తున్న స్థానికుడు



ఘట్‌కేసర్ మండలం మాదారంలో కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై టార్పాలిన్‌లు కప్పుతున్న రైతులు

నగరంలో మంగళవారం కురిసిన కుండపోత వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పలు ప్రాంతాల్లో నీరు నిలిచి వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ట్రాఫిక్ స్తంభించడంతో అత్యవసర సేవలకు అంతరాయం కలిగింది. కొన్ని ప్రాంతాల్లో అంబులెన్స్‌లు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

సునామీపై సాంకేతిక సమరం

కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి రవిచంద్రన్



డాక్యుమెంట్లను ఆవిష్కరిస్తున్న కేంద్ర భూవిజ్ఞాన శాఖ కార్యదర్శి రవిచంద్రన్

నిజాంపేట, న్యూస్‌టుడే: ప్రపంచ దేశాలతో సమన్వయం చేసుకొని సునామీపై సాంకేతిక సమరం సాగిస్తామని, తద్వారా ప్రజలకు కచ్చితమైన సమాచారం అందించేందుకు వీలు కలుగుతుందని కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి రవిచంద్రన్ పేర్కొన్నారు. ప్రగతినగర్‌లోని భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా, సునామీ హెచ్చరిక కేంద్రం (ఇన్‌కాయిస్)లో 'డేటా బూయ్ కో-ఆపరేషన్ ప్యానెల్ (డీబీసీపీ)' అంశంపై మంగళవారం జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఆయన హాజరయ్యారు. 56 దేశాల నుంచి 150 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ ఫ్యాక్టరీ' విభాగాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విజన్ డాక్యుమెంట్లను రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఇన్‌కాయిస్ డైరెక్టర్ డాక్టర్ తుమ్మల శ్రీనివాసకుమార్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహన టెక్నీషియన్ కోర్సుకు ఉచిత శిక్షణ

అంబర్‌పేట: యువతకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ వాహనాల సర్వీస్, మెయింటెనెన్స్ టెక్నీషియన్‌గా 3 నెలల ఉచిత శిక్షణ ఇస్తామని సీనియర్ మేనేజర్ రాఘవేందర్‌రావు తెలిపారు. 18-28 ఏళ్ల వయసు, ఐటీఐ, డిప్లొమాలో ఎలక్ట్రికల్, మెకానికల్, ఆటో మొబైల్ కోర్సు పూర్తిచేసిన వారు అర్హులు. నమోదుకు 9154169212, 9603690068లో సంప్రదించాలన్నారు.

ఫ్రాంకింగ్‌కు పాతర

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అటకెక్కిన యంత్రాలు

ఈనాడు పరిశీలన



ఫ్రాంకింగ్ యంత్రం



కూకట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో..

మూసాపేట, న్యూస్‌టుడే: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయల్లో 'ఫ్రాంకింగ్' సేవలకు పాతర వేసినట్లు 'ఈనాడు' పరిశీలనలో వెల్లడైంది. రూ.లక్షల విలువైన యంత్రాలను అటకెక్కించారు. దీంతో ప్రైవేటు వ్యక్తులు సొమ్ము చేసుకుంటున్నారు.

అత్యవసర, స్టాంపు పేపర్లు లేని సమయాల్లో.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పెద్దఎత్తున భూ, ఆర్థిక లావాదేవీలు జరుగుతుంటాయి. ఏ ఒప్పందాలు చేసుకోవడానికైనా నాన్ జ్యుడీషియల్ రూ.10, 20, 50, 100 స్టాంపు పేపర్లు ఉండాలి. అవి లేని సందర్భాల్లో, అత్యవసర సమయాల్లో తెల్లకాగితాలపై రాసుకున్న ఒప్పందాలకు 'ఫ్రాంకింగ్' చేసుకుంటేనే చట్టబద్ధత కలుగుతుంది. అందుకు బ్యాంకు చలానా ఇస్తే, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది ఎర్రని రంగుతో 'రాజముద్ర' తరహా చిహ్నాన్ని పత్రాలపై ముద్రించి ఇస్తారు. అలా స్థిర, చరాస్తులకూ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. మార్టిగేజ్ డీడ్, బ్యాంకు లాకర్స్‌కు అవసరమైన ధ్రువపత్రాలకు, ఇండెమ్నిటీ బాండ్, ఎల్ఐసీ బాండ్ అవసరాలకు సైతం ఫ్రాంకింగ్‌ను వినియోగిస్తున్నారు. రూ.2 వేలలోపైతే 'టీ యాప్ ఫోలియో' ద్వారా అంతకుమించిన మొత్తమైతే ఎస్‌బీఐ చలానా చెల్లించి రసీదుతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తే నిమిషాల వ్యవధిలోనే ఫ్రాంకింగ్ చేయాలి. కానీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది దీనికి తూట్లు పొడుస్తున్నారు.

అవగాహన ఉన్నవారు ఒత్తిడి తెస్తే..

ఫ్రాంకింగ్‌పై అవగాహన ఉన్నవారు నేరుగా కార్యాలయానికి వెళ్లి సిబ్బందిపై ఒత్తిడి తేస్తే అప్పటికప్పుడు యంత్రాలను తీసి సేవలు అందిస్తున్నారు. ఈ దృశ్యం కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కన్పించింది. మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో యంత్రం పాడైందని.. మరమ్మతులకు చెన్నై సంస్థకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. రాజేంద్రనగర్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అటకెక్కించారు.

జరుగుతున్న తంతు ఇది..

గ్రేటర్‌లోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫ్రాంకింగ్ యంత్రాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఈ యంత్రాల నిర్వహణ బాధ్యతను 'పిట్నీ బోవ్స్' సంస్థకు అప్పగించారు. ఇవి మరమ్మతులు కావడం అరుదు. కానీ, రకరకాల కారణాలతో సిబ్బంది అటకెక్కించారు. సిబ్బంది లేరని, పనిచేయడం లేదని, ఇంకు అయిపోయిందని సాకులు చెబుతున్నారు. మరికొన్ని కార్యాలయాల్లో బయటి వ్యాపారులతో కుమ్మక్కవుతున్నారు. సదరు సేవల కోసం బ్యాంకులకు వెళ్లి చలానాలు చెల్లించినప్పటికీ గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న సదరు వ్యాపారులు వినియోగదారులను దండుకుంటున్నారు.

తైక్వాండో విజేతలకు బంగారు పతకాలు



గోల్నాక, న్యూస్‌టుడే: ఓయూ అంతర్ కళాశాలల తైక్వాండో 2024-25 పోటీల్లో చాదర్‌ఘాట్ కేడియా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఓయూ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో 2 బంగారు పతకాలు, ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సాధించిన టి.హృదయ్‌సింగ్, ఆర్.శివకిరణ్‌ను మంగళవారం కళాశాల సంయుక్త కార్యదర్శి ఎస్‌బీ కాబ్రా, డైరెక్టర్ డా.డీవీజీ కృష్ణ, పరిశోధన డైరెక్టర్ వందనా సాంబ అభినందించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కమలేష్ మిత్తల్, ఫిజికల్ డైరెక్టర్ ఆకాశ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తుపాకీ కాల్పులు జరిపిందెవరు?

కేసు విచారణకు రెండు పోలీసు బృందాలు

ధర్మవరం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా, బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన తుపాకీ కాల్పుల ఘటనపై విచారణకు ప్రత్యేక పోలీసు బృందం హైదరాబాద్ వెళ్లింది. పట్టపగలు జాతీయ రహదారిపై బస్టాప్ వద్ద కాల్పుల ఘటన జరగడాన్ని పోలీసు యంత్రాంగం తీవ్రంగా పరిగణించింది. అన్నమయ్య జిల్లా వీరపల్లి మండలం షికారీపాలెంకు చెందిన ముఠా సభ్యుడు కొమరి బంగారీ అనే యువకుడు బత్తలపల్లి పోలీసులకు పట్టుబడ్డాడు. గుప్తనిధులు దొరికాయని, తక్కువ ధరకే బంగారు నాణేలు, ఇతర ఆభరణాలు ఇస్తామని షికారీపాలెం ముఠా ఎరవేసి డబ్బు తీసుకొని మోసగిస్తున్నట్లు గుర్తించారు. కొమరి బంగారీతోపాటు రాణా రోర్, ఇలాచ్, రాణా హరీష్.. తెలంగాణలో పలువురిని బంగారం పేరుతో మోసగించినట్లు తేలింది. షికారీపాలెం ముఠాపై కాల్పులు జరిపిన వ్యక్తులు హైదరాబాద్‌కు చెందినవారుగా సమాచారం. వారు మరో ముఠాకు చెందినవారుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో ఒక హైదరాబద్‌కు చెందిన ఒక యూట్యూబర్ ఉన్నట్లు తెలిసింది. కేసు దర్యాప్తునకు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు రెండు పోలీసు బృందాలు వెళ్లాయి. కాల్పులు జరిపి పరారైనవారు సైబర్ క్రైమ్ పోలీసులమని చెప్పి పోలీసులను పక్కదారి పట్టించారు.

ఉపకార వేతనాలు చెల్లించకుంటే ఆందోళనలు ఉద్ధృతం: ఆర్.కృష్ణయ్య



నిరసన కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య తదితరులు

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: సుమారు 12 ఏళ్ల క్రితం నిర్ణయించిన స్కాలర్‌షిప్‌లే నేటికీ కొనసాగుతున్నాయని, ధరలు పెరుగుతున్నప్పటికీ ఉపకార వేతనాలు మాత్రం పెంచడం లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం బర్కత్‌పుర చౌరస్తా, కాచిగూడ జూనియర్ కళాశాల లేన్ తదితర ప్రాంతాల్లో వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఉద్యోగుల జీతాలు రెండుసార్లు, ఎమ్మెల్యేలు, మంత్రుల జీతాలు మూడు రెట్లు, వృద్ధాప్య పెన్షన్లను అయిదు రెట్లు పెంచారు కానీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల ఉపకార వేతనాలు పెంచలేదన్నారు. పెరిగిన ధరల ప్రకారం కళాశాల విద్యార్థుల ఉపకార వేతనాలు రూ.20 వేలకు పెంచాలని, రూ.4 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యార్థుల ఉపకార వేతనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుండగా తెలంగాణలో మాత్రం దీనికి భిన్నంగా ఉందన్నారు.

ఓబీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించండి



కాచిగూడ, న్యూస్‌టుడే: ఓబీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ మహిళా, ఓబీసీ ఉద్యోగ సంఘాలు కోరాయి. తెలంగాణ ఓబీసీ మహిళా సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, తెలంగాణ ఓబీసీ ఉద్యోగ సంఘం నేతలు నగరానికి వచ్చిన ఓబీసీ పార్లమెంట్ కమిటీ ఛైర్మన్ గణేష్ సింగ్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దేశంలో 70 కోట్ల మంది ఉన్న బీసీల సంక్షేమానికి కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలిపారు. క్రిమిలేయర్ కోటాను రూ.30 లక్షలకు పెంచాలని పేర్కొన్నారు. ఐఐటీ, ఐఐఎం, ట్రిపుల్ ఐటీ చదివే ఓబీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. పార్లమెంట్‌లో ఆమోదం పొందిన మహిళా బిల్లులో బీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలన్నారు. ఓబీసీ ఉద్యోగ సంఘం నేతలు చిన్నయ్య, రవికుమార్, జయప్రకాష్, లలిత చందన, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యేలు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యేలు శ్రీగణేష్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాజాసింగ్ ముగ్గురు వేర్వేరుగా సందర్శించారు. ఆలయ నిర్వాహకులు బస్తీవాసులతో మాట్లాడారు. ఆలయ పునర్నిర్మాణ, మరమ్మతుల పనులు ప్రభుత్వం ఆధ్వర్యంలో దేవాదాయశాఖ సోమవారం నుంచి ప్రారంభించినట్లు కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు.

సిమ్ బ్లాక్ చేస్తామని.. రూ.43.40 లక్షలు స్వాహా

నారాయణగూడ, న్యూస్‌టుడే: సిమ్ కార్డు బ్లాక్ చేస్తామని బెదిరించి నగదు కాజేశారంటూ బాధితురాలు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో మంగళవారం ఫిర్యాదు చేశారు. ప్రైవేటు ఉద్యోగినికి 'ట్రాయ్' నుంచి 'మీ దగ్గరున్న చరవాణి నంబర్లు.. మరో రెండు గంటల్లో బ్లాక్ చేస్తామని, మరింత సమాచారానికి ప్రకటనలో పేర్కొన్న నంబరులో సంప్రదించాలంటూ' సందేశం వచ్చింది. ఆమె సంప్రదించగా నకిలీ, అక్రమ ప్రకటనలు, అసభ్య సందేశాలు పంపినందుకు, నరేష్ గోయల్ పాల్పడిన రూ.6.8 కోట్ల మనీలాండరింగ్ కేసులో కూడా మీ ఫోన్ ఉపయోగించారని బెదిరించాడు. మీ పేరుతో ముంబయి అంధేరి ఠాణాలో కేసు నమోదైందంటూ ఎఫ్ఐఆర్ ప్రతులను పంపించాడు. మీ నంబర్లు బ్లాక్ చేయకుండా ఉండటానికి వివరణ లేఖ పంపిస్తే పోలీసులకు అందజేస్తామన్నాడు. సైబర్ క్రైమ్ విభాగానికి ఆమె ఫోన్‌ను కలిపాడు. ఆధార్, బ్యాంకు వివరాలను అడిగారు. అరెస్టు వారెంట్ రద్దుకు సుప్రీం కోర్టుకు సాక్ష్యం అవసరమన్నాడు. బాధితురాలికి సుప్రీంకోర్టు వెబ్‌సైట్ లింక్‌ను సైతం పంపించారు. అందులోని సివిల్ అప్పీల్‌పై క్లిక్ చేయమన్నారు. అందులో డబ్బు డిపాజిట్ చేయాలని ఉంది. బాధితురాలు తన మ్యూచువల్ ఫండ్స్, పొదుపు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు అన్ని కలిపి రూ.43.40 లక్షలు బదిలీ చేసింది. కేసు దర్యాప్తు పూర్తి కాగానే తిరిగి నగదు వస్తుందని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో ఆమె 1930తోపాటు సైబర్‌క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశారు.

చిట్‌ఫండ్ వ్యాపారి అరెస్టు

రూ.2.65 కోట్లు కాజేసి ఉడాయింపు

రాయదుర్గం, న్యూస్‌టుడే: చిట్‌ఫండ్ వ్యాపారం ముసుగులో ప్రజల నుంచి రూ.2.65 కోట్లు వసూలు చేసి ఉడాయించిన నిందితుడిని సైబరాబాద్ ఆర్థిక నేరాల పరిశోధన విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ కె.ప్రసాద్ వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ చింతల్ సాయినగర్ ప్రాంతానికి చెందిన మలినేని సీతారామయ్య తన అల్లుడు మురళీకృష్ణతో కలిసి సోమశేఖర ఫిన్ కార్ప్ పేరుతో ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. 30 ఏళ్లుగా నెలవారీ విధానంలో కమీషన్‌పై రూ.లక్ష, రూ.2 లక్షలు, రూ.5 లక్షలు, రూ.10 లక్షల చిట్టీలు నిర్వహిస్తున్నాడు. దశాబ్దాలుగా వ్యాపారం చేస్తుండడంతో అనేక మంది చిట్టీలు వేస్తుంటారు. అలా రూ.2.65 కోట్లు వసూలు చేసి జులైలో వ్యాపారాన్ని నిలిపివేస్తున్నామని, డబ్బులను త్వరలోనే తిరిగి చెల్లిస్తామని చెప్పి కుటుంబంతో కలిసి ఉడాయించాడు. గాజులరామారానికి చెందిన బాధితుడు దాబత్తుల రాజ్‌కుమార్ పోలీసులను ఆశ్రయించారు. ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీధర్ కుమార్ ఎన్టీఆర్ జిల్లా నందిగామలో సీతారామయ్యను అరెస్టు చేశారు.




హమ్మయ్య.. రాసేశాం

రెండోరోజైన మంగళవారం గ్రూప్ 1 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కోఠి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

గ్రాఫిక్స్ చూపించి ప్రజలను మోసగించడం మానుకోండి

మూసీకి రక్షణగా ప్రహరీ కట్టండి: ఎంపీ రఘునందన్‌రావు



గోల్నాక, న్యూస్‌టుడే: మూసీ ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో మంత్రులు, ప్రజాప్రతినిధులను విదేశాలకు పంపించి అక్కడి అందమైన గ్రాఫిక్స్‌ను చూపించి ఏదో జరిగిపోతుందని ప్రజలను మోసగించడం మానుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. మూసీకి ప్రక్షాళన చేయాలని, రక్షణగా ప్రహరీ నిర్మించి పేదలను ఆదుకోవాలే తప్ప అభివృద్ధి పేరుతో రోడ్డున పడేయొద్దన్నారు. మంగళవారం గోల్నాక మూసీ పరీవాహక బస్తీలలో భాజపా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, మాజీ మంత్రి కృష్ణాయాదవ్, కార్పొరేటర్ ఉమారాణి తదితరులతో కలిసి బాధితులను పరామర్శించారు. భారాస హయాంలోనే మూసీలో గుర్తులు పెట్టారని, నోటీసులిచ్చారని గుర్తుచేశారు. బాధితులకిచ్చే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, నష్ట పరిహారం ఇక్కడి ప్రజల జీవితాలను భర్తీ చేయలేవని పేర్కొన్నారు.

దేశం గర్వించే ఇంజినీర్ విశ్వేశ్వరయ్య



గాంధీనగర్: విశ్వేశ్వరయ్య దేశం గర్వించే ఇంజినీర్ అని ప్రముఖ గాయకుడు త్రినాథరావు అన్నారు. మంగళవారం త్యాగరాయగానసభలో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలు ప్రాజెక్టుల రూపకల్పన చేసిన మహనీయుడన్నారు.

'మలక్‌పేట ఐటీ పార్కును పట్టించుకోవడం లేదు'

ఈనాడు, హైదరాబాద్: మలక్‌పేటలో గతేడాది అక్టోబరులో శంకుస్థాపన చేసిన ఐటీ పార్కు టవర్ పనులు అంగుళం కూడా కదలకపోవటం బాధాకరమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. మంగళవారం ఆయన 'ఎక్స్'లో స్పందిస్తూ 'కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా ఐటీ టవర్ పనులను పట్టించుకోవడం లేదన్నారు. మూడేళ్లలో పూర్తి చేయాలనుకున్నాం. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో ఐటీని విస్తరించాలని గత భారాస ప్రభుత్వం కృషి చేసింది. ఆ ప్రయత్నాలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబును కోరుతున్నా' అని కేటీఆర్ పేర్కొన్నారు.

కంపెనీలో వాటా ఇస్తామని.. రూ.18 కోట్లకు టోకరా

ఈనాడు, హైదరాబాద్: ఓ మహిళ ఇచ్చిన గ్యారంటీతో బ్యాంకు నుంచి రూ.18.5 కోట్లు రుణం తీసుకుని మోసగించిన వ్యవహారంలో సైబరాబాద్ పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. బ్యాంకు రుణాన్ని పక్కదారి పట్టించారు. వాయిదాలు చెల్లించ లేదు. బాధితురాలి ఫిర్యాదుతో అనిల్‌కుమార్, వంశీ వర్మ, సుధారాణి, రుక్మిణీదేవిపై కేసు నమోదైంది.

ఇల్లు కొంటామంటూ పరిచయం.. మాదాపూర్‌కు చెందిన మహిళ కుమారుడికి ఎం.అనిల్‌కుమార్ పరిచయస్థుడు. మహిళకు చెందిన నాచారంలోని మూడంతస్తుల భవనం కొంటానని అడ్వాన్సుగా రూ.5 లక్షలు కట్టాడు. మిగిలిన డబ్బు ఇచ్చేందుకు కొంత సమయం కోరాడు. డబ్బుకు బదులు తన తల్లి ముప్పాళ్ల సుధారాణి, వంశీకృష్ణ వర్మ, రుక్మిణీ దేవి ప్రమోటర్లుగా ఉన్న మంగళగిరిలోని కాంచీపురం మురుగన్ సిల్క్స్ ప్రైవేటు లిమిటెడ్, వరలక్ష్మీ టెక్స్‌టైల్స్‌లో 93 శాతం వాటాలు ఇస్తానని నమ్మించాడు. 23 శాతం షేర్లు మాత్రమే బదలాయించాడు. సంస్థ విస్తరణకు ఎస్‌బీఐ అనుమతించిందని, నాచారంలోని భవనాన్ని తనఖా పెట్టాలని కోరగా మహిళ ఒప్పుకొంది. వారి సంస్థలో భాగస్వామిగా చేరేందుకు డైరెక్టర్ ఆఫ్ కంపెనీస్ దగ్గర సమ్మతం తెలిపింది.

రుణం నిధులు పక్కదారి..

రుణం మంజూరైనా అప్పటికి సంస్థల్లో మహిళకు ఎలాంటి భాగస్వామ్యం లేదు. కేవలం ప్రమోటర్లుగా వ్యవహరిస్తున్నవారే నడిపించారు. మురుగన్ సిల్క్స్ సంస్థలో 93 శాతం విలువుండే 1.25 లక్షల షేర్లు, వరలక్ష్మీ టెక్స్‌టైల్స్‌లో నామమాత్రపు షేర్లు ఇస్తున్నట్లు చెప్పినా ఎలాంటి పత్రాల్లేవు. 2024 మేలో ముప్పాళ్ల అనిల్‌కుమార్ రూ.4.87 కోట్లు మహిళకు బదిలీ చేసి నాచారంలోని భవనం కొనుగోలు చేసినట్లు సేల్‌డీడ్ చేయించుకున్నాడు. ఈ క్రమంలోనే రుణం డబ్బులు పక్కదారి పట్టించినట్లు ఎస్‌బీఐ ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలింది. చందానగర్‌లో బ్రాంచి పేరిట బ్యాంకు రుణం తీసుకుని నెల్లూరు, గుంటూరులో ఏర్పాటు చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

కమలానగర్ ఇళ్ల కేటాయింపులో అర్హులకు న్యాయం చేయాలి

బోరబండ, న్యూస్‌టుడే: ఎస్పీఆర్‌హిల్స్ కమలానగర్‌లో నిర్మించిన రెండు పడకగదుల ఇళ్ల కేటాయింపులో నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని సికింద్రాబాద్ డివిజన్ ఆర్డీఓ దశరథ్‌సింగ్ రాథోడ్‌ను పలువురు కోరారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. పక్కాఇళ్లు నిర్మిస్తామంటే తొమ్మిదేళ్లక్రితం 196 మంది తమ స్థలాలను అప్పగించారని, పొజిషన్ సర్టిఫికెట్ పొందిన 126 మందిలో 89మందికి ఇళ్లు కేటాయించారని కమలానగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ హైదర్ తెలిపారు. స్థలాలు అప్పగించి, ఇళ్లు దక్కనివారిలో 56మంది కోర్టును ఆశ్రయించారని, 39 మందితో తయారుచేసిన రెండోజాబితాలో 23మంది అనర్హులున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇళ్లు పొందిన వారిలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారని వెల్లడించారు. లబ్ధిదారులు డి.విజయ్, డి.పరంధాములు, ఇబ్రాహిం ఆర్డీఓను కలిసిన వారిలో ఉన్నారు.

ఒత్తిడిని తగ్గించుకుంటే మేలు



మాట్లాడుతున్న కనకదుర్గ, చిత్రంలో హరిణి, వివస్వన్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, రోటరీ క్లబ్ ఆఫ్ కోకాపేట సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య మాసోత్సవం సందర్భంగా మంగళవారం జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వివస్వన్ బూర్ల, మానసిక వైద్యురాలు హరిణి, కౌన్సిలర్ కనకదుర్గ మాట్లాడారు. విద్యార్థుల్లో ఇటీవలి కాలంలో ఒత్తిడి తీవ్రంగా పెరిగిందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి, కార్యదర్శి కమలాకర్, రోటరీ క్లబ్ ఆఫ్ కోకాపేట అధ్యక్షుడు రవి ముత్తినేని, కార్యదర్శి రాజశేఖర్ అబ్బు తదితరులు పాల్గొన్నారు.

రహ్మత్‌నగర్‌లో అంధకారం

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ ప్రాంతంలోని వివిధ వీధుల్లో చాలాకాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. దీనివల్ల రాత్రివేళ అంధకారం నెలకొని ప్రజలు అవస్థ పడుతున్నారు. గతుకుల రహదారులపై చీకట్లో ప్రయాణించడం ప్రమాదకరంగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సామగ్రి సరఫరా లేక: ముజ్జుఖాన్, వీధిదీపాల నిర్వహణ బాధ్యుడు

వీధి దీపాల మరమ్మతు, కొత్తదీపాల ఏర్పాటుకు తగిన సామగ్రిని జీహెచ్‌ఎంసీ అధికారులు కొన్నినెలలుగా పంపడంలేదు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం ఉండటం లేదు. మా సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు చెల్లించనందున వారూ ఇబ్బంది పడుతున్నారు.



ఓ వీధిలో వెలగని వీధి దీపం

త్వరలో పరిష్కరిస్తాం

రహ్మత్‌నగర్ ప్రాంతంలోని వీధిదీపాల విషయం మా దృష్టికి వచ్చింది. నిర్వహణ బాధ్యతలు చేపట్టిన డబ్ల్యూఎస్‌ఎల్ సంస్థ నుంచి మరోసంస్థ థర్డ్‌పార్టీ కాంట్రాక్టు పొందింది. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.
– రాజేశ్‌కుమార్, వీధిదీపాల నిర్వహణ బాధ్యుడు, జీహెచ్‌ఎంసీ సర్కిల్–19.



షేక్‌పేట వివేకానందనగర్ కాలనీ హనుమాన్ దేవాలయం వద్ద



షేక్‌పేట బస్తీ దవాఖానా వద్ద నిర్మించిన సీసీ రోడ్డు..

స్పందించారు.. మరమ్మతులు ప్రారంభించారు

షేక్‌పేట, న్యూస్‌టుడే: షేక్‌పేటలో జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్ల పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. షేక్‌పేట వివేకానందనగర్ కాలనీ హనుమాన్ దేవాలయం వద్ద, బస్తీ దవాఖానా చెంత ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో రాకపోలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై 'ఈనాడు'లో కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి రోడ్ల పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారు. బస్తీ దవాఖానా వద్ద ఇటీవల సీసీ రోడ్డు నిర్మించారు. కాగా వివేకానందనగర్ కాలనీలో సోమవారం పనులు ప్రారంభించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (ఉ.10 నుంచి మ.1 గంట మధ్య)

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

న్యూస్‌టుడే, ఖైరతాబాద్

? ఆనంద్‌నగర్ కాలనీలో మసీదు వెనుక ప్రేమ్‌నగర్ బస్తీకి వెళ్లే వీధిలో పైపులైను వేసేందుకు రోడ్డు మొత్తం తవ్వి పనులు పూర్తి చేశారు. తవ్వకాలలో వచ్చిన మట్టి దిబ్బలను మాత్రం నెలలు గడుస్తున్నా తొలగించడం లేదు.
– శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమ్‌నగర్

సమాధానం: వెంటనే తొలగించే ప్రయత్నం చేస్తాం – విజయ్ కుమార్, ఈఈ, జీహెచ్‌ఎంసీ సర్కిల్ –18.

అప్పు వివాదం... పరస్పరం కేసులు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: అప్పు విషయంలో వివాదంతో యువతి, యువకుడు పరస్పరం ఠాణాలో ఫిర్యాదు చేసుకున్న ఘటన ఇది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వనపర్తికి చెందిన రవీందర్‌నాయక్‌కి కొన్నాళ్ల క్రితం తన సోదరి ద్వారా గుంటూరుకు చెందిన శ్రావణి అనే యువతి పరిచయం అయ్యింది. శ్రావణి అమీర్‌పేట్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటుంది. ఇద్దరి పరిచయం స్నేహంగా మారింది. శ్రావణి తండ్రి అనారోగ్యంతో ఉండటంతో రవీందర్‌నాయక్ నుంచి రూ.6 లక్షలు అప్పు తీసుకుంది. రవీందర్ నాయక్ డబ్బుల కోసం ఫోన్ చేయగా దాటవస్తూ వస్తోంది. ఈనెల 20న రాత్రి 9గంటల ప్రాంతంలో యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్కులో ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగింది. కోపంతో శ్రావణి, రవీందర్‌నాయక్‌ను చెంపదెబ్బకొట్టింది. తర్వాత ఫోన్ చేయగా రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు యువకులు దేవరాజ్, తేజ, కార్తీకేయ, ఇదాయత్ రవీందర్ నాయక్‌ను చితక్కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, అప్పు తీసుకున్నందుకు తనను పెళ్లిచేసుకోవాలని వేధింపులకు గురిచేయడంతో పార్కుకు పిలిపించి, స్నేహితుల ముందు అవమాన పరిచాడని, దాడిచేసి గాయపరిచాడని రవీందర్‌నాయక్‌పై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బెదిరించి.. దాడి చేసి

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: చంపేస్తానని బెదిరింపులకు దిగిన వ్యక్తిపై కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్ ప్రాంతంలో నివాసముండే గంధం సురేష్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. గతనెల 28న రాత్రి తన ఇంటి సమీపంలో కారు నిలిపి ఇంటికి వెళ్లగా, సమీపంలో నివాసముండే మోహన్‌కుమార్ కారును తీయాలంటూ బెదిరింపులకు దిగాడు. కారు తీస్తున్న సమయంలో వచ్చి దాడి చేశాడు. బాధితుడి మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీనా పబ్ యజమానిపై కేసు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న జీనా పబ్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 38లోని జీనా పబ్‌లో విపరీతమైన శబ్దకాలుష్యానికి కారణమైంది. దీంతో చుట్టుపక్కల వారు డయల్ 100కు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. పబ్ యజమాని కౌశిక్‌పై నిబంధనల ఉల్లంఘన కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతిలేని ఇల్లు కూల్చివేత

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ప్రతిభానగర్ దివ్యాంగుల కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన ఇంటిని ఖైరతాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది పోలీసు బందోబస్తు నడుమ మంగళవారం కూల్చివేశారు. తమకున్న 60 గజాల స్థలంలో ప్రభుత్వం తరపున కొంతమేరకే ఇళ్లను నిర్మించారని, మిగతా స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు అనుమతించాలని బస్తీకి చెందిన మహిళ అధికారులకు ఇటీవల దరఖాస్తు చేసుకుంది. అయితే అనుమతి రాకముందే ఇంటిని నిర్మించినట్లు అందిన ఫిర్యాదు మేరకు కూల్చివేత జరిపినట్లు మండల ప్రత్యేక ఆర్.ఐ. కిరణ్‌రాజ్ తెలిపారు.

కాలిబాటలపై ఆక్రమణల తొలగింపు

నారాయణగూడ, న్యూస్‌టుడే: నారాయణగూడ సర్వే భవన్ ప్రాంతంలో ఫుట్‌పాత్ ఆక్రమణ తొలగింపుపై జీహెచ్‌ఎంసీ దృష్టి సారించింది, నారాయణగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ మూడు రోజులుగా కొనసాగిస్తున్నారు. శనివారం నారాయణగూడ ఫ్లైఓవర్ కూడలి నుంచి వైఎంసీఏ కూడలి, నారాయణగూడ జలమండలి నుంచి రాంకోఠి వరకు ఆక్రమణలు తొలగించారు. మంగళవారం హైదర్‌గూడ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ కూడలి నుంచి తెలుగు అకాడమి రోడ్డు, హిమాయత్‌నగర్ వై.జంక్షన్, అలాగే లిబర్టీ వైపు వరకు తొలగిపులు కొనసాగాయి.

ఓబీసీ ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించండి

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: దేశంలో ఓబీసీ ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలని ఓబీసీ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ గణేష్‌సింగ్‌కు ఓబీసీ ఫెడరేషన్ ఫర్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఓఎఫ్‌ఐసీసీఐ) వ్యవస్థాపక ఛైర్మన్ రామమోహన్ మనమాస విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై అభిప్రాయాలు కనుక్కొనేందుకు కమిటీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త పర్యటనలో భాగంగా మంగళవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణలో సమావేశమైంది. ఓఎఫ్‌ఐసీసీఐ కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ యాదవ్, శ్రీధర్, ఎంపీ అంబికా జి.లక్ష్మీనారాయణ వాల్మీకి, ఎంపీ మాణిక్కం ఠాకూర్ ఉన్నారు.

'శూద్రులే జాతి నిర్మాతలు'

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: శూద్రులే జాతి నిర్మాతలని, జాతీయ సంపదను ఉత్పత్తి ద్వారా పెంచింది వారేనని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆచార్య కంచ ఐలయ్య రచించిన 'ది శూద్ర రెబెలియన్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం బంజారాహిల్స్‌లోని లామకాన్‌లో జరిగింది. హెచ్‌సీయూ ఆచార్యురాలు సౌమ్య దేచమ్మ, వోక్సెన్ యూనివర్సిటీ ఆచార్యుడు రవికాంత్ మాట్లాడారు. శూద్రవాదం మాత్రమే ఈ దేశాన్ని విముక్తం చేస్తుందని ఐలయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్య మణికంఠ హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రతినిధి గీతా రామస్వామి, విశ్రాంత ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, సాహిత్య ప్రియులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బ తీసే కుట్ర: సీపీఐ



మాట్లాడుతున్న ఈటీ నరసింహా

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న హైదరాబాద్‌లో మత విద్వేషాలు రెచ్చగొడుతూ నగర ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్రలు చేస్తున్నారని, అలాంటివారిని ఉపేక్షించవద్దని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇటువంటి శక్తుల పట్ల ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం, నిఘా వ్యవస్థ అప్రమత్తంగా ఉండి అడ్డుకట్టవేయాలని సూచించారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం పార్టీ నాయకుడు శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నరసింహా మాట్లాడుతూ.. రాష్ట్రం మతోన్మాద శక్తుల చేతుల్లోకి పోకుండా ఉండాలంటే లౌకిక ప్రజాస్వామ్య శక్తులు నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉండాలన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని, హక్కుల కోసం నాయకుల పోరాటాన్ని పుస్తకరూపంలో ముద్రించి ప్రజలకు అందించాలని సూచించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలీన్, సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

రాయదుర్గం: రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి పిలుపునిచ్చారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారం సందర్భంగా కమిషనరేట్ పరేడ్ మైదానంలో సైబరాబాద్ పోలీసులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జాయింట్ సీపీ డి.జోయల్ డేవిస్‌తో కలిసి సీపీ అవినాశ్ మహంతి రక్తదానం చేశారు

నల్ల బ్యాడ్జీలు, మాస్కులతో నిరసన



జూబ్లీహిల్స్: జేఎన్‌ఎఫ్ఏయూకు అంబేడ్కర్ వర్సిటీ స్థలాన్ని కేటాయించడాన్ని వర్సిటీ ఉద్యోగులు నిరసించారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో అంబేడ్కర్ వర్సిటీ ఐక్యకార్యచరణ సమితి సభ్యులు నల్లబ్యాడ్జీలు, నల్ల మాస్కులు ధరించి మౌనంగా నిరసన తెలిపారు. ఐకాస ఛైర్‌పర్సన్ ఆచార్య పల్లవి కాబ్డే, కన్వీనర్ ఆచార్య వడ్డాణం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది బదిలీ

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: జీహెచ్‌ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్-19 పట్టణ ప్రణాళిక విభాగంలో సిబ్బంది బదిలీ అయ్యారు. శేరిలింగంపల్లి సర్కిల్ నుంచి చైన్‌మెన్ లక్ష్మీనారాయణ బదిలీపై యూసుఫ్‌గూడ సర్కిల్‌కి రాగా, సర్కిల్-19 టౌన్ ప్లానింగ్‌లో పనిచేసే న్యాక్ ఇంజినీర్ అభినవ్ చందానగర్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు.

రంజని సంచిక ఆవిష్కరణ 25న

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రంజని తెలుగు సాహితీ సమితి దసరా-దీపావళి సంచిక ఆవిష్కరణ ఈ నెల 25న లక్డీకాపూల్‌లోని ఏజీ కార్యాలయ రంగస్థలంలో ఉంటుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాళోజీ తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి డా.వెలుగొండ నిత్యానందరావు హాజరవుతారు. కార్యాలయ పూర్వ ఉద్యోగి, సాహితీవేత్త పాలకోడేటి సత్యనారాయణ, పీఎస్ఎం లక్ష్మిలకు జీవన సాఫల్య పురస్కారం ప్రదానోత్సవం జరుగుతుందని వెల్లడించారు.

పేదలను ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోండి

బోరబండ, న్యూస్‌టుడే: పేదలు ఇల్లు కట్టుకుంటుంటే బెదిరించి ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రహ్మత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రధానకార్యదర్శి గ్యార నాగరాజు ఆధ్వర్యంలో ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. శివమ్మ పాపిరెడ్డి హిల్స్‌లోని వివిధ బస్తీలలో 30 సంవత్సరాల క్రితం నిరుపేదలు పట్టా పొందిఇంటి నిర్మాణం, మరమ్మతులు చేపడుతుంటే కొందరు రెవెన్యూ అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి ఇంటి యజమానులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



నాడు కూర్చొనేందుకు.. నేడు అలంకరణకు

ఒకప్పుడు మనం కూర్చొనేందుకు ఉపయోగించిన చాపలు నేడు అలంకరణలో భాగమవుతున్నాయి. జూబ్లీహిల్స్‌లోని ఓ స్టోర్‌లో చాపలతో ఇలా గోడలను అలకరించి సందర్శకులకు కొత్త అనుభూతిని పంచుతున్నారు.

నాగ్‌పూర్ నమూనా పాటించాలి

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో నిర్మాణం పొడిగింపు నిర్ణయం నేపథ్యంలో.. ఈ కొత్త మార్గానికి నాగ్‌పూర్ నమూనా పాటించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ కోరారు. ఈ మేరకు మంత్రి శ్రీధర్‌బాబును మంగళవారం కలిసి మాట్లాడారు. నాగ్‌పూర్ నిర్మాణ నమూనా ప్రకారం కొత్త మెట్రో మార్గం ఒకే పిల్లర్‌పై నిర్మించాలని విన్నవించారు. తద్వారా భవిష్యత్‌లో ట్రాఫిక్ సమస్యను అధిగమించవచ్చని అభిప్రాయపడ్డారు. గతంలో నాగ్‌పూర్‌లో పర్యటించినట్లు అక్కడ ఒకే పిల్లర్‌పై చేసిన నిర్మాణం తీరును మంత్రికి వివరించారు.

బ్యాలెట్ ఎన్నికలతోనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది: చింతా మోహన్



బోరబండ, న్యూస్‌టుడే: దేశంలో బ్యాలెట్ పత్రంతో నిర్వహించే ఎన్నికలతోనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. అమెరికా వంటి అగ్రరాజ్యాలు సైతం బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నాయన్నారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఈవీఎంల ట్యాంపరింగ్ నిజమేనని, అందుకు కచ్చితమైన ఆధారాలున్నాయన్నారు. హరియాణా ఎన్నికలలో ట్యాంపరింగ్ ద్వారానే భాజపా విజయం సాధించిందని విమర్శించారు. సియోల్‌లో మాదిరిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ నది ప్రక్షాళన చేపట్టడం మంచి ఆలోచ అని, మేధావులు, ఆయారంగాల నిపుణుల సలహాలు, సూచనలు సైతం స్వీకరించాలని సూచించారు. హైడ్రాపై స్పందిస్తూ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. అయితే పేదలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ అంశంతో దేశంలో సమైక్యత దెబ్బతింటుదని ఆందోళన వ్యక్తంచేశారు. చంద్రబాబు నాయుడు తిరుపతి లడ్డూ విషయంలో పొరపాటు చేశారని, అయితే, లడ్డూ తయారీలో కల్తీ వాస్తవమేనని, అందులో వనస్పతి వంటి నూనెలు కలిపారన్నారు. జంతువుల కొవ్వు కలపారనడం తప్పని, లడ్డూను తయారు చేసేవారు శుద్ధ శాకాహారులని వెల్లడించారు.

సింగాడికుంటలో సమస్యలు పరిష్కరిస్తాం

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: వెంకటేశ్వరకాలనీ డివిజన్ సింగాడికుంటలో సమస్యలు పరిష్కరిస్తామని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం ఈ ప్రాంతంలోని బోరింగ్‌గల్లీ నుంచి చోటూ భాయ్ గల్లీ వరకు సీవరేజీ, రహదారులను పరిశీలించారు. అనంతరం చరవాణిలో జలమండలి అధికారులతో మాట్లాడి ఆ ప్రాంతంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు.

కొమురంభీంకు నివాళులు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ఆదివాసీల హక్కుల కోసం 'జల్- జంగల్- జమీన్' అంటూ నినదించి వారికోసం పోరాటం చేసిన ఉద్యమకారుడు కొమురంభీం అని ఖైరతాబాద్ నియోజకవర్గ భారాస సీనియర్‌నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. కొమురంభీం జయంతిని మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు భారాస నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులు అర్పించారు.

ప్రజావాణి కార్యక్రమం భేష్

త్రివిధ దళాల, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల కితాబు



అధికారుల బృందంతో డా.చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్, మాధవి తదితరులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం అద్భుతంగా ఉందని ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల బృందం ప్రశంసించింది. మంగళవారం మహాత్మా జ్యోతిబా పులే ప్రజా భవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌ఛార్జి జి.చిన్నారెడ్డి, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లతో అధికారుల బృందం సమావేశమైంది. ప్రజావాణి నిర్వహిస్తున్న తీరును చిన్నారెడ్డి, దివ్య వారికి వివరించారు.ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ అధికారి మాధవి రావులపాటి పాల్గొన్నారు.

- ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి 518 వినతులు అందాయి. మైనారిటీ సంక్షేమం-130, విద్యుత్తు-82, రెవెన్యూ-72, పంచాయతీరాజ్, 55, సాంఘిక సంక్షేమం- 29, ప్రవాసీ-1, ఇతర శాఖలకు 150 ఉన్నాయి.

దుబాయిలో తప్పిపోయిన హైదరాబాద్ యువకుడు

వెతికి పెట్టాలని 'ప్రవాసీ ప్రజావాణి'లో విజ్ఞప్తి



రాహుల్ రాజ్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ గౌలిగూడకు చెందిన నూగురు రాహుల్ రాజ్(32) అనే యువకుడు ఉద్యోగం కోసం విజిట్ వీసాపై దుబాయికి వెళ్లి జాడ తెలియకుండా పోయాడు. ఈనెల 14న దుబాయికి చేరుకున్న తమ కుమారుడు 19న తన బ్యాగు చోరీకి గురైందని, అందులో డబ్బు ఉన్నట్లు ఫోన్‌లో చెప్పాడని, తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యిందని తల్లిదండ్రులు కుముదిని, గౌతం మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్ లోని 'ప్రవాసీ ప్రజావాణి'లో వినతి పత్రం సమర్పించారు. రాహుల్‌ను వెతికిపెట్టి ఇండియాకు చేరుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆచూకీ తెలిసినవారు +91 98487 49667 నంబర్‌కు వాట్సాప్ చేయాలని కోరారు. టీపీసీసీ ఎన్నారై సెల్ ఛైర్మన్, అంబాసిడర్ డా.బీఎం వినోద్ కుమార్, తెలంగాణ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి వారికి ఫిర్యాదు చేసేందుకు సహకరించారు.

'యోధ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన శ్రీనివాస్, చిత్రంలో ఓల్గా, సంధ్య, ప్రొ.ఆశాజ్యోతి, ముకుంద మాల తదితరులు

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: పైడిమర్రి గిరిజ నిర్వహణలో విజయభండారు సంపాదకీయంలో తీర్చిదిద్దిన 'యోధ' మాతృత్వం-విభిన్న వ్యక్తీకరణలు' పుస్తక ఆవిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతి సమావేశ మందిరంలో నిర్వహించారు. హస్మిత ప్రచురణలు, హైదరాబాద్ విమెన్ రైటర్స్ ఫోరం, భాషా సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రచయిత్రి ఓల్గా అధ్యక్షత వహించారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మాతృత్వం అనేది భావోద్వేగాలతో ముడిపడి ఉంటుందన్నారు. పుసక్తం తొలి ప్రతిని ముకుంద మాల అందుకున్నారు. ప్రొ.కొలకలూరి ఆశాజ్యోతి, పీవోడబ్ల్యూ సంధ్య మాట్లాడారు. గోపరాజు సుధ అపర్ణ తోట, ఘంటసాల నిర్మల రచన పుస్తకాన్ని పరిచయం చేశారు.

నాట్కో పాఠశాల్లో సౌకర్యాలు కల్పిస్తాం



ప్రధానోపాధ్యాయిని గీతతో చర్చిస్తున్న తహసీల్దార్ నయీముద్దీన్, ఇన్‌స్పెక్టర్ వీరశేఖర్

బోరబండ, న్యూస్‌టుడే: బోరబండ బలహీనవర్గాల కాలనీలోని నాట్కో ప్రభుత్వోన్నత పాఠశాల ఇబ్బందుల తొలగింపునకు చర్యలు తీసుకుంటానని ఖైరతాబాద్ తహసీల్దార్ ఎం.డి.నయీముద్దీన్ తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్ ఆర్డీఓ ఆదేశాల మేరకు బోరబండ పోలీస్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.వీరశేఖర్‌తో కలిసి పాఠశాలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ విద్యాగేటు ఎదురుగా ఉన్న స్తంభాలను తొలగిస్తామని, నీటి సమస్య పరిష్కారానికి బోరుబావి తవ్వించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పాఠశాల పరిసరాలలో పోకిరీల బెడద పెరిగిందని ప్రధానోపాధ్యాయిని గీత కల్వారి ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాల ప్రాంగణంలోనే విద్యార్థులు తరచూ కొట్లాడుకుంటున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన ఇన్‌స్పెక్టర్ పికెటింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆర్.ఐ. కిరణ్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

వస్త్రాభరణాల ప్రదర్శన ప్రారంభం

మాదాపూర్, న్యూస్‌టుడే: సినీనటి అషురెడ్డితో పాటు పలువురు రూపదర్శినులు మంగళవారం హెచ్ఐసీసీలో సందడి చేశారు. హై లైఫ్ బ్రైడ్స్ పేరిట ఇక్కడ ఏర్పాటు చేసిన వస్త్రాభరణాల ప్రదర్శనను అషురెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈనెల 24 వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది.



పౌష్టిక ఆహారంతో ఆరోగ్యం



ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కజొన్న కంకులను బొగ్గులపై కాల్చి లేదా నీళ్లలో ఉడికించి తింటే మంచిదని ప్రిన్సిపల్ కాంచనవల్లి విద్యార్థులకు తెలియజేశారు.

బీ ఫార్మసీ కౌన్సెలింగ్


విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధ్యాపకులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూహెచ్ ప్రవేశాల విభాగంలో మంగళవారం బీ ఫార్మసీ కౌన్సెలింగ్ జరిగింది. రెండు రోజుల్లో మొత్తం 1000మంది విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. బుధవారంతో ఈ కౌన్సెలింగ్ పూర్తికానుంది. చివరిరోజు 600మంది విద్యార్థులు హాజరవుతారని ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్‌రావు చెప్పారు.

కూకట్‌పల్లి

మహంకాళి దేవాలయం వార్షికోత్సవం

బాలానగర్, న్యూస్‌టుడే: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ గంగపుత్ర సంఘంలోని మహంకాళి దేవాలయం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, నిర్వాహకులు జనార్దన్, దానయ్య తదితరులు పాల్గొన్నారు.


అలంకరణలో అమ్మవారు

సంక్షిప్త సమాచారం

డివిజన్ వాసులకు మౌలిక వసతులు

అల్లాపూర్: ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో అల్లాపూర్ డివిజన్ అన్ని ప్రాంతాల ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు. సబ్దర్‌నగర్ సి-బ్లాక్‌లో రూ.50 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను డీఈ శ్రీదేవి, ఏఈ రంజిత్ కలిసి కార్పొరేటర్ మంగళవారం పరిశీలించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్‌రావు, స్థానిక భారాస నాయకులు పాల్గొన్నారు.

బంజారాలకు అవకాశం కల్పించాలి

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూహెచ్ వీసీగా బంజారా సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం కల్పించాలని వర్సిటీ బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షుడు వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటివరకు బంజారా అధ్యాపకులను నియమించలేదని, దీన్ని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పూడికతీత పనుల పర్యవేక్షణ

బాలానగర్: ఓల్డ్‌బోయిన్‌పల్లి హస్మత్‌పేట బోయిని చెరువు అలుగు కాలువ పూడికతీత పనులను మంగళవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పర్యవేక్షించారు. అంతకు ముందు హస్మత్‌పేటలోని హిందూ శ్మశానవాటిక సందర్శించి అధికారులతో సమీక్షించారు. కూకట్‌పల్లి సర్కిల్ ఈఈ గోవర్ధన్ గౌడ్, ఏఈ ఆశ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల పోలీసుల లాఠీఛార్జిలో గాయపడిన సాయికుమార్‌ను పరామర్శించారు.

పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలన

బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మంగళవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పరిశీలించారు. బీ జంక్షన్, నర్సాపూర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో రోడ్ల పరిశుభ్రత పనులను పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. రోడ్ల పక్కన కుప్పలు పెట్టకుండా ఎప్పటికప్పుడు ఎత్తాలని సూచించారు.

సీఐని కలిసిన యూత్ సభ్యులు

బాలానగర్: బాలానగర్ కొత్త సీఐ నరసింహరాజును మంగళవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ యూత్ ఫెడరేషన్ సభ్యులు కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్‌కుమార్, ప్రసన్నకుమార్, మల్లేష్ తదితరులున్నారు.

నామమాత్రంగా ప్రత్యేక డ్రైవ్
వారమైనా.. వ్యర్థాలు తొలగలే


సనత్‌నగర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో భారీగా వ్యర్థాలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తాచెదారం తీస్తామన్నారు. చెట్లకొమ్మల గుట్టలు కనిపించకుండా చేస్తామన్నారు. కార్యక్రమాన్ని హడావుడిగా ప్రారంభించిన అధికారులు.. చివరికి తుస్సుమనిపించారు. లెక్కల్లో టన్నుల కొద్ది వ్యర్థాలు తొలగించినట్లు చూపిస్తున్నప్పటికీ.. వాస్తవంలో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తుండడం ఆందోళన కలిగిస్తుంది. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్లలో వ్యర్థాల తొలగింపునకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ కహానీ ఇదీ.


వసంత్‌నగర్ ప్రధాన రహదారిలో డివైడర్‌పై చెట్లకొమ్మలు

లెక్కల్లో 56.4టన్నులు

కూకట్‌పల్లి జోన్‌లోని ఐదు సర్కిళ్ల పరిధిలో నిత్యం పారిశుద్ధ్య నిర్వహణ జరుగుతున్నా.. పేరుకుపోయి వ్యర్థాలు, చెత్తాచెదారం, చెట్లకొమ్మల గుట్టలు భారీగా దర్శనమిస్తూనే ఉన్నాయి. ఒక్క కూకట్‌పల్లి జోన్‌లోనే కాదు.. గ్రేటర్‌వ్యాప్తంగా అన్ని జోన్ల పరిధిలోని సర్కిళ్లలో ఇదే దుస్థితి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రెండు దశల్లో జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో వ్యర్థాలను తొలగించాలని నిర్ణయించారు. మొదటి దశలో మూసాపేట, కూకట్‌పల్లి, అల్వాల్ సర్కిళ్లలో ఈ నెల 16వ తేదీ నుంచి 22వరకు ఏడు రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. డివిజన్‌కొక ప్రత్యేక వాహనం, సిబ్బందిని కేటాయించగా.. వారం రోజుల్లో మొత్తం భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం అన్నింటిని తొలగించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వారంపాటు కార్యక్రమం జరగ్గా.. మూడు సర్కిళ్ల పరిధిలో ప్రత్యేక డ్రైవ్ ముగించిన రోజు మంగళవారానికి మొత్తం 56.4టన్నుల వ్యర్థాలు తొలగించినట్లు లెక్కలు చూపారు. కానీ, వాస్తవంలో ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందు ముఖ్యమైన ప్రాంతాల్లో ఎలాంటి పరిస్థితి ఉందో.. ముగిసిన తర్వాత కూడా అదే దుస్థితి ఉండడం గమనార్హం.

ఇవిగో నిదర్శనాలు

- కేపీహెచ్‌బీకాలనీ డివిజన్ వసంత్‌నగర్ డబుల్ రోడ్డులో నెలక్రితం విద్యుత్తు సిబ్బంది చెట్లకొమ్మలను భారీగా కొట్టేసి రోడ్లపక్కన, డివైడర్‌పై వదిలేశారు. వీటిని కొట్టేసిన తర్వాత స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. కానీ, కొంతమేర చెట్లకొమ్మలు తొలగించగా.. అధికశాతం వదిలేయడం గమనార్హం. మూడు మాసాల క్రితం బస్టాపు వద్ద భారీ చెట్టు కూలగా.. దాని మొద్దు కూడా అలాగే డివైడర్‌పై ఉంది.
- బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా నుంచి సనత్‌నగర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో నాలుగైదుచోట్ల భారీ వ్యర్థాల గుట్టలు ఏడాది కాలంగా ఉన్నాయి.
- బాలానగర్ ప్రధాన రహదారిలో నైపర్ సమీపంలో రోడ్డు పక్కన, ఓల్డ్‌బోయిన్‌పల్లి, కూకట్‌పల్లి డివిజన్ల పరిధితోపాటు కేపీహెచ్‌బీకాలనీ పలు ఫేజుల్లో వ్యర్థాల గుట్టలతోపాటు చెట్లకొమ్మల గుట్టలు భారీగా ఉన్నాయి.
- ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలానగర్, ఫతేనగర్, మూసాపేట, అల్లాపూర్ ప్రాంతాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: 8008573418
కేపీ హెచ్‌బీకాలనీ:8008573195, మూసా పేట:8008573423, అల్లాపూర్:9491124918

ధ్వంసమైన రోడ్డు నిర్మాణం



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి డివిజన్ పరిధి కుమ్మరిబస్తీలో రోడ్డు ధ్వంసమై భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేసిన చోట అధ్వానంగా మారింది. దీంతో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఈ విషయాన్ని కూకట్‌పల్లి సర్కిల్ అధికారుల దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా వారు సత్వరమే స్పందించి సిబ్బందితో సీసీ నిర్మాణం చేసి సమస్యను పరిష్కరించి రాకపోకలు పునరుద్ధరించారు.

కాలిబాట ప్రదేశం శుభ్రం



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ ఒకటో రోడ్డులో రహదారిని జీహెచ్ఎంసీ సిబ్బంది శుభ్రం చేశారు. ఎంఐజీ నివాసాల సముదాయాల్లో రహదారి పక్కన కాలిబాట ఆనుకుని పిచ్చి మొక్కలు పెరిగాయి. అక్కడే విద్యుత్తు స్తంభాలు, జలమండలికి చెందిన పైపులు ఉండటంతో పాదచారులకు అసౌకర్యంగా ఉంటోంది. వీటిని తొలగించాలని 'ఈనాడు' అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



మూసాపేట, న్యూస్‌టుడే: మోతీనగర్ పరిధి కబీర్‌నగర్‌లో తక్కువ ఒత్తిడితో కూడిన తాగునీటి సరఫరా అవుతుంది. 100 కుటుంబాల ప్రజలు వారం రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఈ సమస్యను 'ఈనాడు' జలమండలి ప్రాంతీయ మేనేజర్ విలియమ్స్ ప్రకాష్‌కు వివరించింది. స్పందించిన ఆయన మంగళవారం సిబ్బందితో మరమ్మతులు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపాం: ఎమ్మెల్యే


కార్యకర్తలతో మాట్లాడుతున్న కృష్ణారావు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం శేషాద్రినగర్‌లో జరిగిన కూకట్‌పల్లి డివిజన్ భారాస కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తూ అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు తెలుసుకొని ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, భారాస డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్, ప్రభాకర్ తదితులు పాల్గొన్నారు.

- కూకట్‌పల్లి డివిజన్ ఏవీబీపురానికి చెందిన రాంబాబుకు మంగళవారం రూ. 75,000 సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే కృష్ణారావు అందజేశారు.

ఏడుపాయల వనదుర్గామాత దర్శనం

పాపన్నపేట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాతను ఎమ్మెల్యే కృష్ణారావు మంగళవారం దర్శించుకున్నారు. వారికి అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం రాజగోపురంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మర్యాదల ప్రకారం సిబ్బంది ఆయనను సత్కరించారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం: ఎంపీ


ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న వాకర్స్

మూసాపేట, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను పట్టించుకోని విధంగా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్నారని, దీంతో ప్రజలెవరూ సంతోషంగా లేరని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. భరత్‌నగర్ కాలనీలో ఆయన మంగళవారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..తాను ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి ఐదు నెలలుగా నిత్యం ప్రజల్లో తిరుగుతున్నానన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో ఎక్కడికెళ్లినా ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. ఏ అధికారికి ఫిర్యాదు చేసినా నిధులు లేవని చేతులెత్తేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగర సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇకనైనా సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం 'వాకర్స్'తో కలిసి అల్పాహారం భుజించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవరం కాంతారావు, మూసాపేట కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ జి.శ్రీకర్‌రావు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

బెంగళూర్-వారణాసి విమాన సర్వీసుకు బాంబు బెదిరింపు
దారి మళ్లించి శంషాబాద్‌లో అత్యవసరంగా ల్యాండింగ్


విమానాశ్రయంలో నిర్జన ప్రదేశంలో పార్కింగ్ చేసిన విమానం

శంషాబాద్, న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి వారణాసికి బయల్దేరిన ఆకాశ ఎయిర్‌లైన్స్ విమాన సర్వీస్‌లో బాంబులు పెట్టాం.. గమ్యస్థానం చేరేలోపే పేల్చుతామని గుర్తు తెలియని వ్యక్తులు ఎయిర్‌పోర్ట్‌కు సందేశం పంపించడంతో భద్రతాధికారులు అప్రమత్తమయ్యారు. వారణాసి వెళ్లాల్సిన విమాన సర్వీస్‌ను దారి మళ్లించి శంషాబాద్‌లో అత్యవసరంగా దించారు. నిర్జన ప్రదేశంలో పార్కింగ్ చేసి విమానంలోని 185 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందిని కిందకు దించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం బాంబు స్క్వాడ్, జాగిలాలతో విమానంలో క్షుణ్నంగా తనిఖీలు చేయగా పేలుడు పదార్థాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మరో 35 విమానాలకు బాంబు బెదిరింపు.. పోలీసులకు ఫిర్యాదు

శంషాబాద్ నుంచి దేశవిదేశాలకు రాకపోకలు సాగిస్తున్న ఆకాశ(11), ఇండిగో(13), విస్తారా(11) ఎయిర్‌లైన్స్ సంస్థలకు చెందిన 35 విమాన సర్వీసుల్లో ఉగ్రవాదులు బాంబులు పెట్టారంటూ మంగళవారం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఎయిర్‌పోర్ట్‌కు ఈ-మెయిల్ సందేశం పంపించారు. లుకాసన్ తులి 2271, తులిప్ 17849 ఈ- మెయిల్ ఐడీల నుంచి బాంబు బెదిరింపు సందేశాలు వచ్చినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై ఎయిర్‌పోర్ట్ అధికారులు ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

సభ్యత్వ నమోదు ముమ్మరం చేయండి


మాట్లాడుతున్న సూర్యారావు

బాలానగర్, న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని భాజపా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అర్కనపల్లి సూర్యారావు అన్నారు. మంగళవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేటలో జరిగిన పార్టీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26వ తేదీలోగా బూత్‌కు 200చొప్పున సభ్యత్వం చేయాలన్నారు. భాజపా డివిజన్ అధ్యక్షుడు సంతోష్, పప్పుపటేల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలపై దాడులకు నిరసన ర్యాలీ



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాలపై దాడులు సరికాదంటూ కేపీహెచ్‌బీలో పలువురు యువకులు నిరసన చేపట్టారు. ఛత్రపతి ధర్మ రక్షణ సేన ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని ఆలయంలో దుండగుడి దాడిని నిరసిస్తూ కాలనీ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ధర్మాన్ని రక్షించాలని, దేశ కోసం అందరూ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్లకార్డులు ప్రదర్శించారు.

దంచికొట్టిన వాన


మలేషియన్ టౌన్‌షిప్ ఎదురు సర్వీస్ రహదారిలో నిలిచిన నీరు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ పరిధిలో బుధవారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. 20 నిమిషాల పాటు కురిసిన వానకు రహదారుల్లో వరద నిలిచిపోయింది. మలేషియన్ టౌన్‌షిప్ ఎదురు సర్వీస్ రహదారి, రాజీవ్ రోటరీ, బ్రాండ్ ఫ్యాక్టరీ రోడ్డులో రహదారి చిత్తడిగా మారింది. కీలక సమయం కావడంతో కొంతమేర ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పలుచోట్ల జీహెచ్ఎంసీ సిబ్బంది వరద సాఫీగా పారేలా ఏర్పాట్లుచేశారు.


హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ పైవంతెన కింద వరదను మళ్లిస్తున్న సిబ్బంది

చెత్తకు నిప్పు.. విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ పడకేసింది. ప్రాంగణంలో పేరుకున్న వ్యర్థాలను సకాలంలో తరలించక వాటికి నిప్పు పెడుతుండటంతో దట్టమైన పొగ కమ్ముకుని విద్యార్థుల ఆరోగ్యాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది. పాఠశాల ప్రాంగణంలో వ్యర్థాలు పేరుకోవడం పరిపాటిగా మారింది.

రెండోరోజు గ్రూప్-1 ప్రశాంతం


హాల్ టికెట్ తనిఖీ చేస్తున్న సిబ్బంది


చదువుకుంటున్న అభ్యర్థులు


అవినాశ్ కళాశాల వద్ద పరీక్షకు వెళ్తూ..

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి పరిధిలో గ్రూప్-1 పరీక్షలు రెండోరోజు ప్రశాంతంగా జరిగాయి. కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివ్యాంగులు 118 మందికి 94మంది హాజరవ్వగా.. 24మంది గైర్హాజరయ్యారు. అవినాష్ కామర్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 480మంది అభ్యర్థులకు 377మంది పరీక్ష రాయగా.. 221మంది పరీక్షకు హాజరుకాలేదు. ఈ నెల 27వ తేదీ వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి.

ఏళ్లుగా వరద వ్యథ

మలేషియన్ టౌన్‌షిప్ ఎదురు, ఆరోఫేజ్-వసంతనగర్ మార్గాల్లో మోకాల్లోతు నీరు


మంగళవారం ఐజేఎం విద్యుత్తు కేంద్రం ఎదురుగా నీటి ప్రవాహం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే:

- కేపీహెచ్‌బీ పరిధి ఐజేఎం విద్యుత్తు కేంద్రం ఎదురు రహదారిలో వరద నిలుస్తుండటంతో సుమారు 8 నెలల క్రితం ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ, డీఈ, ఏఈ స్థాయి అధికారులు చర్యలు చేపట్టారు. ఫలితం లేక భారీ వర్షానికి ఆ రహదారిపై వరద నిలిచిపోవడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.
- వసంతనగర్-ఆరోఫేజ్ మార్గంలోని రాజీవ్ రోటరీకి ముందు రహదారిలో వరద పోటెత్తి శ్రీనివాస ఎన్‌క్లేవ్ సెల్లార్‌లోకి దూసుకొచ్చింది. వాహనాల రాకపోకల ధాటికి ర్యాంపుపై ఏర్పాటుచేసిన గేట్లను తన్నుకుని వరద సెల్లార్‌లో మోకాల్లోతుకు పైగా చేరింది.

కాపలాదారులకు ప్రమాదం

వసంతనగర్-ఆరోఫేజ్ మార్గంలో రాజీవ్ రోటరీకి ముందు ఎడమ వైపున్న సుమారు 5 అపార్ట్‌మెంట్‌ల్లోని సెల్లార్‌లోకి వరద ఏళ్లుగా పోటెత్తుతోంది. వర్షం పడితే నివాసితులు బిక్కుబిక్కుమంటున్నారు. కాపలాదారులకు ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్తు కనెక్షన్లు ప్యానెళ్లు ఉండటంతో భారీగా వరద చేరితే విద్యుదాఘాతమయ్యే ప్రమాదం ఉంది. మేలో భారీ వర్షానికి శ్రీనివాస ఎన్‌క్లేవ్ సెల్లార్‌లోని కారు సగం మేర మునిగి, స్క్రాప్‌కి పంపించాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో ఇక్కడి రహదారి అవతలి వైపు భవనంలో సెల్లార్‌లోని పలు వాహనాలు కూడా ఇలానే చెడిపోయాయి. ఇక్కడ నాలా ఆక్రమణకు గురవడమే ప్రధాన కారణం. బురద, ఇసుక భారీగా రోజుల తరబడి మేట వేస్తుండటంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది.

డ్రెయిన్ నిర్మించాలి

మలేషియన్ టౌన్‌షిప్ ఎదురు ఐజేఎం విద్యుత్తు కేంద్రం ఎదురు సర్వీస్ రహదారి నుంచి ఫోరం మాల్ మార్గంలో జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ నిర్మాణం సగంలో ఆగిపోయింది. సమీపంలోని జంగల్, సర్వీస్ రహదారి నుంచి వరద పోటెత్తుతుండటంతో మళ్లించేందుకు డ్రెయిన్ నిర్మించాలన్న అధికారుల ఆలోచన సరైందే. కానీ, అర్ధాంతరంగా ఆగిపోవడంతో వరద రహదారిపై నిలిచిపోతోంది. వరదలో మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్లు కనిపించక ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయపడుతున్నారు. అధికారులు డ్రెయిన్ నిర్మించాలి, లేదంటే భారీ వర్షాలకు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.


ఆగిపోయిన డ్రెయిన్ నిర్మాణం

బుధవారం పరిశీలిస్తాం: చిన్నారెడ్డి, ఎస్ఈ

వరద నిలుస్తున్న రహదారులు, అపార్ట్‌మెంట్‌ల వద్ద పరిస్థితిని బుధవారం పరిశీలిస్తాం. నివాసితులు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా వరదను మళ్లించేందుకు సత్వర చర్యలు చేపడతాం.

రక్తదానానికి ముందుకు రావాలి: సీపీ


రక్తదానం చేస్తున్న సీపీ అవినాశ్ మహంతి, జాయింట్ సీపీ జోయల్ డేవిస్

రాయదుర్గం, న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణ దానంతో సమానమని, దానం చేసే వీలున్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి పిలుపునిచ్చారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారం సందర్భంగా కమిషనరేట్ పరేడ్ మైదానంలో సైబరాబాద్ పోలీసులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జాయింట్ సీపీ డి.జోయల్ డేవిస్‌తో కలిసి సీపీ అవినాశ్ మహంతి రక్తదానం చేశారు. సీపీ మాట్లాడుతూ.. థలసేమియా, బ్లడ్ క్యాన్సర్ బాధితులు, ఇటు గర్భిణులు, ప్రమాదాల క్షతగాత్రుల ప్రాణాలను రక్షించడంలో రక్తం ఎంతో అవసరం ఉంటుందని, ఈ క్రమంలో రక్తదానంతో కొరత తీర్చే అవకాశం ఉంటుందని చెప్పారు. కమిషనరేట్‌లోని సిబ్బందితోపాటు పలువురు పోలీసు అధికారులూ, సిబ్బంది రక్తదానం చేయగా మొత్తం 464 యూనిట్లు సేకరించారు. దాతలకు ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, ఏసీపీ అరుణ్, డా.సుకుమార్, వివిధ ఠాణాల ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్ఐలు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యాపారి మృతి

బాలానగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బాలానగర్ ఠాణా పరిధిలో జరిగింది. సీఐ నరసింహరాజు కథనం ప్రకారం..చింతల్ మాణిక్యనగర్‌కు చెందిన మెట్ట అప్పారావు(55) ముడిసరకు వ్యాపారి. సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై చింతల్ నుంచి వస్తూ ఆదర్శనగర్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ప్రైవేటు బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్ర గాయాలకు గురైన అతన్ని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

పబ్‌లో అర్ధరాత్రి పోలీసుల తనిఖీలు!

మాదాపూర్, న్యూస్‌టుడే: సైబరాబాద్ పరిధిలోని పబ్‌లో మంగళవారం అర్ధరాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఐటీపల పబ్‌లో అశ్లీల నృత్యాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన యువతులతో మోసాలు, మాదక ద్రవ్యాల వినియోగిస్తున్నట్లు బయటపడటంతో పోలీసులు అకస్మిక సోదాలు చేపట్టారు. సెబ్బా ర్‌వారీగా ఎస్పై, కొందరు పోలీసులు బృందంగా ఏర్పడి పబ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. జీహెచ్ఎంసీ ఇచ్చిన లైసెన్స్, ఆహార పదార్థాల నాణ్యత తదితర వివరాలు సేకరించారు. నిబంధనలు ఉల్లంఘించి చీకటి కార్యకలాపాలు ప్రోత్సహించినా, మైనర్లను అనుమతించి మద్యం అందజేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఐహెచ్ఆర్‌వో దక్షిణ భారత అధ్యక్షుడిగా నియామకం

కంచన్‌బాగ్: పాతనగరానికి చెందిన ఎస్‌కే ఏహెచ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సయ్యద్ కాజిమ్ అలీ హష్మీని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (ఐహెచ్ఆర్‌వో) దక్షిణ భారత అధ్యక్షుడిగా నియమించారు. సంస్థ వైస్ ఛైర్‌పర్సన్ కెప్టెన్ రామఅర్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకంపై సయ్యద్ కాజిమ్ అలీ హష్మీ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మురుగు సమస్య పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: మురుగు సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తామని కార్పొరేటర్ పుష్ప అన్నారు. మంగళవారం పాత రామచంద్రాపురం, శ్రీనివాసనగర్‌లో జలమండలి అధికారులతో కలిసి బస్తీ దర్శన్ కార్యక్రమం నిర్వహించారు. మురుగు సమస్యలు ఎక్కువగా ఉండటం వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారని ఆమె చెప్పారు. ప్రత్యేకంగా పైప్ లైన్ వేయాల్సిన అవసరం ఉందన్నారు. జలమండలి మేనేజర్ అభిషేక్, నాయక్, వెంకటలక్ష్మారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

6లోపు దరఖాస్తు చేసుకోవాలి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటింగ్‌లో పాల్గొనదలిచే అర్హత కలిగిన వారందరూ ఫారం-18 ద్వారా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ నమోదు కోసం ఫారం-19లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రంగారావు తెలిపారు. గతంలో ఓటరు జాబితా అందుబాటులో లేదని, అర్హత కలిగిన అందరూ, స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

'రాజ్యాంగ సవరణ చేయకుండా ఒకే ఎన్నిక ఎలా అమలుచేస్తారు'

భాగ్‌లింగంపల్లి: ఒకే దేశం- ఒకే ఎన్నికల విధానం రాజ్యాంగ సవరణ చేయకుండా ఎలా అమలు చేస్తారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కేంద్రంలోని భాజపా సర్కారును ప్రశ్నించారు. సుందరయ్య కళానిలయంలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఒకే దేశం- ఒకే ఎన్నిక ప్రధాని మోదీ ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించాలని కోరుతూ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో మోదీ అధికారం చేపట్టేందుకు ఒకే ఎన్నిక విధానం తెరపైకి తెచ్చారన్నారు. 2018లోనూ అదే తరహా హామీఇచ్చారని, వాటి అమలుపై లా కమిషన్ ప్రచారం చేసిందని, నీతి ఆయోగ్ చర్చాపత్రం విడుదల చేసిందన్నారు. 2019లో ఒకే ఎన్నిక విధానం ఆచరణలోకి తీసుకురాలేదన్నారు. పూర్వరాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. ఏక కాలంలో పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణ సాధ్యంకాదన్నారు.

బదిలీలతో గాడినపడేనా?

అక్రమ నిర్మాణాలపై పట్టణ ప్రణాళిక విభాగం ఉదాసీనత

పలువురు చైన్‌మెన్లు, న్యాక్ ఇంజినీర్లకు స్థానచలనం

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లి జోనల్ పరిధిలోని శేరిలింగంపల్లి, చందానగర్, రామచంద్రాపురం-పటాన్‌చెరు, యూసఫ్‌గూడ సర్కిళ్లలోని పట్టణ ప్రణాళిక విభాగం పనితీరు ప్రశ్నార్థకంగా తయారైంది. ముఖ్యంగా అడ్డూ అదుపు లేకుండా సాగిపోతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, సిబ్బంది లోపాయికారీ వ్యవహారాలతో అక్రమ నిర్మాణదారులకు వెన్నుదన్నుగా నిలిచి సాగిస్తుండటంతో అక్రమాలకు అడ్డుకట్ట వేయలేని పరిస్థితి వచ్చింది.

తాఖీదులిచ్చి వసూళ్లు?

ప్రధానంగా క్షేత్రస్థాయి సిబ్బంది అయిన చైన్‌మెన్లు, న్యాక్ ఇంజినీర్లు కొరకరాని కొయ్యలుగా తయారయ్యారు. ఈ క్రమంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి సోమవారం రికార్డు స్థాయిలో 16 మంది చైన్‌మెన్లను, న్యాక్ ఇంజినీర్లను వారి స్థానాల నుంచి కదిలించి ఆయా సర్కిళ్లలకు బదిలీ చేశారు.

● చైన్‌మెన్లు అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నారు. మరోవైపు, కాల్చివేతల బృందాలలో ఉన్న న్యాక్ ఇంజినీర్లు సైతం అధికారులు ఇచ్చిన ఆదేశాలు పాటించకుండా వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఆక్రమ నిర్మాణదారుల డబ్బులు ముట్ట చెబితే అరకొరగా చర్యలు తీసుకుని వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల తాఖీదుల పేరుతో భారీగా వసూలుచేస్తున్నారు.

● ఆయా సర్కిళ్లలో పట్టణ ప్రణాళిక విభాగాలకు కొన్ని నెలల క్రితం కొత్తగా అధికారులు వచ్చి చేరారు. అధికారులు కొత్తవారు కావడంతో కిందిస్థాయి సిబ్బంది మరింతగా చెలరేగిపోయి భారీగా వసూళ్లకు తెగబడ్డారు. ఈ క్రమంలో జోనల్ కమిషనర్ భారీగా బదిలీల వేటుకు నిర్ణయం తీసుకుని అమలు చేశారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులు గాడిన పడతాయని అధికారులు భావిస్తున్నారు.

● ముఖ్యంగా పెద్దఎత్తున వివాదాస్పద భూముల్లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. లెక్కకు మిక్కిలి భవనాలు నిర్మాణాలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తలనొప్పిగా మారిన చైన్‌మెన్లు, కూల్చివేతల బృందాల్లో ఉన్న న్యాక్ ఇంజినీర్లతో చర్యలు తీసుకునే పరిస్థితి లేకపోవడంతో వీరందరినీ మూకుమ్మడిగా బదిలీ వేటు వేశారు. ఈ పరిస్థితుల్లో పట్టణ ప్రణాళిక విభాగం గాడిన పడుతుందని భావిస్తున్నారు.



శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం

నామమాత్రంగా జోనల్ సిటీ ప్లానర్..

వాస్తవానికి జోన్ పరిధిలోని సర్కిళ్లలోని పట్టణ ప్రణాళిక విభాగాల పనితీరు మెరుగు కోసం జోన్ సిటీ ప్లానర్ కృషి చేయాలి. అధికారులు, సిబ్బంది పనితీరు, అక్రమ నిర్మాణాలపై చర్యలు వంటి వ్యవహారాలు తమ పరిధి కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో జోన్ పట్టణ ప్రణాళిక విభాగం పని తీరు మసకబారింది.

● ఈ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఇక్కడి పరిస్థితులను చక్కబెట్టాలని పౌరులు కోరుతున్నారు. ఇటీవల కొంతమంది బిల్డర్లు కలిసి జోన్ సిటీ ప్లానర్ శ్వాం కుమార్‌ను కలిసి ఆయా సర్కిళ్లలో జరుగుతున్న వ్యవహారాలను వివరించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. సిటీ ప్లానర్‌గా బాధ్యత తీసుకోవాలని వారు కోరారు. ఈ క్రమంలో జోనల్ కమిషనర్ చర్యలకు దిగినట్లు వినికిడి.

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414
మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201
రాయదుర్గం - 9848990352,
పటాన్‌చెరు(రూ) - 8008573228
చందానగర్ - 8008555322

న్యూస్‌టుడే, మాదాపూర్, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, ఆల్విన్‌కాలనీ.

? కొండాపూర్ శిల్పాపార్క్ మెయిన్ రోడ్డులో చెత్త పేరుకుపోయింది. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం.-రామారావు, శిల్పాపార్క్, కొండాపూర్

✓ చెత్తకుప్పలు తొలగించి రోడ్డు శుభ్రం చేయిస్తాం.
-శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ పారిశుద్ధ్య విభాగం, చందానగర్ సర్కిల్

? చందానగర్-అమీన్‌పూర్ రహదారి గుంతలమయంగా మారింది. మరమ్మతులు చేయించాలి. - లతీఫ్, అమీన్‌పూర్

✓ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చి తగిన చర్యలు తీసుకుంటాం.
-మోహన్‌రెడ్డి, ఉపకమిషనర్, చందానగర్ సర్కిల్

? రామచంద్రాపురం బీరంగూడ కమాన్ వద్ద ఆటోవాలాలు రోడ్డుకు అడ్డంగా నిలుపుతున్నారు. - సుబ్బారావు రామచంద్రాపురం

✓ రోడ్డు చిన్నదిగా ఉండటంవల్ల ఆటో ఒకటి నిలబడినా ట్రాఫిక్ నిలుస్తుంది. ప్రత్యామ్నాయ మార్గాలపై ఆలోచన చేస్తున్నాం.
- పవన్, ట్రాఫిక్ సీఐ రామచంద్రాపురం

? ఆల్విన్‌కాలనీ ఫేస్-2 రోడ్ నం.42లో నిత్యం ఉదయం పూట మురుగు పొంగుతోంది. - శేషగిరిరావు, ఆల్విన్ కాలనీ

✓ పరిశీలించి డ్రైనేజీ లైన్‌లో ఉన్న వ్యర్థాలు తొలగిస్తాం. సమస్య ఎక్కువగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
- శివ, భాగ్యనగర్ జలమండలి పర్యవేక్షకుడు

మియాపూర్: మియాపూర్ జెపిఎన్ నగర్ ప్రధాన రహదారిలో హోటళ్ల వద్ద రాత్రి వేళలో వ్యర్థాలు రోడ్డుపైనే పడవేస్తున్నారని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా ఈనాడు దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను ఈనాడు ఎస్టేట్ కనకరాజు దృష్టికి తీసుకెళ్లడంతో చెత్త, వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టారు.

స్పందనకు వందనం

కొత్త మెట్రో మార్గానికి నాగ్‌పూర్ నమూనా పాటించాలి

మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే గాంధీ వినతి

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో నిర్మాణం పొడిగింపు నిర్ణయం నేపథ్యంలో.. ఈ కొత్త మార్గానికి నాగ్‌పూర్ నమూనా పాటించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ కోరారు. ఈ మేరకు మంత్రి శ్రీధర్‌బాబును మంగళవారం కలిసి మాట్లాడారు. నాగ్‌పూర్ మెట్రో నమూనా ప్రకారం కొత్త మెట్రో మార్గం ఒకే పిల్లర్‌పై నిర్మించాలని విన్నవించారు. తద్వారా భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు అధిగమించవచ్చని అభిప్రాయపడ్డారు. గతంలో నాగ్‌పూర్‌లో పర్యటించి నట్టు ఇక్కడ ఒకే పిల్లరుపై చేసిన నిర్మాణ తీరును మంత్రికి వివరించారు. ఈ మేరకు మంత్రికి వినతి పత్రం అందజేయగా.. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

● నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గ్రేటర్ కమిషనర్ ఇలంబర్తిని ఎమ్మెల్యే గాంధీ కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించారు. రోడ్ల నిర్మాణం, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, వీధిదీపాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు.



మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

తాగు నీరు రోడ్డుపాలు



రోడ్డుపై పారుతూ చివరికి డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో కలుస్తుంది. ఈ విషయమై జలమండలి జీఎం రాజశేఖర్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా పైప్‌లైన్ లీకేజీ ప్రాంతాన్ని జలమండలి ఉన్నతాధికారులు సందర్శించినట్లు తెలిపారు. మరమ్మతులు చేయాలంటే ప్రశాంత్‌నగర్ నుంచి హైటెక్‌సిటీ వచ్చే కృష్ణా ఫేజ్ 3 నీటి సరఫరాను నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఈనెల 24న సరఫరాను నిలిపివేసి ఆ రోజు మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

అయ్యప్పసొసైటీ కాలనీ రోడ్డు నం.5,6 లోని తాగునీటి పైప్‌లైన్ లీకేజీ ఏర్పడింది. విలువైన తాగునీరు రోడ్డు పాలవుతుంది. ఐదు నెలలుగా నీరు వృథా అవుతున్నా జలమండలి అధికారులు మరమ్మతులపై శ్రద్ధ చూపడం లేదు. ఆయా వీధుల్లో తాగునీరు

-న్యూస్‌టుడే, మాదాపూర్



డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లోకి చేరుతున్న నీరు

అణగారిన వర్గాల ఆత్మబంధువు కుమురం భీం

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు కుమురం భీం అని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలం మధు అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో కుమురం భీం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు ఆత్మబంధువుగా నిలిచారని తెలిపారు. ఆదివాసీలపై నిజాం సర్కార్ సాగించిన దుర్మార్గాలపై పోరాడిన సందర్భంలో జల్ జంగల్ జమీన్ నినాదంతో పోరాడి వీర మరణం పొందారన్నారు.



నివాళి అర్పిస్తున్న నీలం మధు తదితరులు

రోలర్ స్కేటింగ్‌లో విద్యార్థిని ప్రతిభ

మియాపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయిలో జరిగిన రోలర్ స్కేటింగ్ పోటీల్లో మదీనాగూడ కెనరి ది పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థిని కటకేటి పూజ ప్రతిభ చాటింది. ఈనెల 5-8 వరకు నగరంలో జరిగిన 62వ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ 2024 పోటీల్లో 9-11 ఏళ్ల బాలికల విభాగంలో రెండో బహుమతి సాధించింది. దీంతో జాతీయ స్థాయి పోటీకి అర్హత సాధించింది. పూజ త్వరలో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొననుంది. మంగళవారం పాఠశాల ఛైర్మన్ డా.శ్వేతారెడ్డి, ప్రిన్సిపల్ లిడియా క్రిస్టినా, స్కూల్ హెడ్ నవీన్ కుమార్, కోఆర్డినేటర్లు ఆర్య, ముక్తా, మహేష్ తదితరులు పూజను అభినందించారు.



పూజ

పాఠశాలకు విరాళం

మియాపూర్, న్యూస్‌టుడే: మియాపూర్‌కు చెందిన ఐటీ ఉద్యోగిని కలివేముల సాహితి దుండిగల్‌లోని సరస్వతి విద్యా మందిర్‌కు తన పుట్టినరోజు సందర్భంగా ఒక నెల వేతనం రూ.50వేలను విరాళంగా అందజేశారు. పేద పిల్లలకు విద్యావ్యాసాన్ని అందిస్తున్న ఈ పాఠశాలకు ఆమె తమ్మికట్టుకొని సహాయం చేసేందుకు ముందుకు వచ్చి విరాళాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాహితి తండ్రి మనోహర్, ప్రిన్సిపల్ శ్రీమన్నారాయణ, పాఠశాల కమిటీ ప్రధాన కార్యదర్శి మహేష్, యాదగిరి మహాలక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు వేగంగా చేయాలి

మియాపూర్, న్యూస్‌టుడే: మియాపూర్ డివిజన్ పరిధిలోని నాయనమ్మ కుంట చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఉప్పలపాటి శ్రీకాంత్ అధికారులను కోరారు. మంగళవారం నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి చెరువు వద్ద చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. చెరువు చుట్టూ బండ్ నిర్మాణంతో చెరువులో డ్రైనేజీ కలవకుండా ప్రత్యేక లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. చెరువు చుట్టూ ఆక్రమణల గురికాకుండా కంచె ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ శ్రీకాంత్ ఇరిగేషన్ శాఖ డీఈ పావని దృష్టికి తీసుకెళ్లారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందారు. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లికి చెందిన క్రిష్ణ(34) హైదరాబాద్ నుంచి శంకర్‌పల్లికి ద్విచక్ర వాహనంపై సోమవారం రాత్రి వెళ్తున్నారు. పటాన్‌చెరు సాకి చెరువు దాటాక జాతీయ రహదారిపై సంగారెడ్డి వైపు వెళుతున్న లారీ ఆయన ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. క్రిష్ణ జాతీయ రహదారిపై పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. భార్య పార్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంటల తరబడి ట్రాఫిక్ అవస్థ

లింగంపల్లి- గచ్చిబౌలి రహదారిలో మంగళవారం తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో వాహనదారులు అల్లాడిపోయారు. శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం ఎదురు చౌరస్తా దగ్గర భారీ వాహనం సాంకేతిక సమస్యతో నిలిచిపోవడంతో ట్రాఫిక్ ఏర్పడింది. ఉదయం 7 గంటల నుంచి దాదాపు 10 గంటల వరకు వాహనదారులు అవస్థ పడ్డారు. ఉదయం పిల్లలు పాఠశాలకు, ఐటీ నిపుణులు కార్యాలయాలకు వెళ్లే సమయం కావడంతో అంతా ట్రాఫిక్ లో నిలిచిపోయి ఇబ్బందిపడ్డారు. - న్యూస్‌టుడే, శేరిలింగంపల్లి



బెంగళూరు- వారణాసి విమానానికి బాంబు బెదిరింపు

శంషాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్

శంషాబాద్, న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి వారణాసికి బయల్దేరిన ఆకాశ ఎయిర్‌లైన్స్ విమాన సర్వీస్‌లో బాంబులు పెట్టాం.. గమ్యస్థానం చేరే లోపే పేలుతాయని గుర్తు తెలియని వ్యక్తులు ఎయిర్‌పోర్టు అధికారులకు సందేశం పంపించడంతో భద్రతాధికారులు అప్రమత్తమయ్యారు. వారణాసి వెళ్లాల్సిన విమాన సర్వీసును దారి మళ్లించి శంషాబాద్‌లో అత్యవసరంగా దింపారు. నిర్జన ప్రదేశంలో పార్కింగ్ చేసి విమానంలోని 185 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందిని కిందకు దించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం బాంబు స్క్వాడ్, జాగిలాలతో విమానంలో క్షుణ్ణంగా తనిఖీలు చేయగా పేలుడు పదార్థాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



విమానాశ్రయంలో నిర్జన ప్రదేశంలో నిలిపిన విమానం

మరో 35 విమానాలకు: శంషాబాద్ నుంచి దేశవిదేశాలకు రాకపోకలు సాగిస్తున్న ఆకాశ(11), ఇండిగో(13), విస్తారా(11) ఎయిర్‌లైన్స్ సంస్థలకు చెందిన 35 విమాన సర్వీసుల్లో ఉగ్రవాదులు బాంబులు పెట్టారంటూ మంగళవారం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఎయిర్‌పోర్టుకు ఈ-మెయిల్ సందేశం పంపించారు. దీనిపై ఎయిర్‌పోర్టు అధికారులు ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ట్రాన్స్‌జెండర్లకు ఆధార్ కేంద్రం

అల్వర్‌బాగ్, న్యూస్‌టుడే: ట్రాన్స్‌జెండర్లు ఆధార్ కార్డులు పొందేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసింది. మలక్‌పేట సంక్షేమశాఖ కార్యాలయ భవనం రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మంగళవారం ప్రోగ్రాం మేనేజర్ జయంతి, కోఆర్డినేటర్ ప్రీతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ శిబిరం ద్వారా ట్రాన్స్‌జెండర్లు సులువుగా ఆధార్ కార్డు పొందవచ్చన్నారు. మూడు రోజులపాటు కొనసాగే కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీడీ అరుణ, మలక్‌పేట పోస్టుమాస్టర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రాయదుర్గం, న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణ దానంతో సమానమని, దానం చేసే వీలున్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి పిలుపునిచ్చారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారం సందర్భంగా కమిషనరేట్ పరేడ్ మైదానంలో సైబరాబాద్ పోలీసులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హెచ్ఎమ్‌సీ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జాయింట్ సీపీ డి.జోయల్ డేవిస్‌తో కలిసి సీపీ అవినాశ్ మహంతి రక్తదానం చేశారు. కమిషనరేట్‌లోని సిబ్బంది తోపాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది రక్తదానం చేయగా మొత్తం 464 యూనిట్లు సేకరించారు. సీఏఆర్ హెడ్క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, ఏసీపీ అరుణ్, డా.సుకుమార్, వివిధ రాణాల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సీపీ అవినాశ్ మహంతి, జాయింట్ సీపీ జోయల్ డేవిస్

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

రాయదుర్గం, న్యూస్‌టుడే: విద్యార్థులు కేవలం వృత్తి విద్యా కోర్సులపైనే కాక భౌతిక, రసాయన, జీవ తదితర రంగాల్లో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు కృషి చేయాలని గోపన్‌పల్లి టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టీఐఎఫ్ఆర్) డైరెక్టర్ ఎం.కృష్ణమూర్తి అన్నారు. విజ్ఞానశాల సంస్థ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు టీఐఎఫ్ఆర్ విద్యా క్షేత్ర సందర్శన నిర్వహించారు. 90 మంది వరకు విద్యార్థినులు సందర్శించారు. భౌతిక, రసాయన, జీవ శాస్త్ర పరిశోధనలు పరిశీలించారు. మెకానో బయాలజీ, కంప్యూటేషన్ కెమిస్ట్రీ, నానో ఫ్యాబ్రికేషన్ ప్రయోగశాలలను సందర్శించారు. మైక్రో స్కోప్‌లలో పలు జీవశాస్త్ర ప్రయోగాలను ప్రత్యక్షంగా వీక్షించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ.. టీఐఎఫ్ఆర్‌లో ఉన్నత డిగ్రీలు, ఇంటర్న్‌షిప్‌లు, సమ్మర్ ఫెలోషిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



గోపన్‌పల్లి టీఐఎఫ్ఆర్‌లో విద్యార్థినులు

హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బ తీసే కుట్ర: సీపీఐ

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న హైదరాబాద్‌లో మత విద్వేషాలు రెచ్చగొడుతూ నగర ప్రతిష్ఠను దెబ్బతీసే శక్తులు చేస్తున్నాయని, ఆలాంటివారిని ఉపేక్షించవద్దని సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇటువంటి శక్తుల పట్ల ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం, నిఘా వ్యవస్థ అప్రమత్తంగా ఉండి అడ్డుకట్టవేయాలని సూచించారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం పార్టీ నాయకుడు నేర్లకంటి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నరసింహ మాట్లాడుతూ.. రాష్ట్రం మతోన్మాద శక్తుల చేతుల్లోకి పోకుండా ఉండాలంటే లౌకిక ప్రజాస్వామ్య శక్తులు నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉండాలన్నారు.

ప్రశ్నించే వారికి అవకాశం ఇవ్వండి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లా పట్టభద్రుల ఎన్నికల్లో తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు కోరారు. పటాన్‌చెరులో ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి రూ.10లక్షల ఆరోగ్య బీమా, జీవిత బీమా వచ్చేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తానని తెలిపారు. ఉపకారవేతనాలు అందేలా చూస్తానన్నారు. ట్రస్మా కుటుంబ సభ్యుడిగా గుర్తించాలని కోరారు. ప్రశ్నించే వారికి అవకాశం ఇవ్వాలని ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో ట్రస్మా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జనరల్ సెక్రెటరీ ఆంథోని, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రమోద్ కుమార్, జాయింట్ సెక్రెటరీ సతీష్ కుమార్, గీత శేఖర్, నాగ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ చదివిన వారు ఓటరుగా నమోదవ్వాలి

రామచంద్రాపురం రూరల్: పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో డిగ్రీ చదివిన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలని గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యజమానుల సంఘం రాష్ట్ర కోశాధికారి రామచేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురం, పటాన్‌చెరు పాఠశాలల ఉపాధ్యాయులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, పటాన్‌చెరు విభాగం అధ్యక్షుడు సాయితేజ, తదితరులున్నారు.



ట్రస్మా నాయకులను సత్కరించిన ఉపాధ్యాయులు

హై లైఫ్ బ్రైడ్స్ వస్త్రాభరణాల ప్రదర్శన ప్రారంభం

మాదాపూర్: సినీ నటి అమరెడ్డి తో పాటు పలువురు రూపదర్శినులు మంగళవారం హైటెక్స్‌లో సందడి చేశారు. హై లైఫ్ బ్రైడ్స్ పేరిట ఇక్కడ ఏర్పాటు చేసిన వస్త్రాభరణాల ప్రదర్శనను అపరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. రూపదర్శినులు సరికొత్త డిజైన్ దుస్తులు, ఆభరణాలు ధరించి హొయలుపోయారు. ఈనెల 24 వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది.



ప్రదర్శన ప్రారంభోత్సవంలో అపరెడ్డి, రూపదర్శినులు

పాఠశాలలకు 50 కంప్యూటర్ల వితరణ

రామచంద్రాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం మోబిస్ హ్యుండాయ్ కంపెనీ తెల్లాపూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలకు 30, ప్రాథమిక పాఠశాలకు 10, వెలిమెల ప్రాథమిక పాఠశాలకు 10 చొప్పున కంప్యూటర్లను అందజేశారు. తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో డైరెక్ట్ హెడ్ ఆఫ్ సియోషన్ అధ్యక్షుడు ఈశ్వరగిరి రమణతో కలిసి కమిషనర్ సంగారెడ్డి కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించారు. కంప్యూటర్ సాధన పత్రాలను మోబిస్ హ్యుండాయ్ పరిశ్రమ ప్రతినిధులు ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ కు అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు వేణుమాధవ్, వంశీ, జేనా ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ఎస్ఎంసీ సభ్యులు రమణ, రామ్మూర్తి తదితరులున్నారు.



కంప్యూటర్ల స్వాధీన పత్రాన్ని అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

ఘనంగా కుమురం భీం జయంతి


నిజాంపేటలో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నిజాంపేట, న్యూస్‌టుడే: నిజాంపేట పరిధి ఇంద్రన్నకాలనీలో సీపీఐ బాచుపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో విప్లవ వీరుడు కుమురం భీం జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్, ఆశి యాదయ్య, శేషయ్య, సైదులు, ఖాజా, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్

ఐహెచ్‌ఆర్‌వో దక్షిణ భారత అధ్యక్షుడిగా నియామకం


సయ్యద్ కాజిమ్ అలీ హాష్మీ

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: పాతనగరానికి చెందిన ఎస్‌కేహెచ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సయ్యద్ కాజిమ్ అలీ హాష్మీని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్(ఐహెచ్‌ఆర్‌వో) దక్షిణ భారత అధ్యక్షుడిగా నియమించారు. సంస్థ వైస్ ఛైర్పర్సన్ కెప్టెన్ రామ ఆర్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనను దక్షిణ భారత (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు) అధ్యక్షుడిగా నియమించడంపై సయ్యద్ కాజిమ్ అలీ హాష్మీ సంతోషాన్ని వ్యక్తం చేశారు.


మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు పత్రాన్ని అందిస్తున్న భాజపా నాయకులు

రహదారుల ఆక్రమణలను అడ్డుకోవాలంటూ వినతి

నిజాంపేట, న్యూస్‌టుడే: నిజాంపేట నగర పాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్డు స్థలాలను ఆక్రమించి చేపడుతున్న ఆక్రమణలను అడ్డుకోవాలని కోరుతూ భాజపా నగర శాఖ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలోని పలువురు మంగళవారం విన్నవించారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ నిజాంపేట ప్రశాంతి హిల్స్‌లోని సర్వే నంబరు 89లో రోడ్డు స్థలంలో భవన నిర్మాణం కొనసాగుతుందన్నారు. దాంతో స్థానికులకు దారి మూసుకుపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రగతినగర్‌లో సర్వే నంబరు 149 అనుమతి పత్రాలతో పక్కనే ఉన్న 151లో నిర్మాణం చేస్తున్నారన్నారు. శ్రీకృష్ణా గార్డెన్స్ వెనుక ఓ బడా వ్యక్తి రోడ్డు స్థలాన్ని కబ్జా చేశాడని చెప్పారు. వీటిపై చర్యలు తీసుకుని రోడ్ల ఆక్రమణలకు గురికాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను లోపాల పేరుతో బాదుడు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: ఆస్తిపన్నుల పునర్మదింపులో సంబంధిత సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. నిబంధనల మేరకు ఇంటి యజమానులకు నోటీసు జారీచేసి వారి సమక్షంలో వారి ఇంటికి కొలతలు తీసి అద్దె విలువ ఆధారంగా పన్నులు మదింపు చేయాల్సి ఉంటుంది. నోటీసులు కాదు కదా కనీస సమాచారం ఇవ్వకుండానే తమ ఇష్టానుసారంగా రూ.వేలల్లో ఉన్న ఆస్తిపన్నును రూ.లక్షల్లో పునర్మదింపుచేసి డిమాండ్ నోటీసులు జారీచేస్తుండటంతో యజమానులు లబోదిబోమంటున్నారు.

ఎప్పటికప్పుడు మార్పులు

కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలో 1,10,959 నిర్మాణాలు ఆస్తిపన్ను పరిధిలో ఉన్నాయి. వీటి నుంచి ఏటా ఆస్తిపన్ను రూపంలో రూ.123.92 కోట్ల మేర ఆదాయం వస్తుందని అంచనా వేస్తుంటారు. రూ.80 కోట్లు మించడంలేదు. పన్నుల మదింపులో జరిగిన లోపాల కారణంగానే జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ఈ సమస్య తలెత్తుతుందని భావించి మూడు నెలల క్రితం అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి పరిశీలనకు శ్రీకారం చుట్టారు. 2016 జీహెచ్ఎంసీ ఎన్నికలప్పుడు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.1200 లోపు ఆస్తి పన్నులు చెల్లించేవారి నుంచి సాలీనా రూ.101 మాత్రమే వసూలు చేయాలని నిర్ణయించారు. దీంతో 45,650 మంది ఇంటి యజమానులు అప్పట్లో లబ్ధి పొందారని అవకాశం ఏర్పడింది. ఏడాదికి ఇందులో అర్హులెందరు ఉన్నారో దానిపై సర్వే నిర్వహించగా 29,810 మంది అర్హులు ఉన్నట్లు తేల్చారు. మిగిలిన 15,840 మంది ఇళ్లకు మళ్లీ కొలతలు తీసి రెట్టింపు పన్నులు విధించి వసూలు చేశారు.


కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం

ప్రైవేటు సిబ్బంది జోక్యం.. అక్రమాలకు ఊతం

పునర్మదింపులో ఇష్టారాజ్యం

తాజాగా రూ.101 పన్నులు చెల్లిస్తున్న ఇళ్లతోపాటు జీరో ఫ్లింత్ ఏరియా, జీరో ఆస్తిపన్ను మదింపు చేసిన ఇళ్లను, ఎక్కువ నిర్మాణాన్ని తక్కువగా చూపి, వ్యాపార సంబంధమైన వాటిని నివాస భవనాలుగా చూపి తక్కు పన్నులు విధించిన ఇళ్లు, భవనాలను, వ్యాపార సంబంధమైన విద్యుత్తు మీటర్లు ఉన్న ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలించి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పన్ను పునర్మదింపు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ చట్టం 213 ప్రకారం ఇంటి యజమానికి నోటీసు జారీచేసి ఇంటి వినియోగం (నివాస, నివాసేతర), ఎన్ని అంతస్తులు నిర్మించారు, విద్యుత్తు, నల్లా బిల్లులు, నిర్మాణ అనుమతులు తదితర ధ్రువపత్రాలు పరిశీలించి, విధించిన పన్నుల్లో తేడాలుంటే పునర్మదింపు చేయాలి. కొందరు బిల్‌కలెక్టర్లు ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని వారితో ధ్రువపత్రాలు పరిశీలించకుండానే రూ.లక్షల్లో పన్ను వేసి బేరసారాలకు దిగుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

అవకతవకలకు తావు లేకుండా చర్యలు

క్షేత్రస్థాయి పరిశీలన చేసే ముందు సంబంధిత ఇంటి యజమానులకు విధిగా నోటీసులు జారీచేస్తున్నాం. వారి సమక్షంలోనే ఇళ్లు, భవనాల ఫ్లింత్ ఏరియా కొలతలు తీయిస్తున్నాం. నిర్మాణ అనుమతులు ఇతరత్రా ధ్రువపత్రాలు పరిశీలించి లోపాలు లేని పక్షంలో పాత పన్నులనే కొనసాగిస్తున్నాం. లోపాలున్న వాటికి ప్రస్తుత నిర్మాణ పరిస్థితులకు అనుగుణంగా ఆస్తిపన్నులు పునర్మదిస్తున్నాం. ఇందులో ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆధారాలతో ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– నర్సింహా, ఉప కమిషనర్ కుత్బుల్లాపూర్

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ -80085 73403,	పేట్‌బషీరాబాద్: 8008573405
దుండిగల్ - 80085 73410	నిజాంపేట: 8008573423,
షాపూర్‌నగర్: 8008573404,	జీడిమెట్ల: 8008574405

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

గాజులరామారం డివిజన్ బాలాజీ లేఅవుట్‌లో ప్రధాన రహదారి పక్కన ఖాళీ స్థలంలో పరిసర ప్రాంతాల వారు తమ ఇళ్లలో వెలువడే తడి పొడి చెత్తతో పాటు ఇతరత్రా వ్యర్థాలను పారబోస్తున్నారు. మూడు రోజులవుతున్నా వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తున్న విషయాన్ని అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా నివేదించారు. దీంతో గాజుల రామారావు సర్కిల్ సహాయ వైద్య అధికారి మమత ఆదేశాల మేరకు పారిశుద్ధ్య సిబ్బంది వ్యర్థాలను తొలగించటంతో సమస్య పరిష్కారమైంది. – న్యూస్‌టుడే, కుత్బుల్లాపూర్

మిత్రులే.. అంతలోనే శత్రువులై..

● హత్యకు దారితీసిన స్వల్ప వివాదం

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : వారిద్దరూ స్నేహితులు. చిన్నపాటి వివాదంతో ఘర్షణపడ్డారు. ఒకరిమీదకు మరొకరు దూసుకెళ్లారు. శత్రువుల్లా కొట్టుకునే క్రమంలో.. ఒకరు ప్రాణాలు కోల్పోయిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌కు చెందిన వెంకట నరసింహరాజు ఫార్మసీ మందుల దుకాణాలు నిర్వహిస్తుంటారు. ఈయనకు విజయవాడ, అయోధ్యనగర్‌లోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్ ఉంది. యనమలకుదురుకు చెందిన మహ్మద్ రఫీ (54), నరసింహరాజులు స్నేహితులు. వీరిద్దరూ సోమవారం అర్ధరాత్రి ఫ్లాట్‌కు వచ్చారు. కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య చిన్న విషయమై గొడవ జరిగింది. మాటామాటా పెరగడంతో.. రఫీ కత్తెర తీసుకుని పొడవబోయాడు. నరసింహరాజు తప్పించుకుని.. రఫీ మెడలో టవల్ వేసి నులమడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన అనంతరం నరసింహరాజు.. పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సమాచారం చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు తదితరులు వచ్చి విచారించారు. రఫీ తనను రూ.3 లక్షలు అప్పు అడిగాడని, ఈ విషయంలో డబ్బులు ఎందుకు పాడు చేస్తావంటూ మందలించానని నరసింహరాజు చెబుతున్నారు. రఫీ.. మద్యం మత్తులో కత్తెర తీసుకుని మీదకు వస్తే మెడకు టవల్ వేసి అడ్డుకున్నానని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అతడు మరణించి ఉంటాడని పోలీసులు తెలిపారు. దీనిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లింకు రోడ్ల ఏర్పాటుతోనే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం


అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే వివేకానంద్

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: లింకు రోడ్ల ఏర్పాటుతోనే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ తెలిపారు. ప్రయాణ దూరం కూడా తగ్గుతుందన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జీహెచ్ఎంసీ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లింక్ రోడ్ల అభివృద్ధిపై అధికారులు ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎవరికీ అసౌకర్యం తలెత్తకుండా పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. నేషనల్ హైవే నుంచి ఫాక్స్‌సాగర్ మీదుగా రాంరెడ్డినగర్ పారిశ్రామికవాడ వరకు, కైసర్‌నగర్ హనుమాన్ దేవాలయం నుంచి గాజులరామారం మిథిలానగర్ వరకు, ప్రగతినగర్ నుంచి ఎల్లమ్మబండ మీదుగా మహాదేవపూర్ వరకు, భూదేవిహిల్స్ లింకు రోడ్డు తదితర రోడ్ల పురోగతిపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, కుత్బుల్లాపూర్, గాజులరామారం ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు కాదు.. పరిశ్రమల స్థాపనకు కృషి చేయండి


పట్టాలు పొందిన విద్యార్థులు నవీన్ చరణ్, శైలేష్ సంపతి తదితరులు

కొంపల్లి (పేట్‌బషీరాబాద్): విద్యార్థులు ఉద్యోగాలు చేయటం కాకుండా పరిశ్రమల స్థాపన కోసం కృషి చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజరు కె.నవీన్ చరణ్ సూచించారు. కొంపల్లి పరిధిలోని శివశివానీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో మంగళవారం 29వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ ఇతరుల వద్ద ఉద్యోగం చేయటం వేరు, యువతకు ఉద్యోగాలు కల్పించటం వేరన్నారు. ఈ దిశగా యువత విద్యార్థి దశ నుంచే ఆలోచనలు మొదలుపెట్టాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిది లేదన్నారు. శివ శివానీ విద్యాసంస్థల ఛైర్మన్ హారతి సంపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ ఛైర్మన్ డాక్టర్ శైలేష్ సంపతి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి, డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ రమణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 130 మందికి పట్టాలు ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఏడుగురు విద్యార్థులకు బంగారు పతకం, నగదు బహుమతులు అందజేశారు.

అయ్యప్ప మాలధారుడి ఆకస్మిక మృతి

దుండిగల్, న్యూస్‌టుడే: అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్పమాల ధరించిన వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి పట్టణానికి చెందిన కె.బుచ్చిబాబు (47), జ్యోత్స్న దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు. అతడు నగరంలోని ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ బౌరంపేట ప్రణీత్ ప్రణవ్ బ్లూమ్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇటీవల అతడు అయ్యప్ప మాల ధరించాడు. ఈ క్రమంలోనే కుటుంబానికి దూరంగా మరో ముగ్గురు అయ్యప్ప మాలధారులతో కలిసి స్థానికంగా ఓ విల్లాలో అయ్యప్ప సన్నిధానాన్ని ఏర్పాటు చేసుకొని అక్కడే ఉంటున్నాడు. ఎప్పటిలాగే సోమవారం రాత్రి తోటి అయ్యప్ప మాలధారులతో కలిసి నిద్రించాడు. మంగళవారం వేకువ జామున అతడు విగతజీవిగా పడి ఉండటాన్ని తోటి మాలధారులు గుర్తించారు. ఈ సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అయ్యప్ప మాలధారుడు ఆకస్మికంగా మృతితో స్థానికంగా విషాదం నెలకొంది.

సేవా దృక్పథం పెంపొందిస్తే మేలు



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో సేవా భావం పెంపొందిస్తే భవిష్యత్తు తరాలకు మేలుచేసిన వాళ్లమవుతామని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ విభాగం ఛైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ పిలుపు మేరకు ఇటీవల వరద ముంపు ప్రాంతాల్లో సర్వం కోల్పోయిన కుటుంబాల పిల్లల కోసం సత్‌జ్ఞాన్ హైస్కూలు విద్యార్థులు తమ పాకెట్ మనీతో సమకూర్చిన నాలుగు వేల రాత పుస్తకాలను పాఠశాల ప్రిన్సిపల్ చింతల మల్లేశం మంగళవారం తనకు అందజేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహృదయంతో ముందుకు వచ్చిన తల్లిదండ్రులు, పిల్లలకు అభినందనలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు ఏవీ రావు, యూత్ ఛైర్మన్ మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు-వారణాసి విమాన సర్వీసుకు బాంబు బెదిరింపు

దారి మళ్లించి శంషాబాద్‌లో అత్యవసరంగా ల్యాండింగ్


విమానాశ్రయంలో నిర్జన ప్రదేశంలో పార్కింగ్ చేసిన విమానం

శంషాబాద్, న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి వారణాసికి బయల్దేరిన ఆకాశ ఎయిర్‌లైన్స్ విమాన సర్వీస్‌లో బాంబులు పెట్టాం.. గమ్యస్థానం చేరే లోపే పేల్చుతామని గుర్తు తెలియని వ్యక్తులు ఎయిర్‌పోర్ట్‌కు సందేశం పంపించడంతో భద్రతాధికారులు అప్రమత్తమయ్యారు. వారణాసి వెళ్లాల్సిన విమాన సర్వీస్‌ను దారి మళ్లించి శంషాబాద్‌లో అత్యవసరంగా దించారు. నిర్జన ప్రదేశంలో పార్కింగ్ చేసి విమానంలోని 185 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందిని కిందకు దించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం బాంబు స్క్వాడ్, జాగిలాలతో విమానంలో క్షుణ్ణంగా తనిఖీలు చేయగా పేలుడు పదార్థాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మరో 35 విమానాలకు బాంబు బెదిరింపు.. పోలీసులకు ఫిర్యాదు

శంషాబాద్ నుంచి దేశవిదేశాలకు రాకపోకలు సాగిస్తున్న ఆకాశ(11), ఇండిగో(13), విస్తారా(11) ఎయిర్‌లైన్స్ సంస్థలకు చెందిన 35 విమాన సర్వీసుల్లో ఉగ్రవాదులు బాంబులు పెట్టారంటూ మంగళవారం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఎయిర్‌పోర్ట్‌కు ఈ-మెయిల్ సందేశం పంపించారు. లుకాసన్ తులి 2271, తులిప్ 17849 ఈ-మెయిల్ ఐడీల నుంచి బాంబు బెదిరింపు సందేశాలు వచ్చినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై ఎయిర్‌పోర్ట్ అధికారులు ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఆత్మహత్య ఘటనలు పునరావృతం కానివ్వం


విద్యార్థినుల గదిని పరిశీలిస్తున్న నేరెళ్ల శారద

నిజాంపేట, న్యూస్‌టుడే: కళాశాలల వసతి గృహాల్లో విద్యార్థినులు ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్ నేరెళ్ల శారద పేర్కొన్నారు. బాచుపల్లి చౌరస్తాలోని నారాయణ కళాశాల వసతిగృహంలో ఈ నెల 20న ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు శారద మంగళవారం సదరు కళాశాలకు వచ్చి ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల నిర్వాహకులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించక పోవడంతోనే సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కళాశాలల్లోని సమస్యలపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించానని చెప్పారు. ప్రతీ విద్యార్థినికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం తరపున కృషి చేస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. విద్యార్థిని ఉరేసుకున్న గదికి వెళ్లి అక్కడి పరిస్థితులపై తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన.. నిందితుడి అరెస్టు

దుండిగల్, న్యూస్‌టుడే: అభం శుభం ఎరుగని అయిదేళ్ల వయసు బాలికను తీవ్రంగా గాయపరిచి ఆపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బౌరంపేటకు చెందిన దంపతులకు ఇద్దరు సంతానం. వీరి రెండో కుమార్తెకు అయిదేళ్లు. ఈ నెల 18న సదరు బాలికకు ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలిక ఒంటిపై గాయాలు ఉండటాన్ని వైద్యులు గుర్తించారు. అనంతరం అదే రోజు వైద్యులు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. బాలిక తండ్రికి స్నేహితుడు, వారు నివసించే అపార్ట్‌మెంట్‌లోనే ఉండే వ్యక్తి ఈనెల 12న.. బాలికను కొట్టి గాయపరచడమే కాకుండా అసభ్యంగా ప్రవర్తించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలోనే వైద్య పరీక్షల నిమిత్తం బాలికను ఆసుపత్రికి పోలీసులు తరలించారు. బాలికపై ఎలాంటి అత్యాచారం జరగలేదని వైద్యులు ధ్రువీకరించారు. ఈ క్రమంలోనే ఈ నెల 19న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అదే రోజు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

భారాస తెలంగాణ ప్రజల గొంతుక


సమావేశంలో పాల్గొన్న భారాస నాయకులు

దుండిగల్, న్యూస్‌టుడే: భారాస తెలంగాణ ప్రజల గొంతుకని, తెలంగాణ కోసమే ఆవిర్భవించిందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు శంభీపూర్ కృష్ణ అన్నారు. డి.పోచంపల్లిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్వీ నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా, ఎంపీలుగా, కార్పొరేషన్ ఛైర్మన్‌లుగా చేసిన ఘనత భారాసకే దక్కుతుందన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే నాయకులకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలన్నారు. బీఆర్ఎస్వీ నియోజకవర్గ ప్రెసిడెంట్ అఖిల్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ నాయక్, సందీప్, దినేష్, కిరణ్, రతన్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి


రక్తదానం చేస్తున్న సీపీ అవినాశ్ మహంతి, జాయింట్ సీపీ జోయల్ డేవిస్

రాయదుర్గం, న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణదానంతో సమానమని, దానం చేసే వీలున్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి పిలుపునిచ్చారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారం సందర్భంగా కమిషనరేట్ పరేడ్ మైదానంలో సైబరాబాద్ పోలీసులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జాయింట్ సీపీ డి.జోయల్ డేవిస్‌తో కలిసి సీపీ అవినాశ్ మహంతి రక్తదానం చేశారు. సీపీ మాట్లాడుతూ.. థలసేమియా, బ్లడ్ క్యాన్సర్ బాధితులు, ఇటు గర్భిణులు, ప్రమాదాల క్షతగాత్రుల ప్రాణాలను రక్షించడంలో రక్తం ఎంతో అవసరం ఉంటుందని, ఈ క్రమంలో రక్తదానంతో కొరత తీర్చే అవకాశం ఉంటుందని చెప్పారు. కమిషనరేట్‌లోని సిబ్బందితోపాటు పలువురు పోలీసు అధికారులూ, సిబ్బంది రక్తదానం చేయగా మొత్తం 464 యూనిట్లు సేకరించారు. దాతలకు ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, ఏసీపీ అరుణ్, డా.సుకుమార్, వివిధ ఠాణాల ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్ఐలు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


చెరుకుపల్లి కాలనీలో భూమి పూజ చేస్తున్న టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ మహమ్మద్ జాకీర్

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: కుత్బుల్లాపూర్ డివిజన్ కుత్బుల్లాపూర్‌లోని చెరుకుపల్లి కాలనీలో ప్రతిపాదించిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం రాష్ట్ర పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ మహమ్మద్ జాకీర్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి చొరవతో తమ కాలనీలో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని అన్నారు. చెరుకుపల్లి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాములు, ప్రధాన కార్యదర్శి సూర్య బాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్లేష్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

నిండా గోతులు.. నరకానికి దారులు


వీనస్ ఎన్‌క్లేవ్ కాలనీలో రోడ్డు దుస్థితి

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం డివిజన్ పరిధిలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిని రాకపోకలు సాగించడం కష్టసాధ్యంగా మారింది. రోడ్లపై వరదనీరు నిలిచిపోవడంతో ఎక్కడికక్కడ పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్లపై ప్రయాణంతో నడుములు విరిగిపోయేలా పరిస్థితి ఉంది. దేవేందర్‌నగర్‌లో మండల రెవెన్యూ కార్యాలయం, గాలిపోచమ్మబస్తీ, రావినారాయణరెడ్డినగర్, వీనస్ ఎన్‌క్లేవ్ కాలనీ, సుభాష్‌చంద్రబోస్‌నగర్‌ల్లో రోడ్లు నరకానికి నకళ్లుగా తయారయ్యాయి. రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతో పాటు పైనుంచి వచ్చే వరద నీరు రోడ్ల పైనుంచి పారుతుండటంతో రోడ్లు కనీసం నడవటానికి కూడా వీలు లేకుండా పోతోంది. వీనస్ ఎన్‌క్లేవ్ కాలనీలో ఏడాది క్రితం వరదనీటి కాలువ నిర్మించారు. పనులు పూర్తయినా రోడ్లకు మరమ్మతులు చేయడం లేదు. సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లోనూ ఏడాది క్రితం భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. ఇంతవరకు రోడ్ల నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు కనీస ప్రతిపాదనలు రూపొందించడం లేదు. దేవేందర్‌నగర్‌లో రోడ్డుపై పెద్దపెద్ద గోతులు పడ్డాయి. రావినారాయణరెడ్డినగర్, గాలిపోచమ్మ బస్తీల్లో పైనుంచి వచ్చే వరదనీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు సాగించడం నరకప్రాయమవుతోంది. ఆయా ప్రాంతాల్లో కనీసం కంకరపొడి నింపి రోడ్లను రాకపోకలకు అనువుగా చేయాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రతి డివిజన్‌లో తక్షణ మరమ్మతుల కోసం ఏర్పాటు చేసిన బృందాలు సైతం ఈ రోడ్లవైపు కన్నెత్తి చూడటం లేదు. వెంటనే ఆయా ప్రాంతాల్లోని రోడ్లకు కనీస మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


దేవేందర్‌నగర్‌లోని మండల రెవెన్యూ కార్యాలయం ముందు..


రావినారాయణరెడ్డినగర్‌లో రోడ్డులో ఇలా..

'రాజ్యాంగ సవరణ చేయకుండా ఒకే ఎన్నికలా?'



మాట్లాడుతున్న బీవీ రాఘవులు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ఒకే దేశం- ఒకే ఎన్నికల విధానం రాజ్యాంగ సవరణ చేయకుండా ఎలా అమలు చేస్తారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కేంద్రంలోని భాజపా సర్కారును ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఒకే దేశం- ఒకే ఎన్నిక ప్రధాని మోదీ ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించాలని కోరుతూ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో ప్రధాని మోదీ అధికారం చేపట్టేందుకు ఒకే ఎన్నిక విధానం తెరపైకి తెచ్చారన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం అమలు చేయాలంటే పార్లమెంటులో మూడో వంతు సభ్యుల ఆమోదం ఉండాలన్నారు. అలా లేకపోవడంతోనే నాలుగు వందల మెజార్టీ సాధించాలని ఎంపీ ఎన్నికల్లో భాజపా ప్రచారం చేసుకుందన్నారు. దీన్ని ప్రజలు వ్యతిరేకించి సీట్లను తగ్గించారన్నారు. సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా..సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్

•సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్



ప్రొ.బాలకిష్టారెడ్డిని సన్మానించిన వీసీ ప్రొ.కుమార్

ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌ను కలిసిన వీసీ

లాలాపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రొ.ఇటిక్యాల పురుషోత్తంలను ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కుమార్ మంగళవారం వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భవిష్యత్తు విద్యావిధానంపై వారితో చర్చించారు. రాష్ట్రంలో ఉన్నత విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఆధునిక సాంకేతిక రంగాల్లో నైపుణ్యాన్ని అందించటం ద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగుపరచవచ్చని అభిప్రాయపడ్డారు.

తాగునీటి సరఫరాలో సమయపాలన పాటించాలి



జలమండలి జీఎంకు వినతిపత్రం ఇస్తున్న హంసరాజు తదితరులు

అడ్డగుట్ట, మారేడుపల్లి, న్యూస్‌టుడే: అడ్డగుట్ట ఏబీసీడీ సెక్షన్, తుకారం గేట్ తదితర ప్రాంతాల్లో పూర్వపు సమయంలోనే మంచినీటి సరఫరా చేయాలని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి హంసరాజు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మారేడుపల్లిలో జలమండలి జీఎం వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం మంచినీటి సరఫరాలో సమయపాలన మార్చినందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలియజేశారు. ● మంచినీటి సరఫరాలో సమయపాలన మార్చినందుకు అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆర్డీ నగేశ్, బాబురావు తదితరులు జీఎం వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (మంగళవారం నాటివి..కిలో రూ.లో) టమాటా 43, వంగ 35, బెండ 55, పచ్చిమిర్చి 40, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 26, క్యారెట్ 45, దొండ 40, ఆలు 37, ఉల్లి 39, సొర 17, పొట్ల 18, బీన్స్ 125, గోరుచిక్కుడు 45, చిక్కుడు 65, దోస 35, బీర 55, కాకర 38, చామగడ్డ 43, కీర 45, క్యాప్సికం 75, బీట్‌రూట్ 28, కందగడ్డ 65, చిలకడదుంప 28, మామిడి 65, మునగ 75, ముల్లంగి 6(ఒకటి).

అమీర్‌పేట, న్యూస్‌టుడే: టమాటా 43, నల్ల వంకాయ 40, పొడుగు వంకాయ 35, బెండ 50, పచ్చిమిర్చి 45, బజ్జి మిర్చి 65, క్యాప్సికం 75, పచ్చకాకర 38, పందిరిబీర 50, క్యాబేజీ 25, క్యారెట్ 40, దొండ 35, గుండుబీన్స్ 125, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 21, దోస 35, బీట్‌రూట్ 31, ఉల్లి 45, ఆలు 37, చామ 45, మొరంగడ్డ 28, కంద 60, గోబీ 18, సొర 17, పొట్లకాయ 18, అరటి 9, మునగ 4, మామిడి 45, ముల్లంగి 6, ఉల్లిపొరక 45, వేరుశనగ 50, నిమ్మకాయలు(డజన్) 45, అల్లం(కోహిర్) 160, అల్లం(తెల్లది) 160, వెల్లుల్లి 320.

కాలిబాట వ్యాపారాల అడ్డా

అర్హులకు దక్కని మెట్టుగూడ మార్కెట్ స్టాళ్లు

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: మెట్టుగూడలో జీహెచ్‌ఎంసీ నిర్మించిన మార్కెట్ స్టాళ్లు అనర్హుల పాలయ్యాయి. అలుగడ్డబావి నుండి తార్నాక వరకు కొనసాగుతున్న వీధి వ్యాపారాలను నియంత్రించడం కోసం మార్కెట్‌ను నిర్మించారు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో గుర్తింపు పొందిన స్ట్రీట్ వెండర్స్‌కు ఉపాధిని కల్పించడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలకు మార్గం సుగమం చేయాలనే ఉద్దేశంతోనే రెండేళ్ల క్రితం ఈ మార్కెట్‌లో 50 స్టాళ్లు నిర్మించారు. అయితే వాటిని అర్హులకు కేటాయించే ప్రక్రియ జరుగుతుంది. రాజకీయ నేపథ్యం కలిగిన పలువురు స్టాళ్లను స్వాధీనం చేసుకుని ఇతరులకు అద్దెలకు ఇచ్చారు. ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు స్టాళ్లను ఇతరులకు అనధికారికంగా విక్రయించి సొమ్ము చేసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి.

తీరని ట్రాఫిక్ చిక్కులు..

కొత్తగా నిర్మించిన స్టాళ్లకు వ్యాపారాలు బదలాయిస్తే ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేదని జీహెచ్‌ఎంసీ అధికారులు భావించారు. మరిన్ని ఫుట్‌పాత్ వ్యాపారాలు పెరగడంతో ట్రాఫిక్ చిక్కులు మరింత ఎక్కువయ్యాయి. ఈ మార్కెట్ స్టాళ్లలో కొనసాగుతున్న వ్యాపారాల నిర్వహణపై విచారణ జరిపించాలని స్ట్రీట్ వెండర్స్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన స్ట్రీట్ వెండర్స్ కోసం నిర్మించిన మార్కెట్ స్టాళ్ల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు. అవకతవకలకు సంబంధించి విచారణ జరుపుతామని జీహెచ్‌ఎంసీ అధికారులు వెల్లడించారు.



జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం..

ఇదే రహదారిపై ఏళ్ల తరబడి సుమారు 50 మంది చిరు వ్యాపారులు కూరగాయలు, పూలు పండ్లు తదితర వ్యాపారాలు చేసుకుంటున్నారు. మొత్తంగా నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. ఇదిలా ఉండగా యాభై స్టాళ్లకు 30 మంది మొత్తంగా ఆక్రమించారు. మరో 20 మందికి వ్యాపారాలు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఇతరులకు అవకాశం ఇవ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. ఇందులో ఎక్కువ మంది ఆక్రమణదారులు స్టాళ్లను అద్దెలకు ఇచ్చి రోజుకు వెయ్యి నుంచి పదిహేనువందల వరకు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

మేమున్నాం..మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

సికింద్రాబాద్	:	8008573368
కంటోన్మెంట్	:	8008573361
సనత్‌నగర్	:	8008573356

అమీర్‌పేట, సంజీవరెడ్డినగర్, అడ్డగుట్ట, మారేడుపల్లి, న్యూస్‌టుడే:

? ఎస్సార్‌నగర్ సమీపంలోని బీకేగూడ సీటైప్ క్వార్టర్లలో పగిలిపోయిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయలేదు. బారికేడ్‌ను –కె.రవీందర్, బీకేగూడ

✓ తక్షణం ఈ సమస్యను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాను. –సందీప్, ఏఈ, జీహెచ్‌ఎంసీ

? ఇంటి గేటు ముందే చెత్తను తీసకువచ్చి పడేస్తున్నారు. రోజూ ఈ దుర్వాసతో ఇబ్బందులు పడుతున్నాం. – మంజుల, ఎస్సార్‌నగర్

✓ చెత్త వేయరాదని అక్కడ బ్యానర్ ఏర్పాటు చేస్తాం. జరిమానా విధిస్తాం. – చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంహెచ్‌ఓ

? తుకారం గేట్ లాలాగూడ రైల్వే ట్రాక్ సమీప రోడ్డు గుంతలమయంగా మారింది. – సత్యం తుకారంగేట్

✓ సమస్య మా దృష్టికి వచ్చింది. వెంటనే మరమ్మతులు చేస్తాం. – వేణు, జీహెచ్‌ఎంసీ ఏఈ

? ఈస్ట్ మారేడుపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీప ప్రధాన రహదారి పక్కన చెట్ల కొమ్మలు పేరుకుపోయాయి. – ప్రతాప్.మారేడుపల్లి

✓ సిబ్బందితో మాట్లాడి కొమ్మలను తరలిస్తాం. – శ్రీధర్, మారేడుపల్లి విద్యుత్ శాఖ ఏఈ

వీధిదీపాలకు మరమ్మతులు

మారేడుపల్లి, న్యూస్‌టుడే: ఈస్ట్ మారేడుపల్లి పెట్రోల్ బంక్ సమీప ప్రధాన రహదారిలో వీధిదీపాలు వెలగడంలేదని స్థానికులు 'ఈనాడు' దృష్టికి తీసుకెళ్లగా 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమైంది. స్పందించిన అధికారులు వీధి దీపాలకు మరమ్మతులు చేసి వెలిగించారు.

స్పందనకు వందనం

మ్యాన్‌హోళ్లకు...

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్ మెయిన్ రోడ్డు, కూరగాయల మార్కెట్, ఎస్సార్టీ కాలనీలలో మ్యాన్‌హోల్ మూతల కుంగిపోవడంతో 'మూతలు వెతలు' శీర్షికన 19న ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన జలమండలి అధికారులు మూతలకు మరమ్మత్తులు చేశారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బాబు

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు కొమురవెల్లి బాబు కోరారు. వివిధ కారణాలతో మృతి చెందిన ఆటో డ్రైవర్ల సంతాప సభను మైలార్ గడ్డ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో దూద్ బావి కమ్యూనిటీహాల్‌లో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . పదేళ్లుగా ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎన్ని విధాలుగా డిమాండ్ చేసిన గత, ప్రస్తుత ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదని ఆరోపించారు. పెద్దదిక్కు కోల్పోవడం వల్ల ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు జోగు రాములు, రమేశ్, చందర్, నరేశ్, పెద్ద కుమార్, గడ్డం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తైక్వాండో పోటీలు



క్రీడాకారులతో ప్రిన్సిపల్ డా.రాజశ్రీ, జయసుధ తదితరులు

మారేడుపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వెస్ట్ మారేడుపల్లి కస్తూర్బాగాంధీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల కమిటీ ఛైర్మన్ నారొత్తం రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశ్రీ పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కళాశాలల తైక్వాండో టోర్నమెంట్ క్రీడలు కస్తూర్బాగాంధీ మహిళా డిగ్రీ పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జయసుధ పర్యవేక్షణలో మంగళవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని 16 మహిళా కళాశాలల విద్యార్థినులు ఈ పోటీలో పాల్గొని సత్తా చాటారు. కళాశాల సెక్రటరీ ఫహీముద్దీన్, ట్రెజరర్ సురేశ్ కుమార్, టోర్నమెంట్ సెక్రటరీ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు మరిచి.. కర్రను పెట్టి



సత్యం థియేటర్ నుంచి అమీర్‌పేట గురుద్వారా వెళ్లే మార్గంలో మూత ధ్వంసమైన మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. మ్యాన్‌హోల్ మూత పగిలిపోవడంతో స్థానికులు గుర్తుగా ఓ కర్రను ఏర్పాటు చేశారు. రాకపోకల రద్దీ ఎక్కువగా ఉండే ఈ మార్గంలో పాదచారులు, వాహనదారులు ఏమాత్రం చూసుకోకుండా వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

– న్యూస్‌టుడే, అమీర్‌పేట

సర్వసభ్య సమావేశం 26న

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: ఎస్సార్‌నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం ఈనెల 26న బీకే గూడలోని కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కౌన్సిల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావుపాటిల్, యాదగిరి తెలిపారు. మంగళవారం కౌన్సిల్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఆర్థిక లావాదేవీల వివరాలు సమావేశంలో వివరిస్తామన్నారు. అలాగే ఆడిట్ చేసిన అకౌంట్స్‌కు సంబంధించిన పూర్తి స్టేట్‌మెంట్ కోశాధికారి సభ ముందు ఉంచుతారని చెప్పారు. కౌన్సిల్ కార్యవర్గం ప్రతినిధులను, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను ఎన్నుకుంటారని పేర్కొన్నారు. సభ్యత్వం ఉన్న వృద్ధులందరు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

మూడురోజులు శాంతి పూజలు నిర్వహించాలి: తలసాని



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



నిర్వాహకులు, బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే తలసాని పలువురు పండితులతో కలిసి సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయానికి వెళ్లారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం, మూడురోజుల పాటు శాంతి పూజలు, హోమాలను ఏ విధంగా నిర్వహించాలనే సమావేశం నిర్వహించారు. ఆలయంలో పూజలు చేసి కమిటీ సభ్యులు, బస్తీవాసులతో మాట్లాడారు. నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్‌తో భద్రత ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి: రాజాసింగ్

హిందువుల మనోభావాలు దెబ్బతీసేవారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తే బాగుంటుందని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఇతర పార్టీల నేతలను ఆలయంలోకి అనుమతిస్తూ తనను గృహనిర్బంధం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటీవల హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం బాధ్యతగా వ్యవహించాలని సూచించారు.

ఆలయంలో పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది: దేవాదాయశాఖ అదనపు కమిషనర్ జ్యోతి

పంచలోహ విగ్రహంతోపాటు ధ్వంసమైన ద్వారాలను మరమ్మతులు చేయించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు మొదలుపెట్టినట్లు దేవాదాయశాఖ అదనపు కమిషనర్ జ్యోతి చెప్పారు. త్వరలో ఆలయానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అధికారులు పాల్గొన్నారు.

దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది: డీసీపీ

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లో ప్రార్థన మందిరం విధ్వంస ఘటనలో ప్రధాన నిందితుడు ఇంకా ఆసుపత్రిలోనే ఉన్నాడని, త్వరలో అరెస్ట్ చేసి రిమాండుకు తరలిస్తామని ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ తెలిపారు. మంగళవారం ప్రార్థన మందిరం వద్ద భద్రత ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ కేసులో పరారీలో ఉన్నవారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు. ఇటీవల ఆలయం వద్ద పోలీసులపై రాళ్లు, చెప్పులతో దాడికి పాల్పడిన కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టండి



జీవో పత్రాలు చూపుతున్న ప్రతినిధులు

పద్మారావునగర్, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను అరికట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆశ్రిత సంస్థ ఫౌండర్ ఎస్ నాగరాజు కోరారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలసి ఆయన మంగళవారం బోయిగూడలో సమావేశంలో నిర్వహించారు. స్థానిక స్వచ్ఛంద సంస్థల ఇందులో భాగస్వామ్యం చేసి వందశాతం అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాల్య వివాహాల నిషేధ చట్టంపై జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. తమ ఆశ్రిత సంస్థ ఆధ్వర్యంలో గత మూడు నెలల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 43 బాల్య వివాహాలను అడ్డుకొని, సంబంధిత ఛైల్డ్ వెల్ఫేర్ అధికారులు, పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. సమావేశంలో జననీ ఫౌండేషన్ ఛైర్మన్ రాచకొండ మల్లేశ్, పీపుల్ హెల్పింగ్ చిల్డ్రన్స్ సంస్థ డైరెక్టర్ బి.సంతోష్, రంగస్థల నటుడు కబీర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. పరుగు



కంటోన్మెంట్‌లోని తిరుమలగిరి చౌరస్తా నుంచి గన్‌రాక్ విద్యుత్తు సబ్‌స్టేషన్ చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ నుంచి మురుగు రోడ్డుపై పారుతోంది. నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

మహనీయుల పోరాట స్ఫూర్తిపై అధ్యయనం అవసరం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ ప్రొ.కుమార్

లాలాపేట, న్యూస్‌టుడే: మహనీయుల పోరాట స్ఫూర్తిపై పరిశోధనలు, అధ్యయనం జరగాలని ఉస్మానియా ఉపకులపతి ప్రొ.కుమార్ అన్నారు. మంగళవారం ఓయూలోని పూలే-అంబేద్కర్ భవనంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సెల్ డైరెక్టర్ ప్రొ.మంగు ఆధ్వర్యంలో కుమురం భీమ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై కుమురం భీమ్, అంబేద్కర్, పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాబోయే కుమురం భీమ్ జయంతి నాటికి పూలే- అంబేద్కర్ భవనం వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఓఎస్డీ రెడ్యా నాయక్, యూజీసీ డీన్ ప్రొ.మల్లేశం, బీసీ సెల్ డైరెక్టర్ చల్లమల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వీసీని కలిసిన విద్యార్థి సంఘాల నాయకులు

లాలాపేట, న్యూస్‌టుడే: ఓయూ వీసీ ప్రొ.కుమార్‌ను మంగళవారం పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడాలి : ఎమ్మెల్యే కూనంనేని

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో మతసామరస్యాన్ని కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. 'ఇటీవల సికింద్రాబాద్‌లోని ప్రార్థన మందిరంలో జరిగిన ఘటనపై ఉద్రిక్తతలు ఇంకా కొనసాగడం దురదృష్టకరం. ఘటనకు కారకుల్ని కఠినంగా శిక్షించాలి. అన్ని మతాల వారితో శాంతి కమిటీలు వేసి ప్రజల్లో సామరస్యం పెంచేలా చర్యలు తీసుకోవాల'ని రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

ఉద్యోగాల పేరిట రూ.1.17కోట్లు స్వాహా!

ఈనాడు, హైదరాబాద్ : ప్రముఖ కంపెనీలో ఉద్యోగాలిప్పిస్తామంటూ సికింద్రాబాద్‌కు చెందిన ముఠా నిరుద్యోగుల నుంచి రూ.1.17కోట్లు కాజేసినట్టు నగర సీసీఎస్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఏపీలోని నంద్యాల జిల్లాకు చెందిన ప్రైవేటు ఉద్యోగి(29) లోకల్ యాప్‌లో సికింద్రాబాద్‌లోని ఆర్కే గ్రూప్‌లో ఉద్యోగావకాశాలున్నట్టు ప్రకటన చూశాడు. అక్కడ లభించిన సమాచారం ఆధారంగా ఎం.సురేష్ అనే వ్యక్తిని సంప్రదించాడు. సురేష్ తాను ఆర్కే గ్రూప్ యజమానినంటూ అతనిని నమ్మించాడు. కేంద్రప్రభుత్వ నుంచి కాంట్రాక్టు పనులు చేస్తున్నామని ధ్రువపత్రాలు చూపాడు. సెంట్రల్ వేర్‌హౌస్ కార్పొరేషన్ నుంచి 12 ఏళ్లకు కాంట్రాక్ట్ లభించిందని, అక్కడ పనిచేసేందుకు ఉద్యోగులు కావాలంటూ చెప్పాడు. సెక్యూరిటీ డిపాజిట్‌లో భాగంగా బాధితుడి నుంచి రూ.లక్ష తీసుకున్నాడు. ఈ ఏడాది జులైలో ఐడీకార్డు, ఆఫర్ లెటర్ ఇచ్చారు. ఉద్యోగి చేరాక మొదటి నెల వేతనం రూ.65,800 చెల్లించారు. మరికొందరికి ఉద్యోగావకాశాలున్నాయని సురేష్ చెప్పటంతో బాధితుడి బంధువులు, స్నేహితులు 12 మందితో డబ్బులు కట్టించాడు. ఉద్యోగంలో చేరే ముందు నెలరోజులు శిక్షణకు తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవటంతో మోసపోయినట్టు గ్రహించిన బాధితుడు నగర సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తెలుగు రాష్ట్రాల్లో పలువురు నిరుద్యోగులు రూ.1,17,75,000 మోసపోయినట్టు పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఐహెచ్‌ఆర్‌వో దక్షిణ భారత అధ్యక్షుడిగా నియామకం



కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: పాత నగరానికి చెందిన ఎస్‌కేపీహెచ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సయ్యద్ కాజిమ్ అలీ హాష్మీని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్(ఐహెచ్‌ఆర్‌వో) దక్షిణ భారత అధ్యక్షుడిగా నియమించారు. సంస్థ వైస్ ఛైర్‌పర్సన్ కెప్టెన్ రామ ఆర్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనను దక్షిణ భారత (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు) అధ్యక్షుడిగా నియమించడంపై సయ్యద్ కాజిమ్ అలీ హాష్మీ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం. .. మంగళవారం మధ్యాహ్నం కవాచ్ ట్రైన్ జేమ్స్‌స్ట్రీట్- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ల మధ్యకు చేరుకున్న సమయంలో ఓ వ్యక్తి(35) వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని రైలు లోకోపైలెట్ జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించగా ఎలాంటి చిరునామా లభ్యం కాకపోవడంతో గాంధీమార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళ మృతదేహం లభ్యం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రైల్వేస్టేషన్ అవుట్‌గేట్ సమీపంలో ఓ మహిళ మృతిచెంది ఉన్నట్లుగా స్థానికులు గుర్తించి పోలీసులకు తెలియజేశారు. ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మహిళ మృతిచెందినట్లుగా గుర్తించారు. ఎలాంటి చిరునామా లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని గాంధీమార్చురీకి తరలించారు.

సజావుగా రెండోరోజు గ్రూప్-I పరీక్ష



అభ్యర్థి హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

బేగంపేట, రసూల్‌పురా, న్యూస్‌టుడే: బేగంపేటలో మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 933 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 681 మంది మాత్రమే హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డా.పద్మావతి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రామయ్య పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నార్త్ జోన్ ఏసీపీ శంకర్‌రాజు, ఇతర అధికారులు, సిబ్బంది అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలించి లోపలికి అనుమతించారు. ● సికింద్రాబాద్ పీజీ కళాశాలలో గ్రూప్- 1 పరీక్ష రెండోరోజు సజావుగా జరిగింది. మొత్తం 576 మంది అభ్యర్థులకు 491 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ జె. రవికుమార్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని నార్త్‌జోన్ డీసీపీ రేష్మి పెరుమాల్ సందర్శించారు.

రేణుకాఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయానికి సాకతో వెళ్తున్న బస్తీవాసులు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయం శాంతిపూజల్లో భాగంగా సికింద్రాబాద్ క్లాక్‌టవర్ ప్రాంతంలోని రేణకాఎల్లమ్మ ఆలయంలో సాకను సమర్పించారు. ప్రతి రోజు ఒక్కొక్క ఆలయానికి వెళ్లి ఆయా ఆలయంలో సాకను సమర్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఛాయా చిత్రగ్రాహకులు చరిత్రకు సాక్ష్యం



బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ఛాయాచిత్ర గ్రాహకులు చరిత్రకు సాక్షులని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుందరయ్య కళానిలయంలో తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ. . ఫొటో, వీడియో గ్రాఫర్లు రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించారన్నారు. రాష్ట్ర సాధనకు తన సొంత పార్టీతో కొట్లాడినట్లు చెప్పారు. సాగరహారంలో దెబ్బలు తిన్నానని గుర్తు చేశారు. ఫొటో, వీడియో గ్రాఫర్లు బలవన్మరణాలకు పాల్పడొద్దన్నారు. వారికి గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. వారికి సంఘం భవన నిర్మాణం, ఇతర సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. తన కుమారుడు ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఫొటో, వీడియో గ్రాఫర్ల పిల్లల విద్యాభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. ఎంబీబీఎస్, ఐఐటీలో సీట్లు సాధించిన వారికి తాను ఫీజులు చెల్లిస్తానని చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఫొటో, వీడియో గ్రాఫర్ల సేవలు ఎనలేనివని కొనియాడారు. సమావేశంలో తాడి మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర బాధ్యుడు కాచం సత్యనారాయణగుప్తా, సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు ఎస్‌కే హుస్సేన్, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి మాధవరెడ్డి నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

బేగంపేట, న్యూస్‌టుడే: బేగంపేటలో మంగళవారం ఆక్రమణలను తొలగించారు. నార్త్‌జోన్ ఏసీపీ జి. శంకర్‌రాజు, ట్రాఫిక్ ఏసీపీ జె. భాస్కర్, జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ సమ్మయ్య, టౌన్‌ప్లానింగ్ అధికారి సుస్మిత తదితరుల పర్యవేక్షణలో రోడ్డు, పాదబాటలపై ఏర్పాటు చేసిన డబ్బాలు, చిరు వ్యాపారాలను తొలగించారు. స్థానిక ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ నుంచి కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రి, బేగంపేట ప్రాంతంలో ఉన్న వాటిని తీసేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు చిరు వ్యాపారులతో మాట్లాడి వారికి అవగాహన కలిగించారు. రహదారిపై ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని వివరించారు.

చెత్త తరలించే రిక్షాల పంపిణీ



బౌద్ధనగర్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. బౌద్ధనగర్ డివిజన్‌లో మంగళవారం ఆమె చెత్తను తరలించే రిక్షాలను పంపిణీ చేశారు. పరిశుభ్ర హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం కావాలంటే పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం అని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.



వెలగని సిగ్నళ్లు.. తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు

సికింద్రాబాద్‌లోని ఒలిఫెంటా బ్రిడ్జి కూడలిలో ఉన్న ట్రాఫిక్ సిగ్నళ్లు కొన్ని రోజులుగా వెలగకపోవడంతో ఐదు దారులున్న ఆ కూడలిలో ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రంగా ఎదురవుతున్నాయి. – న్యూస్‌టుడే, సికింద్రాబాద్

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్: (మంగళవారం నాటివి..కిలో రూ.లో) టమాటా 43, వంగ 35, బెండ 55, పచ్చిమిర్చి 40, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 26, క్యారెట్ 45, దొండ 40, ఆలు 37, ఉల్లి 39, సొర 17, పొట్ల 18, బీన్స్ 125, గోరుచిక్కుడు 45, చిక్కుడు 65, దోస 35, బీర 55, కాకర 38, చామగడ్డ 43, కీర 45, క్యాప్సికం 75, బీట్‌రూట్ 28, కందగడ్డ 65, చిలకడదుంప 28, మామిడి 65, మునగ 75, ముల్లంగి 6(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: టమాటా కిలో రూ.43, వంగ 40, బెండ 55, పచ్చిమిర్చి 40, కాకర 38, బీర 55, క్యాబేజీ 26, బీన్స్ 125, క్యారెట్ 45, దొండ 40, చిక్కుడు 65, క్యాప్సికం 80, ఆలు 37, కీర 25, దోస 35, చామగడ్డ 43, అరటి 9, బీట్‌రూట్ 28, సొర 17, గోకర 45, చిలకడదుంప 30, మామిడి 66, మునగ 75.

గ్రూప్-1 పరీక్షకు 528మంది గైర్హాజరు


ప్రోబెల్ పాఠశాల కేంద్రం వద్ద..

గౌతంనగర్, న్యూస్‌టుడే: మల్కాజిగిరి పరిధిలోని ప్రోబెల్ పాఠశాలలోని రెండు కేంద్రాల వద్ద మంగళవారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మల్కాజిగిరి సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాలకు సంబంధించి 1,394 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 866 మంది హాజరయ్యారు. 528 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు.

అంతర్జాతీయ నృత్యోత్సవానికి డాక్టర్ ఎస్పీ భారతి


ఎంపీ, నటి హేమమాలినితో భారతి

గౌతంనగర్, న్యూస్‌టుడే: దిల్లీలో ఈనెల 21న సాయంత్రం నిర్వహించిన అంతర్జాతీయ నృత్యోత్సవానికి గౌతంనగర్ డివిజన్ జ్యోతినగర్‌కు చెందిన కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు, కూచిపూడి నృత్య గురువు డాక్టర్ ఎస్పీభారతి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ, నటి హేమమాలిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆమె తెలిపారు.

30శాతం కుటుంబాల సమాచారమే లభ్యం

మల్కాజిగిరిలో డిజిటల్ కుటుంబ కార్డు సర్వే

గౌతంనగర్, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పైలట్ సర్వేలో భాగంగా మల్కాజిగిరి సర్కిల్ పరిధి మౌలాలీ డివిజన్ పరిధిలోని గాయిత్రీనగర్‌లో చేపట్టిన ఇంటింట సర్వే వివరాలను జీహెచ్ఎంసీ అధికారులు సంబంధిత యాప్‌లో నమోదు చేశారు. సర్వేలో కాలనీలోని మూడింట రెండొంతుల కుటుంబాల వివరాల లభ్యం కాలేదు. ప్రస్తుతం చౌక ధరల దుకాణాలు, జీహెచ్ఎంసీ ప్రోపర్టీ ట్యాక్స్ వివరాల ఆధారంగా కుటుంబ సర్వే నిర్వహించారు.

గాయిత్రీనగర్‌లో పైలట్ సర్వే వివరాలు

- మొత్తం కుటుంబాలు – 1,368
- సర్వేలో వివరాలు వెల్లడించిన కుటుంబాలు – 400
- ఫోన్ నంబరు అందుబాటులో లేనివి – 625
- ఫోన్ నంబరు ఉండి పనిచేయనవి – 265
- గతంలో ఉండి ఇప్పుడు వేరేచోట ఉన్నామని చెప్పింది – 78


గాయిత్రీనగర్‌లో సమాచార సేకరణలో అధికారులు

మొత్తం 1,368 కుటుంబాలు

సర్కిల్ పరిధిలోని రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు కలిసి 10 బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహించారు. అక్టోబరు 1 నుంచి 5 వరకు సర్వే నిర్వహించారు. జాబితాలో కుటుంబ యజమాని పేరు, చరవాణి నంబరు, మౌలాలి డివిజన్ అని మాత్రమే ఉండటంతో చాలా కుటుంబాల వివరాల నమోదు చేయలేకపోయారు. కొన్ని కుటుంబాలకు సంబంధించి చరవాణి నంబరు ఉన్నా పనిచేయక పోవడంతో ఆయా కుటుంబాల వివరాలు సేకరించేందుకు సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కొంత మంది గతంలో అక్కడ ఉన్నామని, ప్రస్తుతం వేరే ప్రాంతంలో ఉంటున్నామని పేర్కొన్నారు.



వివరాలు సమర్పించాం..

–రాజు, ఉపకమిషనర్, మల్కాజిగిరి

కుటుంబ డిజిటల్ కార్డు పైలట్ సర్వే వివరాల నమోదును జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు పూర్తి చేశారు. చాలా కుంటుంబ సభ్యులకు సంబంధించిన చరవాణి నంబర్లు పనిచేయక పోవడంతో పాటు అందుబాటులో లేక పోవడంతో పూర్తి స్థాయిలో వివరాలు నమోదు కాలేదు. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకెళ్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

మల్కాజిగిరి, డిఫెన్స్‌కాలనీ, గౌతంనగర్, అల్వాల్, న్యూస్‌టుడే:

? తూర్పుఆనంద్‌బాగ్ డివిజన్ ఉప్పరిగూడ రాజానగర్ వీధి నంబరు 7లో పగటి సమయంలోనూ వీధిదీపాలు వెలుగుతున్నాయి. ఎంతో విలువైన విద్యుత్తు వృథా అవుతోంది. –ప్రసాదరావు, సైంటిస్టు, కాలనీవాసి

✓ మీ ప్రాంతంలో సమస్యను పరిశీలించి పగటి సమయంలో వీధిదీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్, పర్యవేక్షకుడు, సర్కిల్ వీధిదీపాల విభాగం

? అమ్ముగూడ-యాప్రాల్ ప్రధాన మార్గం, కందిగూడా ఎంప్లాయిస్ కాలనీ ప్రధానమార్గాల్లో రోడ్డు పక్కన చెత్తా చెదారం పేరుకుపోయింది. అపరిశుభ్రతతో ఇబ్బందులు పడుతున్నాం. –నరేందర్, యాప్రాల్

✓ పరిశీలించి చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్‌కు తరలిస్తాం.
–నాగరాజు, పారిశుద్ధ్య అధికారి

? గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లో రోడ్డు తవ్వి పైపులైన్లు వేసిన అధికారులు రోడ్డుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు నిర్వహించలేదు. దీంతో రెండు నెలలుగా తమ వాహనాలను బయటకు తీయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
– వెంకటయ్య, కాలనీ సంఘం అధ్యక్షుడు

✓ రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేస్తాం.
–దివ్యజ్యోతి, ఏఈ, గౌతంనగర్

? కౌకూర్‌లోని వీధుల్లో గుంపులుగా తిరిగే పందులతో ఇబ్బందిగా ఉంది. పిల్లలతో ఉండే పందులు తరచూ దాడి చేస్తున్నాయి. ఇప్పటికే ఓ వృద్ధురాలు గాయపడింది. చర్యలు తీసుకోండి. – హరికృష్ణ, స్థానికుడు

✓ పందుల పెంపకాన్ని దూర ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకుంటా. –నాగార్జున, వెటర్నరీ విభాగం అధికారి

పనుల్లో వేగం పెంచుతాం

అల్వాల్, న్యూస్‌టుడే: డివిజన్ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో వేగం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ జితేంద్రనాథ్ తెలిపారు. మంగళవారం మచ్చబొల్లారంలోని ఏకలవ్యనగర్, గోపాల్‌నగర్, కృష్ణానగర్ ప్రాంతాల్లో ఈఈ శ్రీకాంత్, ఏఈ రజనితో కలిసి పాదయాత్ర చేశారు. అసంపూర్తి పనులను పరిశీలించారు. చంద్రానగర్ వరకు చేపట్టే పైపులైను విస్తరణ పనుల పురోగతిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, వెంకటేష్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనాల అభివృద్ధికి చర్యలు

మౌలాలి, న్యూస్‌టుడే: డివిజన్‌లోని కాలనీల్లో ఉద్యానవనాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ సునీత యాదవ్ అన్నారు. మంగళవారం ఎంజే కాలనీలోని పార్కును సందర్శించారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. కాలనీ వారిని అడిగి ఉద్యానవనాల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. కాలనీ సభ్యులు ప్రసాద్‌చౌదరి, శంతారాం, సాయిబాబా, శివగౌడ్, దివ్య పాల్గొన్నారు.

పేస్-2 మెట్రోలో ఉత్తర హైదరాబాద్ ప్రాంతాలను చేర్చండి


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సమితి సభ్యులు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులు

అల్వాల్, న్యూస్‌టుడే: పేస్-2 మెట్రో ప్రాజెక్టులో ఉత్తర హైదరాబాద్ వైపు నివసిస్తున్న ప్రాంతాలను చేర్చాలని మెట్రో సాధన సమితి సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నాయకత్వంలో సాధన సమితి నేతలు మంత్రితో భేటీ అయ్యారు. హైదరాబాద్‌కు ఉత్తరాన ఉన్న అల్వాల్, శామీర్‌పేట, కొంపల్లి, మేడ్చల్ వంటి ప్రాంతాలతో నగరానికి సరైన ప్రజారవాణా వ్యవస్థ లేదన్నారు. మెట్రో అన్ని విధాలుగా ఆయా ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం మాత్రం మెట్రో విస్తరణలో ఉత్తర హైదరాబాద్ ప్రాంతాలను విస్మరిస్తోందని మంత్రికి వివరించారు. ప్రతి డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మెట్రో విస్తరణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కమిటీ నేతలు మహేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, జార్జ్, చిరంజీవి, రామచందర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


ప్రసన్నాంజనేయుడు


మిర్జాలగూడ ఆలయంలో..

మల్కాజిగిరి, గౌతంనగర్: మల్కాజిగిరిలోని మారుతీనగర్‌లోని దేవాలయంలో స్వామివారికి తమలపాకులు, వడమాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని ప్రసన్నాంజనేయస్వామికి వైభవంగా పూజలు నిర్వహించారు. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ★ మిర్జాలగూడ హనుమాన్ ఆలయంలో శ్రీధరాచారి ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మోదీ పాలనలో దేశం అద్భుత ప్రగతి: భాజపా


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని కేకు కోస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అద్భుత ప్రగతి సాధించి ప్రపంచంలో ఎంతో గుర్తింపు పొందుతోందని.. దేశ భవిష్యత్తు కోసం భాజపా సభ్యత్వం తీసుకోవాలని కార్పొరేటర్ రాజ్యలక్ష్మి ప్రజల్ని కోరారు. భాజపా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధికార ప్రతినిధి ఉడుత నవీన్ ఆధ్వర్యంలో మంగళవారం వాజ్‌పేయి నగర్ ప్రధాన రోడ్డులో ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఇందులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యవర్గ సభ్యులు వీకే మహేష్ మాట్లాడారు. అనంతరం కేంద్ర మంత్రి అమిత్ షా జన్మదినాన్ని పురస్కరించుకొని కేకు కోశారు. ఆర్‌కే శ్రీను, బాలచందర్‌గౌడ్, జగదీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి


మొక్క నాటుతున్న కార్పొరేటర్ విజయశాంతి

అల్వాల్, న్యూస్‌టుడే: స్వచ్ఛ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని కార్పొరేటర్ విజయశాంతి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఓల్డ్ అల్వాల్‌లోని అయ్యర్‌బస్తీ కూడళ్లలో వ్యర్థాలు తొలగించి ముగ్గులు వేసి మొక్కలు నాటారు. స్వచ్ఛ హైదరాబాద్‌లో అల్వాల్‌కు మొదటి స్థానం దక్కేలా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే చెత్తరహిత కూడళ్లుగా డివిజన్‌ను తీర్చిదిద్దినట్లు చెప్పారు. అవగాహన లోపంతో కొందరు వ్యర్థాలను ఖాళీ ప్రదేశాల్లో పారబోస్తున్నారని చెప్పారు. ఇలాంటి ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను పెంచాలని సూచించారు. స్వచ్ఛ రిక్షాలపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రజారోగ్యం అధికారి రజని, పారిశుద్ధ్యం అధికారి ప్రభాకర్, స్థానిక నేతలు మల్లేశ్‌గౌడ్, గిరి, అరుణ్ పాల్గొన్నారు.

పటిష్ఠ బందోబస్తు మధ్య పరీక్షలు: సీపీ


చీర్యాల గీతాంజలి కళాశాల వద్ద సీపీ సుధీర్‌బాబు

కీసర, న్యూస్‌టుడే: పటిష్ఠ పోలీసు బందోబస్తు మధ్య గ్రూప్-1 పరీక్షలు నిర్వహిస్తున్నామని రాచకొండ సీపీ జి.సుధీర్ బాబు అన్నారు. మంగళవారం చీర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్-1 మెయిన్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు, పరిస్థితిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పరీక్షకు చివరి సమయంలో హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయడాన్ని అభినందించారు.

మహిళకు వేధింపులు.. కేసు నమోదు

గౌతంనగర్, న్యూస్‌టుడే: మహిళను వేధించిన ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. మల్కాజిగిరి సీఐ సత్యనారాయణ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి పరిధిలోని ఏపీఐఐసీ కాలనీలో నివాసం ఉండే ప్రశాంతి(40) యూట్యూబ్ చానల్‌తో పాటు, ఓ ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. మూడేళ్ల క్రితం నీల్‌రాజ్ (37)అలియాస్ కనకరాజు వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి ప్రశాంతిని కలిశారు. ఆ సమస్య పరిష్కారం కాకపోవడంతో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ విషయమై గతంలో సీసీఎస్, రాయదుర్గం ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ నీల్‌రాజ్ ఆమెను దుర్భాషలాడుతూ వేధిస్తుండటంతో మంగళవారం మల్కాజిగిరి ఠాణాలో ప్రశాంతి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

అల్వాల్: ఓల్డ్అల్వాల్- సుచిత్ర మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. అల్వాల్ పోలీసుల కథనం ప్రకారం.. ఓల్డ్అల్వాల్ కుమ్మరిబస్తీలో నివసించే సాయికుమార్(30) స్నేహితుడితో కలిసి మోటారు సైకిల్‌పై ఆదివారం రాత్రి ఇంటికి వస్తున్నాడు. ఫాదర్ బాలయ్యనగర్‌లోని మోర్ సూపర్‌మార్కెట్ వద్దకు రాగానే కారు ఢీకొట్టింది. సాయికుమార్ తలకు బలమైన గాయం కావడంతో సుచిత్రలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సాయికుమార్ వెంట ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆత్మీయ సమ్మేళనం


సంఘం ప్రముఖులను సత్కరించిన సభ్యులు

డిఫెన్స్‌కాలనీ: చాత్తాద శ్రీవైష్ణవ సంఘం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శాఖ, యాప్రాల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం యాప్రాల్‌లో సంఘం కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవ్, జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌స్వామి మాట్లాడుతూ.. ఐక్యత, బంధువుల మధ్య ఆప్యాయతలను పెంపొందించాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంఘంలోని కవులను, సంఘ సేవకులను, మహిళలను ఘనంగా సత్కరించారు. రంగనాథ్ వెంకటేశ్వర్లు, పద్మావతి, రవీందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను సహించం


ఆనంద్‌బాగ్‌లో పొక్లెయిన్‌తో అక్రమ సెల్లార్‌ను తొలగిస్తున్న సిబ్బంది

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: అనుమతులు తీసుకోకుండా అక్రమ నిర్మాణాలు, షెడ్లు నిర్మిస్తే సహించేది లేదని మల్కాజిగిరి పట్టణ ప్రణాళిక విభాగం డీసీపీ బాల శ్రీనివాస్ అన్నారు. ఆనంద్‌బాగ్‌లో అనుమతులు లేకుండా సెల్లార్ నిర్మాణం, యాప్రాల్ డీబీఆర్ కాలనీలో షెడ్లను వేసి వ్యాపారం చేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు నోటీసులు అందజేశామని తెలిపారు. మంగళవారం సిబ్బందితో వాటిని తొలగించామన్నారు. మళ్లీ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అయోడిన్‌పై చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి


అవగాహన ర్యాలీలో డాక్టర్ శోభారాణి, వైద్య సిబ్బంది

గౌతంనగర్, డిఫెన్స్‌కాలనీ: అయోడిన్ లోపంతో జన్యుపరమైన లోపాలు, మూత్ర పిండాల సమస్యలు వంటి అనేక రుగ్మతలకు దారితీసే అవకాశం ఉందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇంఛార్జి వైద్యాధికారి డాక్టర్ శోభారాణి అన్నారు. అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం మంగళవారం మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ..వైద్యశాఖ తరఫున పాఠశాలలు, కాలనీల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయనిర్మల, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సంస్కరణలో నాటకాలది ముఖ్య పాత్ర

నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలుగు వర్సిటీలో మంగళవారం తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో ఫిలీం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో తెలంగాణ తొలి మాండలిక నాటక రచయిత కేవల్ (కోదాటి) నరసింహారావు శతజయంతి ఉత్సవాలు, నాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ.. భారతీయ నాటకానికి ప్రత్యేకత ఉందని.. సమాజాన్ని సంస్కరించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు.

మహాత్మాగాంధీ గ్లోబల్ శాంతి పురస్కారాల ప్రదానం



ప్రసంగిస్తున్న బండ ప్రకాశ్. చిత్రంలో పురస్కార గ్రహీతలు, అతిథులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: ప్రపంచానికే హైదరాబాద్ నగరం ఆదర్శంగా ఉందని శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్ కొనియాడారు. అన్ని మతాలు, కులాల ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్నారన్నారు. మంగళవారం బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్తులో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలువురికి 'మహాత్మాగాంధీ గ్లోబల్ శాంతి పురస్కారాలు' ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా బండ ప్రకాశ్ హాజరై మాట్లాడారు. చిన్నారులను విద్యార్థి దశ నుంచే శాంతిమార్గంలో నడిపించాలన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ గోపిశెట్టి నిరంజన్ మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్ముడు చేసిన పోరాటం, త్యాగాలపై నవతరం అధ్యయనం చేయాలన్నారు. కులగణన సర్వేను ప్రస్తావిస్తూ. . ఇంటింటికి సర్వేకు వచ్చే అధికారులకు సరైన వివరాలు అందించాలన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ.. గాంధీజీ అనుసరించిన శాంతి, అహింస, సద్భావన వంటి అంశాలను పాటిస్తే సమాజం అన్ని రంగాల్లో పురోగమిస్తుందన్నారు. కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజ్‌నారాయణ ముదిరాజ్, న్యాయవాది డీఎల్ పాండు, సామాజికవేత్తలు పి.ఉజ్వల్‌చందర్, డా.రవితేజ, ఎస్.మధుసూదన్ ముదిరాజ్, బత్తుల హేమంత్, దిల్లీ శివకుమార్‌లు మాట్లాడారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ఎన్.ఆర్ లక్ష్మణరావు, వి.ప్రభాకర్‌రావు, లక్ష్మణ్‌గుప్తా, డా.కోడి శ్రీనివాసులు, బండిరాజుల శంకర్, జి.విజయలక్ష్మీ, డా.సి.బిన్నబాబు, జి.ఎట్టయ్య, కటకం భాస్కర్ గుప్తా, డా.లంక గంగాధరం, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, వై.చెంచల, మహేష్ అగర్వాల్, డా.ఎన్.ప్రసాద్, డా.జి.స్వరూపారాణి, మహమ్మద్ పర్వేజ్, ముత్యం యాదవ్, డి.లక్ష్మణ్ ముదిరాజ్, పి.భరత్‌రెడ్డి, తాళ్ల నరేందర్, డా.జమాన్, వి.రమణమ్మలకు అవార్డులు అందజేశారు.

నిర్వహణ లోపం.. దుర్గంధ భరితం



స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన శౌచాలయాలు నిర్వహణ లోపంతో దుర్గంధ భరితంగా మారాయి. సాయినగర్ కూడలిలోని శౌచాలయం వద్ద దోమలు, దుర్వాసన వెలువడుతుండటంతో అటుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శౌచాలయాలను నిత్యం శుభ్రం చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గౌతంనగర్

రాజ్యాంగ సవరణ చేయకుండా ఒకే ఎన్నిక అసాధ్యం: బీవీ రాఘవులు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ఒకే దేశం-ఒకే ఎన్నికల విధానం రాజ్యాంగ సవరణ చేయకుండా ఎలా అమలు చేస్తారని సీపీఎం పొలిట్‌ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కేంద్రంలోని భాజపా సర్కారును ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఒకే దేశం-ఒకే ఎన్నిక ప్రధాని మోదీ ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించాలని కోరుతూ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ. . ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం అమలు చేయాలంటే పార్లమెంటులో మూడింట రెండు వంతుల మంది సభ్యుల ఆమోదం ఉండాలన్నారు. అలా లేకపోవడంతోనే నాలుగు వందల మెజార్టీ సాధించాలని ఎంపీ ఎన్నికల్లో భాజపా ప్రచారం చేసుకుందన్నారు. దీన్ని ప్రజలు వ్యతిరేకించి సీట్లను తగ్గించారన్నారు. ఏక కాలంలో పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడం సాధ్యంకాదన్నారు. సభకు సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షత వహించిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మహేందర్, ఎం.శ్రీనివాస్‌రావు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా బాషా



డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా నేరేడ్‌మెట్‌కు చెందిన మోయిన్ బాషా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప ద్వారా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ హక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు.

ఐహెచ్‌ఆర్‌వో దక్షిణ భారత అధ్యక్షుడిగా కాజిమ్

కంచన్‌బాగ్: పాతనగరానికి చెందిన ఎస్‌కేఏహెచ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సయ్యద్ కాజిమ్ అలీ హాష్మీని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్(ఐహెచ్‌ఆర్‌వో)దక్షిణ భారత అధ్యక్షుడిగా నియమించారు. సంస్థ వైస్ ఛైర్‌పర్సన్ కెప్టెన్ రామ ఆర్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

శిలాఫలకాలపై ఎంపీ పేరు రాయరేమి?

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్‌లో చేపట్టే అభివృద్ధి పనుల శిలాఫలకల మీద ఎంపీ ఈటల రాజేందర్ పేరును రాయడం లేదని భాజపా నాయకులు ఆరోపించారు. ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులును భాజపా నాయకులు కలిసి మాట్లాడారు. ప్రొటోకాల్‌ను విస్మరిస్తే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అవినీతి నిర్మూలన

నాచారం, న్యూస్‌టుడే: ప్రజలందరి భాగస్వామ్యంతోనే అవినీతిని సమూలంగా నిర్మూలించవచ్చునని భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ కె.శ్రీనివాస్ అన్నారు. మల్లాపూర్ పారిశ్రామికవాడలోని బెల్ కంపెనీలో నిఘా జాగృతి వారోత్సవాలను పురస్కరించుకుని అవినీతి నిర్మూలన అవగాహన ర్యాలీని జీఎం శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిరసన

మేడ్చల్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ, ఇతర బిల్లులు ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి నవీన్ అన్నారు. ఉపాధ్యాయుల ధర్మాగ్రహదీక్షలో భాగంగా మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జిలతో ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గురు పురస్కార ప్రదానోత్సవం

కీసర: మహాశాస్త్ర సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బోడుప్పల్‌లో ఛైర్మన్ సుధగాని రాజు అధ్యక్షతన జరిగిన గురు పురస్కార ప్రదానోత్సవంలో కీసరకు చెందిన గురుస్వామి సుర్వి బాలరాజుగౌడ్‌ను ఘనంగా సత్కరించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 21 మంది గురుస్వాములకు ప్రముఖ కేరళ తాంత్రి విష్ణు నారాయణ, ప్రముఖ జానపద గాయకులు నార్సింగి నర్సింగ్‌రావు చేతుల మీదుగా సత్కరించారు.

ఛాయా చిత్రగ్రాహకులు చరిత్రకు సాక్ష్యం


మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ఛాయాచిత్ర గ్రాహకులు చరిత్రకు సాక్షులని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుందరయ్య కళానిలయంలో తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. ఫొటో, వీడియో గ్రాఫర్లు రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించారన్నారు. రాష్ట్ర సాధనకు తన సొంత పార్టీతో కొట్లాడినట్లు చెప్పారు. సాగరహారంలో దెబ్బలు తిన్నానని గుర్తు చేశారు. ఫొటో, వీడియో గ్రాఫర్లు బలవన్మరణాలకు పాల్పడొద్దన్నారు. వారికి గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. తన కుమారుడు ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఫొటో, వీడియో గ్రాఫర్ల పిల్లల విద్యాభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. ఎంబీబీఎస్, ఐఐటీలో సీట్లు సాధించిన వారికి తాను ఫీజులు చెల్లిస్తానని చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఫొటో, వీడియో గ్రాఫర్ల సేవలు ఎనలేనివని కొనియాడారు. తాడి మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర బాధ్యుడు సత్యనారాయణగుప్తా, సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట



జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి మొక్క అందజేస్తున్న చంద్రమౌళి

నిధుల మంజూరుకు విజ్ఞప్తి

విద్యానగర్, న్యూస్‌టుడే: బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని మాజీ కార్పొరేటర్ అడపా చంద్రమౌళి జీహెచ్ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తిని కోరారు. కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో చంద్రమౌళి మంగళవారం కలసి డివిజన్‌లోని ప్రధాన, అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని తెలిపారు. డ్రైనేజీ తాగునీటి పైపు లైన్లల్లో కలుస్తుండడంతో నీరు కలుషితమవుతోందని వివరించారు. వీధి దీపాలు వెలగడం లేదని చెప్పారు.

భాజపా సభ్యత్వ నమోదు



కార్యక్రమంలో రామోజీ, వెంకటస్వామిగౌడ్ తదితరులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: బీసీ కుల సంఘాల సభ్యులను భాజపా సభ్యులుగా చేర్పించాలని ఓబీసీ మోర్చా పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి రామోజీ అన్నారు. మంగళవారం బాపూనగర్‌లో భాజపా ఓబీసీ మోర్చా అంబర్‌పేట అసెంబ్లీ కన్వీనర్ వెంకటస్వామిగౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం బీసీ కుల సంఘాల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. రమేష్, నాగభూషణంచారి, యాదయ్యగౌడ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ప్రతిష్ఠను మరింత పెంచండి



వీసీ ఎం.కుమార్‌తో సత్యనారాయణ

విద్యానగర్: ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతిష్ఠను మరింత పెంచేందుకు నిరంతరం కృషి చేయాలని టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కనివేటి సత్యనారాయణ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమారేను కోరారు. మంగళవారం సత్యనారాయణ వీసీని కార్యాలయంలో కలసి సన్మానించారు.

యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

కాచిగూడ, న్యూస్‌టుడే: యువత సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి అన్నారు. మంగళవారం రాత్రి చప్పల్‌బజార్‌లో నూతనంగా నిర్మించిన ఈదమ్మ ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కలసికట్టుగా పాటుపడాలని తెలిపారు. నేతలు క్షీర్‌సాగర్, కృష్ణకుమార్, తిలక్ సక్సేనా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

నల్లకుంట, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అమృత అధికారులను సూచించారు. తిలక్‌నగర్‌లోని సంజీవయ్యనగర్‌లో కొన్ని రోజులుగా లోప్రెజర్‌తో సరఫరా అవుతున్న నల్లా నీటి సమస్యను మంగళవారం జలమండలి అధికారి రోహిత్‌తో కలిసి పరిశీలించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు.

గోల్నాకలో కూరగాయల ధరలు

తిలక్‌నగర్, న్యూస్‌టుడే: (మంగళవారం నాటివి.. కిలోకు రూపాయల్లో) టమాట 50, ఆలుగడ్డ 45, వంకాయ 50, బెండ 70, దొండ 45, దోసకాయ 40, కాకర 70, బీర 70, సొర 25, క్యాబేజీ 45, క్యాప్సికం 60, బీన్స్ 90, చిక్కుడు 65, క్యారెట్ 55, బీట్‌రూట్ 45, ఉల్లిగడ్డ 40, పచ్చిమిర్చి 45, వెల్లుల్లి 340, అల్లం 90.

ప్రయాణికులు నిద్రించేందుకు ఏర్పాట్లు

కాచిగూడ రైల్వేస్టేషన్‌లో అందుబాటులోకి సేవలు



కాచిగూడ, న్యూస్‌టుడే: కాచిగూడ రైల్వేస్టేషన్లో ప్రయాణికులు నిద్రించేందుకు పడకల సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడి స్టేషన్లో రైలు మారాల్సి వచ్చినపుడు కొన్ని గంటల పాటు నిరీక్షించాల్సి వస్తోంది. ఇక్కడ విశ్రాంతి గదులు అందుబాటులో ఉన్నప్పటికీ కూర్చోవడానికి మాత్రమే వెసులుబాటు మాత్రమే ఉంది. ప్రస్తుతం రెండు, మూడు గంటల పాటు నిద్రించేందుకు ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ కమర్షియల్ విభాగం పడకల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది.

అయిదేళ్ల పాటు లీజుకు.. అయిదేళ్ల పాటు ప్రయాణికులు నిద్రించేందుకు పడకల సదుపాయాన్ని కల్పించడానికి రైల్వే అధికారులు ఏడాది క్రితం టెండర్లు పిలిచారు. కరుణశ్రీ స్లీపింగ్ పాడ్స్ అనే సంస్థ టెండర్లను దక్కించుకుంది. ఈ సంస్థ దక్షిణ మధ్య రైల్వేకు ఏడాదికి రూ.44 లక్షలను చెల్లించాల్సి ఉంటుంది. రైల్వే నిర్ణయించిన ధర ప్రకారం ప్రయాణికులు విశ్రాంతి తీసుకున్నందుకు రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

రిజర్వేషన్ భవనాన్ని కూల్చి.. రైల్వేస్టేషన్ ఆవరణలోని రిజర్వేషన్ కేంద్రాన్ని వెనుక వైపున ఉన్న భవనంలోకి మార్చారు. రిజర్వేషన్ భవనం లోపలి పడకల ఏర్పాటుకు క్యాబిన్లు నిర్మించారు. విశ్రాంతి తీసుకునే ప్రయాణికులకు పరివార్ కోచ్ రెస్టారెంట్ నుంచి ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్నారు. రానున్న రోజుల్లో గుత్తేదారే అల్పాహారం, భోజనం తదితర వాటిని తయారు చేయించి ప్రయాణికులకు అందించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

రోజువారి రైళ్లు	:	100
ప్రయాణికులు	:	40 వేలు
అందుబాటులోని డబుల్ బెడ్లు	:	15
సింగిల్ బెడ్లు	:	39
మొత్తం	:	54
పడకకు నిర్ణీత ధర	:	రూ. 295

(ఒక వ్యక్తికి మూడు గంటలకు)

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ఉల్లాసం

ముషీరాబాద్, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముషీరాబాద్ డివిజన్ గంగపుత్రకాలనీలో ఓం గంగా భవాని సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడి బియ్యంతో మంగళవారం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఎమ్మెల్యే హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సన్మార్గంలో నడిపించేందుకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ముఠా జైసింహ, గోవింద్, చందు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ముషీరాబాద్	8008573400
రాంనగర్	8008573395
అంబర్‌పేట	8008573390
నల్లకుంట	8008573389

ముషీరాబాద్, నల్లకుంట, న్యూస్‌టుడే:

? ముషీరాబాద్ డివిజన్ కళాధర్‌నగర్ కాలనీలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. – శ్రీనివాస్, స్థానికుడు

? పద్మకాలనీలోని వీధిదీపాలు చీకటిపడ్డాక ఆలస్యంగా వెలుగుతున్నాయి. –వసంత్‌నాయుడు, పద్మకాలనీ

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– అనూష, జీహెచ్ఎంసీ విద్యుత్తు వీధిదీపాల నిర్వహణ ఏఈ

? అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్ తపాలాశాఖ సమీపంలో తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం నెలకొంటోంది.

–ఎస్.రాజేంద్రబాబు, విద్యానగర్

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, విద్యుత్ ఏడీఈ, బర్కత్‌పుర

? మొరంక్వారీ లేన్‌లో రోడ్డు గుంతలమయమైంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – శంకర్, నల్లకుంట

✓ మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేస్తాను.

– నరేందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్, జీహెచ్ఎంసీ

ఛాయా చిత్రగ్రాహకులు చరిత్రకు సాక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ఛాయాచిత్ర గ్రాహకులు చరిత్రకు సాక్షులని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుందరయ్య కళానిలయంలో తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. ఫొటో, వీడియో గ్రాఫర్లు రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించారన్నారు. రాష్ట్ర సాధనకు తన సొంత పార్టీతో కొట్లాడినట్లు చెప్పారు. సాగరహారంలో దెబ్బలు తిన్నానని గుర్తు చేశారు. ఫొటో, వీడియో గ్రాఫర్లు అనుభవజ్ఞులను పాల్గొన్నట్లు తెలిపారు. వారికి గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. సంఘం భవన నిర్మాణం, ఇతర సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. తన కుమారుడు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఫొటో, వీడియో గ్రాఫర్ల పిల్లల విద్యాభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. ఎంబీబీఎస్, ఐఐటీలో సీట్లు సాధించిన వారికి తాను ఫీజులు చెల్లిస్తానని చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఫొటో, వీడియో గ్రాఫర్ల సేవలు ఎనలేనివని కొనియాడారు. సమావేశంలో తాడి మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర బాధ్యుడు కాచం సత్యనారాయణగుప్తా, సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేష్, అధ్యక్షుడు ఎస్‌కే హుస్సేన్, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి మాధవరెడ్డి నేతలు తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్ల సాధనకు ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలి'



శ్రీనివాస్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో పృథ్వీగౌడ్ తదితరులు

నల్లకుంట, న్యూస్‌టుడే: పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించే వరకు జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి ప్రాంతానికి చెందిన సీహెచ్. శ్రీనివాస్‌ను, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా సిరిసిల్ల పట్టణానికి చెందిన మేకల పరశురాములను నియమించి వారికి నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో శాఖల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి బీసీల అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ పథకాలు రూపొందించాలని పేర్కొన్నారు. బీసీ చట్ట సాధనకు కొనసాగుతున్న ఉద్యమాల్లో బీసీ సంఘాలు గ్రామ స్థాయి నుంచి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు గుజ్జకృష్ణ, ఉదయ్, పృథ్వీగౌడ్, బలరామ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం'



నియామక పత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ లీగల్ సెల్ ఛైర్మన్ అశోక్‌గౌడ్ తదితరులు

గోల్నాక, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర ఛైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ తెలిపారు. మంగళవారం శంకర్‌నగర్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది రాజేష్‌కు లీగల్ సెల్ రాష్ట్ర వైస్ ఛైర్మన్‌గా నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలుకు రూ.వేలాది కోట్లు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. తిరుపతిపవర్, కన్నేనర్సు మోమిన్ రోషన్ జమీర్, భూపాల్, కమలాకర్, కిషన్‌రాజ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.


'భారాస పాలనలోనే గీత కార్మికులకు పెద్దపీట'



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో రవికుమార్‌గౌడ్, ఎంవీ రమణ, వెంకటేశ్వర్లు

బాగ్‌లింగంపల్లి: భారాస పాలనలోనే గీత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేశామని మాజీ ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం సుందరయ్య కళానిలయంలో కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస ప్రభుత్వ హయాంలో గీత కార్మికుల అభ్యున్నతికి పాటుపడ్డామన్నారు. సర్వాయి పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించామని తెలిపారు. మూసివేసిన కల్లు దుకాణాలను తెరిపించామన్నారు. వృత్తి పన్నును రద్దు చేసినట్లు తెలిపారు. గీత కార్మికులకు ప్రమాదం సంభవిస్తే రూ.5లక్షల నష్టపరిహారం పెంచామన్నారు. తాడి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వెంకటనర్సయ్య, గ్రేటర్ కన్వీనర్ ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో వడ్డెర్లను పరిగణనలోకి తీసుకోవాలి



బీసీ కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎత్తరి అంతయ్య, ఓర్సు కృష్ణయ్య

గాంధీనగర్, న్యూస్‌టుడే: బీసీ కులగణనలో సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులతో పాటు సంచారులైన వడ్డెర్లను పరిగణనలోకి తీసుకోవాలని వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ వైస్ ఛైర్మన్ ఎత్తరి అంతయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం బీసీ కమిషన్ ఛైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌ను కార్యాలయంలో ట్రస్ట్ డైరెక్టర్ ఓర్సు కృష్ణయ్యతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వడ్డెర్ల స్థితిగతులను వివరించామన్నారు. వడ్డెర్లు సంచార జీవులని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి జీవనోపాధికి వెళ్తుంటారని తెలిపారు. అనంతరావు, మోహన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు ఎస్ఆర్ శంకరన్



చిత్రపటానికి పూలమాల వేస్తున్న సత్యనారాయణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఎస్ఆర్ శంకరన్ స్ఫూర్తి ప్రదాత, ఆదర్శనీయుడని ప్రభుత్వ విశ్రాంత ఉన్నతాధికారి వై.సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమిలో నిర్వహించిన శంకరన్ జయంత్యుత్సవాల్లో ఆయన మాట్లాడుతూ.. గురుకుల విద్యాలయాల సృష్టికర్త అని కొనియాడారు. నక్సలైట్‌లు, ప్రభుత్వానికి మధ్య ఉన్న వివాదాలను పరిష్కరించడంలో కృషి చేశారన్నారు. నెల్లూరు జిల్లాలో బాలబాలికలకు కలెక్టర్ బంగ్లాలోనే పాఠశాలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అకాడమీ ప్రిన్సిపల్ సురేందర్‌రెడ్డి, సిబ్బంది సతీష్‌కుమార్, మురళీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కోతుల బెడద నియంత్రించాలని వినతి



పశువైద్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బి.పద్మ

విద్యానగర్, న్యూస్‌టుడే: బాగ్ అంబర్‌పేట డివిజన్ అంతర్గత బస్తీలోని నివాస ప్రాంతాల్లో కోతులు, వీధి కుక్కల బెడదను నియంత్రించాలని కార్పొరేటర్ బి.పద్మ పశువైద్య అధికారులు సద్గుణరెడ్డి, వనజ కుమారిలను కోరారు. మంగళవారం డివిజన్ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలోని అభివృద్ధి కార్యాలయంలో కార్పొరేటర్ ఆయా అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కోతులు గుంపులు గుంపులుగా నివాసాల్లోకి వచ్చి భయభ్రాంతులకు గురి చూస్తున్నాయని, వీధి కుక్కలు రాత్రి పగలు అన్న తేడా లేకుండా చిన్న పిల్లల వెంటపడి దాడి చేస్తున్నాయని వివరించారు. కోతులు, వీధి కుక్కలను పట్టుకుని నగరానికి దూరంగా విడిచి పెట్టాలని ఆమె అధికారులకు సూచించారు.

మహాత్మా గాంధీ గ్లోబల్ శాంతి పురస్కారాల ప్రదానం



ప్రసంగిస్తున్న బండ ప్రకాశ్. చిత్రంలో పురస్కార గ్రహీతలు, అతిథులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: ప్రపంచానికే హైదరాబాద్ నగరం ఆదర్శంగా ఉందని శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్ కొనియాడారు. అన్ని మతాలు, కులాల ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్నారన్నారు. మంగళవారం బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్తులో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలువురికి 'మహాత్మాగాంధీ గ్లోబల్ శాంతి పురస్కారాలు' ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా బండ ప్రకాశ్ హాజరై మాట్లాడారు. చిన్నారులను విద్యార్థి దశ నుంచే శాంతి మార్గంలో నడిపించాలన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ గోపిశెట్టి నిరంజన్ మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్ముడు చేసిన పోరాటం, త్యాగాలపై నవతరం అధ్యయనం చేయాలన్నారు. కుల గణన సర్వేను ప్రస్తావిస్తూ.. ఇంటింటికి సర్వేకు వచ్చే అధికారులకు సరైన వివరాలు అందించాలన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ.. గాంధీజీ అనుసరించిన శాంతి, అహింస, సద్భావన వంటి అంశాలను పాటిస్తే సమాజం అన్ని రంగాల్లో పురోగమిస్తుందన్నారు. కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజ్‌నారాయణ ముదిరాజ్, న్యాయవాది డీఎల్ పాండు, సామాజికవేత్తలు పి.ఉజ్వల్‌చందర్, డా.రవితేజ, ఎస్.మధుసూదన్ ముదిరాజ్, బత్తుల హేమంత్, దిల్లీ శివకుమార్‌లు మాట్లాడారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ఎన్.ఆర్ లక్ష్మణరావు, వి.ప్రభాకర్‌రావు, లక్ష్మణ్‌గుప్తా, డా.కోడి శ్రీనివాసులు, బండిరాజుల శంకర్, జి.విజయలక్ష్మీ, డా.సి.బిన్న బాబు, జి.ఎట్టయ్య, కటకం భాస్కర్ గుప్తా, డా.లంక గంగాధరం, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, వై.చెంచల, మహేష్ అగర్వాల్, డా.ఎన్.ప్రసాద్, డా.జి.స్వరూపారాణి, మహమ్మద్ పర్వేజ్, ముత్యం యాదవ్, డి.లక్ష్మణ్ ముదిరాజ్, పి.భరత్‌రెడ్డి, తాళ్ల నరేందర్, డా.జమాన్, వి.రమణమ్మలకు అవార్డులు అందజేశారు.

సీల్‌వెల్ సినీ సుస్వరాలు..



కృష్ణమూర్తి, కోదండరెడ్డిలకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేస్తున్న రఫీ, దామోదర్

గాంధీనగర్: బ్రిటీష్ వాళ్లను గడగడలాడించిన మహానుభావుడు గాంధీజీ అని మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి సీల్‌వెల్ కార్పొరేషన్, శ్రుతిలయ, ఆర్ఆర్ ఫౌండేషన్‌ల సంయుక్తాధ్వర్యంలో త్యాగరాయగానసభలో సీల్‌వెల్ సినీ సుస్వరాలు-64 శీర్షికతో నిర్వహించిన సినీ సంగీత విభావరిలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఏటుకూరి కృష్ణమూర్తి, రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిలకు సీల్‌వెల్-శ్రుతిలయ జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కుసుమ భోగరాజు, రఫీ, శ్రీనివాసమూర్తి, దైవజ్ఞశర్మ, ఆమని తదితరులు పాల్గొన్నారు.

సినీ సంగీత విభావరి

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయగానసభ నిర్వహించిన సినీసంగీత విభావరి రమ్యంగా సాగింది. గాయకుడు చంద్రతేజ, వర్ధమాన గాయనీగాయకులు కేవీ రావు, అనూష, కల్యాణి, వెంకీ, శ్రీకాంత్‌లు పాటలు పాడారు. అనంతరం జరిగిన సమావేశంలో గాయకుడు చంద్రతేజ, వ్యాఖ్యాత మోహనకృష్ణలను హెలెన్ కెల్లర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్, రిహాబిలిటేషన్ ఫర్ ది చిల్డ్రన్ నిర్వాహకుడు ఉమర్ అలీ ఖాన్ సన్మానించారు. లక్ష్మీనారాయణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరు వాన... జనం హైరానా



ముషీరాబాద్ నియోజకవర్గంలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన ఆకస్మిక వర్షంతో లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయం అయ్యాయి. సాగర్‌లాల్ ఆస్పత్రికి వెళ్లేదారి, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, వీఎస్టీ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరద భారీగా చేరడంతో వాహనదారులు, పాదచారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. –న్యూస్‌టుడే, ముషీరాబాద్

నాయిని సేవలు చిరస్మరణీయం



నర్సింహారెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



అన్నదాన కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వీఎస్ఆర్, దేవేందర్‌రెడ్డి తదితరులు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: దివంగత మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి లంబాడిబస్తీలో నాయిని వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపాల్, వీఎస్టీ కార్మిక సంఘం అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి, భారాస నేతలు ఎమ్మెన్ శ్రీనివాస్, నగేశ్ ముదిరాజ్, జైసింహలు నాయిని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనలో నాయిని కీలక భూమికను పోషించారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పేర్కొన్నారు.

రాంనగర్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర తొలి హోం శాఖ మంత్రి దివంగత నాయిని నర్సింహారెడ్డి వర్ధంతిని అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్ మీసేవా వద్ద, రాంనగర్ చౌరస్తాలో, కవాడిగూడ డివిజన్ దోమలగూడ తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. నాయిని చిత్రపటానికి ఆయన కుమారుడు దేవేందర్ రెడ్డి, అల్లుడు మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

గాంధీనగర్, న్యూస్‌టుడే: మాజీ మంత్రి నాయిని నరసింహారెడ్డి సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం భారాస నేత పున్నా సత్యనారాయణ ఆధ్వర్యంలో డివిజన్‌లోని జవహర్‌నగర్‌లో రాష్ట్ర మాజీ హోంశాఖమంత్రి నాయిని నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని నాయిని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని కొనియాడారు.

'రాజ్యాంగ సవరణ చేయకుండా ఒకే ఎన్నిక ఎలా అమలు చేస్తారు'



మాట్లాడుతున్న బీవీ రాఘవులు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ఒకే దేశం- ఒకే ఎన్నికల విధానం రాజ్యాంగ సవరణ చేయకుండా ఎలా అమలు చేస్తారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కేంద్రంలోని భాజపా సర్కారును ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఒకే దేశం- ఒకే ఎన్నిక ప్రధాని మోదీ ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించాలని కోరుతూ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో ప్రధాని మోదీ అధికారం చేపట్టేందుకు ఒకే ఎన్నిక విధానం తెరపైకి తెచ్చారన్నారు. భాజపా ఎన్నికల మ్యానిఫెస్టోలో అమలు చేస్తామని ప్రజలకు చెప్పారని తెలిపారు. 2018లోనూ అదే తరహా హామీ ఇచ్చారని, వాటి అమలుపై లా కమిషన్ ప్రచారం చేసిందని, నీతి అయోగ్ చర్చాపత్రం విడుదల చేసిందన్నారు. 2019లో ఒకే ఎన్నిక విధానం ఆచరణలోకి తీసుకు రాలేదన్నారు. పూర్వ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఈ విధానం అమలు చేస్తామని అప్పట్లో దీపావళి నాడు భాజపా టపాసులు కాల్చి సంబరాలు జరుపుకుందని పేర్కొన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం అమలు చేయాలంటే పార్లమెంటులో మూడో వంతు సభ్యుల ఆమోదం ఉండాలన్నారు. అలా లేకపోవడంతోనే నాలుగు వందల మెజార్టీ సాధించాలని ఎంపీ ఎన్నికల్లో భాజపా ప్రచారం చేసుకుందన్నారు. దీన్ని ప్రజలు వ్యతిరేకించి సీట్లను తగ్గించారన్నారు. ఏకకాలంలో పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడం సాధ్యంకాదన్నారు. సభకు సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షత వహించిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మహేందర్, ఎం.శ్రీనివాస్ రావు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కాచిగూడ, న్యూస్‌టుడే: రైలు ఢీకొని చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి కథనం ప్రకారం... సికింద్రాబాద్ చిలుకలగూడకు చెందిన సయ్యత్ అస్లం(78) ఈ నెల 20న సీతాఫల్‌మండి స్టేషన్ నుంచి ఉప్పుగూడ వెళ్తున్నాడు. ఉప్పుగూడ స్టేషన్లో ప్రయాణిస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా మంగళవారం మృతి చెందాడు.

రైలులో మహిళ ఆభరణాల చోరీ.. కేసు

కాచిగూడ, న్యూస్‌టుడే: రైలులో మహిళ బంగారు ఆభరణాల చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి కథనం ప్రకారం... సూర్యాపేట జిల్లా, చివ్వెంల మండలం, మౌన్యనాయక్ తండాకు చెందిన లచ్చిరాం, ఆయన భార్య మంగమ్మ సోమవారం అహ్మదాబాద్ నుంచి కాచిగూడకు రైలులో వస్తున్నారు. రైలు ముత్కేడ్ స్టేషన్ వద్ద ఉండగా 35 గ్రాముల బంగారు ఆభరణాలున్న చేతి బ్యాగు చోరీకి గురైంది. మంగళవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

దోమలగూడ డీఐగా శ్రీశైలం నాయక్



రాంనగర్, న్యూస్‌టుడే: దోమలగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా 2009 బ్యాచ్‌కు చెందిన శ్రీశైలం నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఎస్సైగా సనత్‌నగర్, నాచారం, కుషాయిగూడ, ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, కేపీహెచ్‌బీలో పనిచేశారు. రాచకొండ ఇన్‌స్పెక్టర్‌గా, చిలకలగూడ డీఐగా, ఎస్బీ మహేశ్వరం జోన్‌లో పనిచేసిన ఆయన సోమవారం దోమలగూడ డీఐగా బాధ్యతలు చేపట్టారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఉప్పల్
•ఉప్పల్ •మేడ్చల్

అందరి సహకారంతోనే అవినీతి నిర్మూలన


అవగాహన ర్యాలీలో బెల్ కంపెనీ ఉద్యోగులు

నాచారం, న్యూస్‌టుడే: ప్రజలందరి సహకారంతోనే అవినీతిని నిర్మూలించవచ్చునని భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ పారిశ్రామికవాడలోని బెల్ కంపెనీలో నిఘా జాగృతి వారోత్సవాలను పురస్కరించుకుని అవినీతి నిర్మూలన అవగాహన ర్యాలీని జీఎం శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు నిజాయతీగా బతకడం దైనందిన జీవితంలో భాగం కావాలని ఆయన ఆకాంక్షించారు. అవినీతి నిర్మూలనకు కృషి చేస్తామని కంపెనీ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పీర్జాదిగూడ- పర్వతాపూర్ రోడ్డు పనులు పూర్తి చేయాలి


అధికారులతో సమావేశమైన మేయర్ అమర్‌సింగ్

పీర్జాదిగూడ: పీర్జాదిగూడ నగర రోడ్లు, అభివృద్ధిపై మంగళవారం మేయర్ అమర్‌సింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈనెల 19న ఈనాడులో 'రహదారుల నిర్మాణం చూడతరమా' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన మేయర్ అమర్‌సింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పీర్జాదిగూడ- పర్వతాపూర్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని నిర్ణయించారు. గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

రక్తదాతలకు ప్రశంసాపత్రాలు


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సీఐ రుద్వీర్‌కుమార్, ఎస్సై వెంకటయ్య

నాచారం: నాచారంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎస్‌ఎస్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సైనికుడు సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో 20మంది యువకులు రక్తదానం చేశారు. మంగళవారం పోలీసు స్టేషన్‌లో రక్తదాతలకు సీఐ రుద్వీర్‌కుమార్, ఎస్సై వెంకటయ్య ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. లోకేందర్‌రెడ్డి, రమాకాంత్, రమేష్, సునీల్‌బాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

మురుగు కాలువ పనులు ప్రారంభం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పరిధిలోని 6వ డివిజన్ బీజేఆర్‌నగర్‌లో అంతర్గత మురుగు కాలువ నిర్మాణ పనులను మేయర్ దొంతగాని శాంతి ప్రారంభించారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ.10 లక్షలతో కాలువ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, మురుగు కాలువ నిర్మాణ పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్ పల్లపు రవి, స్థానికులు పాల్గొన్నారు.

రూపు మారనుంది.. కల తీరనుంది

- రూ.254 కోట్ల నిధులతో ఆరు రహదారుల విస్తరణ
- ప్రారంభమైన రాంపల్లి దారి పనులు


వేపచెట్టుకు వేసిన నంబర్


న్యూస్‌టుడే- నాగారం: హెచ్‌ఆర్‌డీసీఎల్ ద్వారా ఆరు రహదారులకు రూ.254 కోట్ల నిధులతో 19.50 కి.మీ. పనులు వేగవంతం చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు సంస్థ డీఈ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం నాగారం పట్టణ పరిధి రాంపల్లిలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. వంద అడుగుల దారి రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 50 అడుగుల దారి.. ఆరు అడుగులతో విభాగిని, మధ్యలో


రాంపల్లిలో చదును చేసిన రహదారి

చెట్లు, వీధిదీపాలు, ఇరువైపులా ఆరు అడుగుల వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపడుతున్నామన్నారు.

ఆరు దారులు ఇవే..

- చర్లపల్లి నుంచి రాంపల్లి మీదుగా కరీంగూడ సర్వీస్ రోడ్డు వరకు 3.80 కి.మీ.
- దమ్మాయిగూడ రోడ్ గార్డెన్ నుంచి నాగారం వరకు 2.80 కి.మీ.
- రాంపల్లి ఎక్స్ రోడ్డు నుంచి సర్వే నంబర్ 421 హెచ్‌పీ పెట్రోల్ పంపు వరకు 3.90 కి.మీ
- చర్లపల్లి బీఎస్‌ఎన్‌ఎల్ నుంచి రాంపల్లి వరకు ప్రస్తుతం కొనసాగుతున్న పనులు 3.30 కి.మీ.
- సర్వే నంబర్ 421 నుంచి యంనంపేట్ వరకు 3.10 కి.మీ
- నాగారం డబుల్ బెడ్ రూమ్‌ల నుంచి యంనంపేట్ వరకు 2.60 కిలోమీటర్లు విస్తరించనున్నారు.



వృక్షాల తొలగింపు

ఆరు రహదారులకు ఇరువైపుల ఉన్న వృక్షాలను అటవీ శాఖ అనుమతులతో తొలగింపు పనులు చేపట్టామని ఆర్‌టీబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) డీఈ సత్యనారాయణ పేర్కొన్నారు. సుమారు 750 వృక్షాలను గుర్తించి వాటికి మార్కింగ్ చేశారన్నారు. రానున్న కాలంలో పట్టణం మరింత అందంగా తయారు కానున్నాయని హెచ్‌ఆర్‌డీసీఎల్ డీఈ విజయ్ కుమార్ పేర్కొన్నారు. అందరి సహకారంతో పనులు వేగంగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు.

చర్లపల్లి రైల్వేస్టేషన్ టెర్మినల్‌తో..

సికింద్రాబాద్, హైదరాబాద్ రైల్వేస్టేషన్లపై ఒత్తిడి తగ్గించేందుకు చర్లపల్లి స్టేషన్ నుంచి రైళ్లను నడిపేందుకు అన్ని సిద్ధం చేస్తున్నారు. దీంతో చర్లపల్లి నుంచి నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, కీసరతోపాటు రాజీవ్ రహదారికి వెళ్లే రోడ్లపై రద్దీ పెరగనుండడంతో ఈ ప్రాంత రోడ్లను వంద అడుగులుగా విస్తరించేందుకు ఇప్పటికే మార్కింగ్ చేశారు.

ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే


రద్దీ ఎక్కువుండే ప్రాంతాలను మ్యాపులో జడ్పీకి వివరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నాచారం, న్యూస్‌టుడే: నాచారంలో రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యల శాశ్వత నివారణకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం హెచ్‌ఎంటీనగర్ నుంచి నాచారం చౌరస్తా వరకు ప్రధాన రహదారిని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, రాచకొండ ఉపకమిషనర్ జగన్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని విధాలుగా అనువుగా ఉండేలా యూటర్న్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈఎస్ఐ వద్ద ఉన్న యూటర్న్ స్థానంలో వైజయంతి వద్ద ఏర్పాటు చేసేందుకు అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. నాచారంలోని ఐపీసీటీ ప్రహరీ నుంచి హబ్సిగూడ చౌరస్తా వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. రోడ్డు వెడల్పు గురించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ శాంతిసాయిజెన్, సీఐ రుద్వీర్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

గురు పురస్కార ప్రదానోత్సవం


పురస్కారం అందుకుంటున్న బాలరాజుగౌడ్

కీసర, న్యూస్‌టుడే: మహాశక్తి సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బోడుప్పల్‌లో చైర్మన్ సుధగాని రాజు అధ్యక్షతన జరిగిన గురుపురస్కార ప్రదానోత్సవంలో కీసరకు చెందిన గురుస్వామి సుర్ని బాలరాజుగౌడ్‌ను ఘనంగా సత్కరించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 21 మంది గురుస్వాములకు ప్రముఖ కేరళ తాంత్రి విష్ణు నారాయణ, ప్రముఖ జానపద గాయకులు నర్సింగి నర్సింగ్‌రావు చేతుల మీదుగా సత్కరించారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

ఉప్పల్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో గంజాయి కొని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న ముఠా కటకటాలపాలైంది. ఎస్‌టీఎఫ్‌డీ టీం సీఐ నాగరాజు కథనం ప్రకారం.. బోడుప్పల్‌కు చెందిన వినీత్, అనుదీప్ (దమ్మాయిగూడ), తేజస్‌కృష్ణ(బల్కంపేట) గంజాయికి అలవాటు పడ్డారు. వీరు ముఠాగా ఏర్పడి కొన్ని రోజులుగా ఉప్పల్, బోడుప్పల్ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నారు. మంగళవారం ఉప్పల్ నల్లచెరువు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 1.230 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు కాదిది.. మురుగు



సాకేత్ టౌన్‌షిప్ వద్ద మురుగు చేరుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టౌన్‌షిప్‌లోని మిథిల రోడ్ కమ్యూనిటీ కాలనీ వెనుక వైపున ఖాళీ స్థలాల్లోకి ఎగువ కాలనీల నుంచి డ్రైనేజీ వచ్చి చేరుతోంది. ఖాళీ ప్లాట్లు, శ్మశానవాటికలోకి చేరిన మురుగు చెరువును తలపిస్తోంది. దుర్గంధం, దోమలతో స్థానికులు రోగాలబారిన పడుతున్నారు. సాకేత్ నుంచి వంపుగూడ, బీజేఆర్ కాలనీ, జవహర్‌నగర్ వైపు వెళ్లే మార్గంలో రోడ్డుపై డ్రైనేజీ వర్షపు నీరు పారుతుండటంతో అటువైపు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. తక్షణమే అధికారులు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కాప్రా

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట వరకు

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం).

నాగారం, కీసర, న్యూస్‌టుడే:

? దమ్మాయిగూడ పుర ప్రజాపాయిగార్డెన్ కాలనీలో వీధి దీపాలు నిరంతరంగా వెలుగుతున్నాయి. టైమర్లను అమర్చాలి. అలాగే పారిశుద్ధ్య కార్మికులు వీధులు శుభ్రం చేయడం లేదు. -సీవీఎస్ మూర్తి, ప్రజాపాయిగార్డెన్, దమ్మాయిగూడ

✓ వీధి దీపాలకు అమరుస్తున్న టైమర్లు ఉరుములు, మెరుపుల కారణంగా దెబ్బతింటున్నాయి. కొత్త వాటిని అమర్చి సమస్య లేకుండా చూస్తాం. - వినయ్, పుర విద్యుత్తు సహాయకులు, దమ్మాయిగూడ

? దమ్మాయిగూడ నుంచి నాగారానికి వచ్చే కూడలి వద్ద రోడ్డుకు రెండు వైపుల ఆటోలు నిలుపడంతో పాఠశాలు, కార్యాలయాలకు వెళ్లే సమయాల్లో ఇబ్బందులు పడుతున్నాం. - రమేష్, రామలింగేశ్వర కాలనీ, నాగారం

✓ ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం చేస్తా. - వెంకయ్య, సీఐ, కీసర

? కీసరలో ఇంటింటికి చెత్త వాహనం సరిగా రావడం లేదు. దీంతో ఇళ్లలో చెత్త పేరుకుపోయి దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. - రాజు, కీసర

✓ రెండు రోజులకోసారి చెత్త వాహనం ఇంటింటికి వచ్చి చెత్త సేకరించేలా చర్యలు తీసుకుంటాం. - మహేందర్, సానిటేషన్ ఇన్‌ఛార్జి కీసర

రెండోరోజు ప్రశాంతంగా గ్రూప్-I మెయిన్స్ పరీక్ష

'ఈనాడు' చొరవతో పరీక్ష కేంద్రంలో వసతుల కల్పన

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో ఉత్కంఠంగా మారిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు రెండో రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఐదు, పోచారం ఐటీకారిడార్ ఠాణా పరిధిలో 1 సెంటర్ ఏర్పాటు చేశారు. అభ్యర్థులు మధ్యాహ్నం 12 గంటలకే కేంద్రాలకు చేరుకున్నారు. చౌదరిగూడ ప్రిన్స్‌టన్ కళాశాలలోని సెంటర్‌లో సౌకర్యాలు లేవని పలువురు అభ్యర్థులు 'ఈనాడు' దృష్టికి తీసుకొచ్చారు. భోజనం చేసేందుకు ఏ-1లో వెలుతురు, గాలి సరిగా లేకపోవడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. సమస్యను అక్కడే ఉన్న పర్యవేక్షకులు జానీ(ఘట్‌కేసర్ మండల వ్యవసాయాధికారి) దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా.. స్పందించకపోవడంతో సీఐ బి.రాజువర్మకు సమస్యను వివరించగా.. ఆయన వెంటనే మూడు టేబుళ్లు వేస్తూ, నాలుగు ట్యూబ్‌లైట్లు తెప్పించి పరీక్ష ప్రారంభానికి ముందు ఏర్పాటు చేయించారు.

పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశాం : సీపీ

కీసర: పటిష్ఠ బందోబస్తు మధ్య గ్రూప్-1 పరీక్షలు నిర్వహిస్తున్నామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. మంగళవారం చీర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షకు చివరి సమయంలో హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. కీసరసీఐ వెంకయ్య ఉన్నారు. హబ్సిగూడ: రామంతాపూర్‌లోని స్ఫూర్తి, వాగ్దేవి, మెగా కళాశాలల్లో మంగళవారం గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ట్రాఫిక్ డీసీపీ మనోహర్, ఎస్‌వోటీ డీసీపీ నర్సింహారెడ్డి, సీఐ ఎలక్షన్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ లక్ష్మీమాధవి తదితరులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.


చౌదరిగూడ సెంటర్ వద్ద హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది


గీతాంజలి కళాశాలలో అధికారులతో సీపీ సుధీర్‌బాబు

గరుడోత్సవం.. భక్తజన పరవశం


ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


గరుడ వాహనంపై పురవీధుల్లో శ్రీవారు

నాచారం, న్యూస్‌టుడే: మంగళ వాయిద్యాలు.. మామిడి తోరణాలు.. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ముత్యాల పందిరిలో మంగళవారం నాచారం వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణం కనులపండువగా సాగింది. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వరాచార్యులు..సుప్రభాతం, తోమాల, అర్చన, కొలువు, సహస్రనామార్చన, నిత్యారాధనలు, యాగశాల కార్యక్రమం, ఊంజలసేవ..తదితర ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతిసాయిజెన్, ఆలయ ధర్మాధికారి దుర్గాప్రసాద్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పురవీధుల్లో నిర్వహించిన శ్రీవారి గరుడ వాహనోత్సవం వైభవంగా సాగింది. వీధులన్నీ జనసంద్రంగా మారాయి. భజనమండలి ప్రతినిధులు, మహిళా భక్తులు...స్వామి సంకీర్తనలు పాడుతూ భజనలు చేశారు. దాండియా, కోలాటం ఆకట్టుకున్నాయి. ఆలయకమిటీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, శేషారెడ్డి, కామేశ్వరరావు, లక్ష్మణ్‌రాజ్, గోపాల్‌రెడ్డి, భీష్మాచారి తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాలపై ఎంపీ పేరు ఎందుకు రాయడం లేదు?: భాజపా

ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్ సర్కిల్‌లో చేపట్టే అభివృద్ధి పనుల శిలాఫలకాల మీద ఎంపీ ఈటల రాజేందర్ పేరును రాయడం లేదని భాజపా నాయకులు ఆరోపించారు. మంగళవారం ఉప్పల్ సర్కిల్ డీసీ అంజనేయులును భాజపా నాయకులు కలిసి పలు విషయాలపై మాట్లాడారు. చిలుకానగర్ డివిజన్‌లో ఇటీవల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయన్నారు. వీటిలో ఏ ఒక్కదాని మీద ఎంపీ ఈటల పేరు లేదన్నారు. ప్రోటోకాల్‌ను విస్మరిస్తే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. భాజపా అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్, రామరాజుయాదవ్, విఠల్ పాల్గొన్నారు.

వసతిగృహంలో బీటెక్ విద్యార్థి బలవన్మరణం

మేడ్చల్, న్యూస్‌టుడే: వసతి గృహంలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లకు చెందిన సిద్ధార్థయాదవ్ (19) మేడ్చల్ పట్టణం ఉమానగర్‌లోని వీవీపీ వసతి గృహంలో ఉంటున్నాడు. కిష్టాపూర్‌లోని మల్లారెడ్డి కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల అనంతరం సోమవారం వసతిగృహానికి వచ్చాడు. మంగళవారం తోటి విద్యార్థులంతా కళాశాలకు వెళ్లారు. సిద్ధార్థయాదవ్ కళాశాలకు వెళ్లలేదు. సాయంత్రం తోటి విద్యార్థులు వచ్చి చూడగా అతని గది లోపల నుంచి గడియ పెట్టి ఉంది. తలుపులు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. ఫోన్‌లో పలు ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లు ఉండటంతో పోలీసులు ఆ కోణంలో విచారణ చేస్తున్నారు.

దంపతుల మధ్య గొడవ.. భార్య ఆత్మహత్య.. భర్త రిమాండ్

మేడిపల్లి (బోడుప్పల్), న్యూస్‌టుడే: భార్యాభర్తలు గొడవ పడి వేరుగా ఉంటుండగా.. భర్త తన మాట వినడంలేదని భార్య ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. భార్య మృతికి కారణమైన భర్తను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. బోడుప్పల్‌లో ఎన్‌ఎవీ కాలనీలో ఉండే బసిరి సంతోష్, కవిత (26) భార్యాభర్తలు. భార్యతో గొడవ పడి సంతోష్ నాలుగు నెలలుగా వేరుగా ఉంటున్నాడు. మేడిపల్లి ఓయో రెస్టారెంట్‌లో గది అద్దెకు తీసుకొన్న కవిత తన భర్తకు పలుమార్లు ఫోన్ చేసింది. ఆయన స్పందించలేదు. దీంతో గదిలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కవిత మృతికి కారణమైన సంతోష్‌ను అదుపులో తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

అనుమతి లేకుండా షూటింగ్.. ఇద్దరిపై కేసు

పోచారం(ఘట్‌కేసర్) న్యూస్‌టుడే: అనుమతి లేకుండా జనావాసాల మధ్య షూటింగ్ నిర్వహిస్తున్న వారిపై కేసు నమోదయ్యింది. పోచారం ఐటీకారిడార్ సీఐ బి.రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి చౌదరిగూడలోని విజయపురికాలనీ వద్ద ఉన్న బృందావన్ గ్రాండ్ సమీపంలో కొందరు గుమిగూడడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లారు. అనుమతి లేకుండా వెబ్ సిరీస్ షూటింగ్ జరుగుతున్నట్లు గుర్తించారు. ఫిల్మ్‌నగర్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వల్లా వెంకటేశ్వర్లు (34), మేనేజర్ పెద్దపూడి జగదీష్ వర్మ(31)లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నాణ్యతగా పనులు చేపట్టాలి

పోచారం (ఘట్‌కేసర్), న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని గుత్తేదారులకు పోచారం మున్సిపల్ ఛైర్మన్ కొండల్‌రెడ్డి సూచించారు. మంగళవారం అన్నోజిగూడలో రూ.30లక్షలతో చేపడుతున్న బీటీరోడ్డు పనులను ఆయన తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉపయోగిస్తున్న సామగ్రిని పరిశీలించారు.

పాదబాటపై వ్యాపారం.. పట్టించుకోని యంత్రాంగం



పోచారం (ఘట్‌కేసర్), న్యూస్‌టుడే: పోచారం మున్సిపాలిటీ నారపల్లిలోని వరంగల్ జాతీయ రహదారిపై పక్కనే ఉన్న పాదబాటను ఆక్రమించి కాలనీకి వెళ్లే పాదచారుల బాటపై నిర్మాణ సామగ్రితో వ్యాపారం కొనసాగిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈప్రాంతంలో వ్యాపారం కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడి నుంచి రాకపోకలు సాగించేందుకు భయపడిపోతున్నామని, రెండేళ్లుగా మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఉపాధ్యాయుల నిరసన


మేడ్చల్ బాలికల ఉన్నత పాఠశాలలో కరపత్రాలతో ఉపాధ్యాయులు

మేడ్చల్, మేడ్చల్ రూరల్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ ఇతర బిల్లులు ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి నవీన్ అన్నారు. ఉపాధ్యాయుల ధర్మాగ్రహదీక్షలో భాగంగా మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలతో ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న తపస్ ఆధ్వర్యంలో ఆయా మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు సమర్పించడంతోపాటు నవంబరు 5న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. మండల అధ్యక్షుడు వెంకటరమణ, జిల్లా కార్యదర్శి గోపాల్, కోశాధికారి రమాదేవి పాల్గొన్నారు.

ప్రణాళికాలోపం.. ప్రమాదాలతో సతమతం

- నిత్యం రక్తమోడుతున్న మేడ్చల్ జాతీయ రహదారి 44
- రోడ్డు విస్తరణ పనులతో ఇరుకుగా దారి

మేడ్చల్, న్యూస్‌టుడే: మేడ్చల్ జాతీయ రహదారి 44 ప్రమాదాలకు నిలయంగా మారింది. కండ్లకోయ నుంచి అత్వెల్లి రేకుల బావి వరకు ఎన్ని.. ఎక్కడో ఒక చోట


డిపో వద్ద నిలిచిపోయిన వాహనాలు

ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగం, అజాగ్రత్తతో కొన్ని ప్రమాదాలు జరిగితే.. రోడ్డు విస్తరణ పనులతో మరికొన్ని జరుగుతున్నాయి.

ఈ పనులతో..: రోడ్డు మధ్యలో ప్లైఓవర్ బ్రిడ్జి పిల్లర్ల నిర్మాణాలతో రోడ్డు ఇరువైపులా ఇరుకుగా మారింది. రోడ్డు పనులు జరుగుతున్న ప్రాంతాలలో ప్రమాద సూచికలు, బారికేడ్లు అంతంతమాత్రంగానే ఏర్పాటు చేశారు. సర్వీసు రోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.

నివారణపై దృష్టి: హనుమాన్‌గౌడ్, ట్రాఫిక్ సీఐ మేడ్చల్

జాతీయ రోడ్డు ప్రమాదాలతో చాలా మంది మృతి చెందారు. రోడ్డు విస్తరణ జరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. సిబ్బందితో పాటు బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.


జాతీయ రహదారిపై పనులు.. ఇరుకుగా మారిన రోడ్డు

గత ఆర్నెల్లలో: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గడచిన 6 నెలల్లో 92 ప్రమాదాలు జరిగాయి. ప్రమాదాలు జరిగాయి. 36 మంది మృతిచెందారు. వందల మంది క్షతగాత్రులయ్యారు.

ఇక్కడే ఎక్కువ..: కండ్లకోయ, సీఎంఆర్ కూడలి, చెక్‌పోస్ట్ కూడలి, కౌశిక్‌దాబా సమీపంలో, వివేకానంద, ఆర్టీసీ డిపో, ఆర్టీసీకాలనీ కూడళ్లు, అత్వెల్లి మసీదు ఎదురుగా పెట్రోలుబంక్ వద్ద, రేకులబావివద్ద, డబిల్‌పూర్ కూడళ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి.

అర్ధాంతరంగా ఆగిన గ్రంథాలయ భవనం పనులు



కీసర, న్యూస్‌టుడే: కీసరలో విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రూ.కోటి వెచ్చించి అత్యాధునికంగా నిర్మిస్తున్న శాఖ గ్రంథాలయ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. విద్యార్థులు, నిరుద్యోగులకు అవసరమైన వివిధ రకాల పోటీ పరీక్షల పుస్తకాలు, ఇంటర్నెట్, ఆధునిక సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో గతేడాది మే నెలలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిధులు సరిపోకపోవడంతో గుత్తేదారు చివరి దశలో పనులు ఆపేశారు. అసంపూర్తిగా ఉన్న భవనాన్ని ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా వినియోగిస్తు పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారు. ప్రస్తుతం ఇరుకు భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయంలో పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిగిలిన పనులు పూర్తి కావాలంటే మరో రూ.20 లక్షల అవసరమని అధికారులు పేర్కొన్నారు. మిగులు పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

డబుల్ ఇళ్లు కేటాయించాలని ప్రజావాణిలో వినతి

నాచారం: నాచారం సింగం చెరువుతండాలో ఖాళీగా ఉన్న డబుల్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని కోరుతూ తండా అధ్యక్షుడు పీరూనాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాభవన్‌లోని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. అర్హులుగా ఇళ్లు ఖాళీగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకుని అర్హులకు అందజేయాలని వారు విన్నవించారు. శ్రీనివాస్‌నాయక్, లింగానాయక్, బాబా, రవినాయక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలన అందరి బాధ్యత

బోడుప్పల్, న్యూస్‌టుడే: చాపకింద నీరులా ప్రబలుతున్న క్షయ నివారణకు అందరూ కలిసికట్టుగా కదలాలని బోడుప్పల్ నగర మేయర్ అజయ్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం 28వ డివిజన్‌లో జిల్లా ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన క్షయ నిర్మూలన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కమిషనర్ రామలింగం, డివిజన్ కార్పొరేటర్ సి.నర్సింహా పాల్గొన్నారు.